ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



'శంఖారావం'


5-5-48 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

అఖిల భారత కాంగ్రెసు మహాసభ

బొంబాయి



అఖిలభారత కాంగ్రెసుకమిటీ సమావేశమునకుగాను నిర్మించబడిన 'గాంధీనగర్' సింహద్వారం. అశోకుని 'సారనాథ్ ధ్వజస్తంభం' ప్రతిమ సభ్యులకు తమ విధ్యుక్త ధర్మాన్ని అనుక్షణం జ్ఞాపకము చేస్తున్నది.




సమావేశం తొలిరోజున కాశ్మీర్, హైదరాబాదు సమస్యలపై చాలా ప్రధానమైన ప్రకటన చేశారు. పండిట్ నెహ్రూ కాంగ్రెసు అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్. పండిట్ నెహ్రూకు కుడివైపున, కార్యవర్గసభ్యులు ఆజాద్, డా. పట్టాభి ఎడమవైపునా ఆసీనులై ఉన్నారు




కాంగ్రెసు కార్యవర్గ సమావేశంలో పాల్గొనడానికి వస్తున్న ప్రధానామాత్యుడు పండిట్ జవహర్లాల్ నెహ్రూ



సమావేశానికి హాజరైన సభ్యులు గౌరవప్రేక్షకులు



ఏదో అత్యంత ప్రధానమైన విషయంగురించి ప్రధానినెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజెన్‌బాబుతో ముచ్చటిస్తున్నారు.



జుహూ విమానాశ్రయంవద్ద కాంగ్రెస్ నాయకులను స్వాగతం ఇవ్వడానికి చేరిన ప్రజలు, కాంగ్రెసు వలంటీరులు, దేశసే

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


సంపుటము 40

సంచిక 34

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder: K. NAGESWARA RAO.

సర్వధారి సంవత్సర చైత్ర బహుళ ద్వాదశి బుధవారము



కాంగ్రెస్‌సభా ముఖద్వారము
(ఫ్లడ్ లైట్సుతో దేదీప్యమానంగా వెలుగుతూంది).



ఆంధ్రపత్రిక

1948-వ సం॥ నెల మే 5-వ తేది బుధవారము

రిపబ్లికా? -- అధినివేశమా?

గతమాసం బీహారు గవర్నరు ఎమ్. ఎస్. ఆనేగారు గవర్నరు జనరల్ మౌంట్‌బాటన్‌కు తానిచ్చిన విందులో, ఆయనను (God Father of Free India) స్వతంత్ర భారత కర్త అని పొగడెను. ఈ పొగడ్త కేవలము లాంఛనముగాని భారత స్వాతంత్ర్యమునకు మౌంట్‌బాటన్ కర్తయని ఆంతర్యములో ఆనేగారు నమ్మియుందురనుటకు వీలులేదు. గతవారం రాష్ట్ర ఆర్థికమంత్రి గోపాలరెడ్డిగారు మద్రాసు రాష్ట్ర వెల్‌ఫేర్ నిధి వార్షిక సమావేశమున ప్రసంగించుచూ మౌంట్‌బాటన్ ప్రభువు మౌంట్‌బాటెన్ ఆఫ్ బర్మా అనేగాక, ఇండియా అనికూడ పిలువబడిన బాగుండుననెను. ఆనేగారి పొగడ్తవలె గోపాలరెడ్డిగారి పొగడ్తకూడ లాంఛనమే. విందు సందర్భములందు చేయు ఉపన్యాసములు సామాన్యముగ ఇదే ధోరణిలో నుండును. వాటినెవరును లెక్కపెట్టరు. వాటినిగురించి గట్టిగా ఆలోచింపరు. ఒకరిని మించి యొకరు ప్రశంసావాక్యములను ఉపయోగించుటకద్దు. భారత నూతన రాజ్యాంగ ముసాయిదా సోషియలిస్టు విధానమును సాధింపనున్నదని ఈ మధ్య దానినిగురించి రాష్ట్రఅసెంబ్లీయందు చర్చ జరిగినప్పుడు గోపాలరెడ్డిగారు వివరించిరి. దానిని సమర్థించిన రెడ్డిగారు మౌంట్‌బాటన్ ఆఫ్ ఇండియా అనికూడ బిరుదునివ్వవలెనని అనుట లాంఛనాయుతమైన అతిశయోక్తి తప్ప వేరు కాదు.

అయినప్పటికీ లాంఛనాప్రసంగములకుకూడ ప్రాముఖ్యము నివ్వకతప్పదు. 1947 ఆగస్టు 15 అనంతరము బ్రిటనుయెడ అదివరకు భారతనాయకుల కనేకులకున్న వైఖరి మారిపోవుచున్నది. రాజకీయకారణములను కొన్నిటిని పురస్కరించుకొని మౌంట్‌బాటెన్ ప్రభువును గవర్నరు జనరలుగా ఉండవలెనని నాయకులు కోరియుండవచ్చును. భారతదేశము బ్రిటీషు అధినివేశకూడలినుండి విడిపోవలెనని చెప్పినవారుకూడ ఇపుడా విషయమున గట్టిపట్టు పట్టుచున్నట్లు లేదు. భారతదేశము సర్వస్వతంత్ర రిపబ్లికుగా నుండవలెనను లక్ష్య తీర్మానము ప్రతిపాదించిన పండిత నెహ్రూకూడ ఈ మధ్య, భారతదేశము బ్రిటీషు అధినివేశకూడలినుండి విడిపోవలెనను అంశమును పరిషత్తు నిర్ణయించవలెననెను గాని విస్పష్టముగ తన పూర్వ అభిప్రాయమును పునరుద్ఘాటించలేదు. సర్వస్వతంత్ర రిపబ్లికుగా నుండవలెనను తీర్మానము అమాత్యత్రయ ప్రణాళిక ననుసరించి ఏర్పడిన పరిషత్తులో ప్రతిపాదింపబడినది. అప్పటికి జూను 3 పథకము ననుసరించి దేశవిభజన జరుగలేదు. రాజ్యాధికార ప్రదానము జరుగలేదు. పరిషత్తు సంఘము రచించిన రాజ్యాంగ ముసాయిదా సర్వస్వతంత్ర రిపబ్లికు (Sovereign Independent republic) అనుదానిని స్వతంత్ర ప్రజాసత్తాక (Democratic) రిపబ్లికు అని మార్చినది. సావరేన్ (Sovereign) అను పదములోనే స్వతంత్రమనుమాట ఇమిడియున్నది. ఇంకా Independent అనుట అనవసరమనిరి. ఈ మధ్య డా॥ అంబేడ్కరుగారు మరొక సవరణను ప్రతిపాదించిరి రిపబ్లికు అనుటకు బదులు రాజ్యము (State) అనవలెనని సూచించెను. రిపబ్లికు అనుమాటయున్న బ్రిటనుతో తెగతెంపులు చేసికొనినట్లు అగుననీ, రిపబ్లికుకు, రాజరికమునకు అతకదనీ ఆయన అభిప్రాయము. అయితే బ్రిటనుతో తెగతెంపులు చేసికొనిన ప్రమాదమేమో తెలియదు. కాశ్మీర్ విషయమున ఐక్యరాజ్యసమతిలో బ్రిటన్ వహించిన వైఖరిగాని, దక్షిణాఫ్రికాలో భారతీయులయెడ చూపుచున్న జాతిభేదవిధానముగాని భారతదేశము బ్రిటీషు అధినివేశకూడలియందుండుటకు ఉత్సాహమును కలుగజేయుటలేదు. విడిపోయిన ఆ సమస్యలు మరింత క్లిష్టమగుననీ, అంతేగాక, పాకిస్థాను అధినివేశముగా నుండిన, ఉభయులకు పరిష్కరింపబడవలసిన సమస్యలు మరింత క్లిష్టము కాగలవనీ కొందరి అభిప్రాయము. దానికి తోడుగ అమెరికను అభిప్రాయమునుకూడ గమనించవలెననీ, భారతదేశ పారిశ్రామిక అభివృద్ధికి అమెరికా సహాయ మవసరమని వారి వాదము. కాని మొన్నటివరకు స్వతంత్రముగా నుండవలెనని, దేశమును విభజించిన బ్రిటను అధినివేశముగా నుండుట తృప్తికరముగ కనుపడదు ఇంకనూ రాజభక్తి ప్రమాణమును తీసికొనుట విరుద్ధముగ నుండగలదు. అవసరమైన సైనికముగనూ ఆర్థికముగనూ బ్రిటనుతో ఒప్పందములు చేసికొనవచ్చునుగాని, భారతదేశము అధినివేశముగ మాత్రము ఉండుట తగదు, గౌరవప్రదముకూడ కాదు.

జూన్ 3, 1947 పథకము ననుసరించి, స్వతంత్ర రాజ్యాంగము నిర్మింపబడి అమలులోనికి వచ్చువరకు భారతదేశము అధినివేశముగా నుండవలెనని తాత్కాలిక ప్రభుత్వమును అధినివేశ ప్రభుత్వముగా పరిగణింప నిర్ణయింపబడెను. కాబట్టి ఇది తాత్కాలిక ఏర్పాటు మాత్రమే. అందువల్ల ప్రథమమున పండిత నెహ్రూచే సూచింపబడి ఆమోదింపబడిన రిపబ్లికే ఆశయముగా నుండవలెను. ఆపదమునుగాని, ఆ ఆశయమునుగాని, మార్చుటకు వీలులేదు.

భూసంస్కరణ-మద్రాసు రెవెన్యూమంత్రి సూచన

శాంతియుత, అహింసాత్మక విప్లవముద్వారా, భూమి, దాని సేద్యమునకు సంబంధించిన వారి సంబంధములను సరిదిద్ది, పునరుజ్జీవన మొనర్చుటకు రాష్ట్రప్రభుత్వము కృషిచేయునని చెప్పుచు రివెన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగా రొసంగిన రేడియో ఉపన్యాసములోని ఇతర హంశములు ఇప్పటికే ఆందోళనజనకములుగానున్న, భూకామందు, సేద్యగాండ్ల సంబంధములను మరింత విషమ మొనర్చునట్లున్నవి. కొంత పరిమితికి మించి భూమిగల్గిన రైతులవద్దనుండికూడ భూమిని వశపరచుకొని, ఇతరులకివ్వవలెనని మంత్రిగారిప్పుడు చేసిన సూచన ముందుమాట ఎటులుండినప్పటికీ ప్రస్తుత వ్యావసాయిక అశాంతికి మాత్ర ముపకరింపగలదు.

మన వ్యవసాయవిధానములు ఆధునికపద్ధతుల ప్రకారము సంస్కరింపబడవలెనని అనాదినుండి అందరూ అంగీకరించుచునే యున్నారు. ఏయే సంస్కరణలు జరుగవలెనో ఇప్పటికింకను నిర్ణయము కాలేదు. కాంగ్రెస్ అధ్యక్షునిచే నియమింపబడిన వ్యావసాయికసంస్కరణల సంఘమిప్పుడా విషయము ఆలోచించుచున్నది. ఆ సంఘసూచనలను, ఇతరప్రాంతములతోపాటు మన రాష్ట్రముకూడ అంగీకరించును. అట్టితరి మంత్రిగారిపుడు ఈ సూచనను చేయుట అనవసరము.

హరిజనులు, రాజకీయ బాధితులు మొదలగువారికి ఇవ్వబడు భూములు సహకారపద్ధతులపై సేద్యమొనరింపబడుననియు, ఈ విధానశ్రేష్ఠతను ప్రచారము జరుపుటకు కొన్నిసహకార వ్యవసాయకేంద్రములీ సంవత్సరమే ప్రభుత్వము స్థాపింపనున్నదనియు మంత్రిగారు సెలవిచ్చిరి. అయినదో, కొన్నిచోట్ల కొద్ది కొద్ది భూవసతి గల రైతులను సహకారవ్యవసాయకేంద్రములలో సంఘటితపరచుట, మరి కొన్నిచోట్ల, ఒక ప్రమాణమునకు మించి భూవసతిగల రైతుల భూములను ముక్కలుజేసి ఇతరులకు పంచిపెట్టి విఘటిత మొనర్చుట మంత్రిగారి ఆశయమా? తా మొనర్చిన ఈ రెండు సూచనల సహజవైరుధ్యమును మంత్రిగారు చిత్తగించివుండకపోవచ్చును.

మన రాష్ట్రములో వ్యావసాయిక అశాంతి ఇప్పటికే ప్రబలివున్నది. భూమిని వ్యవసాయకూలీలందరికి పంచిపెట్టవలెనని ఒక వర్గము జరిపిన తీవ్రప్రచార ఫలితమే ఈ అశాంతి. మంత్రిగారిప్పుడు చేసిన సూచన ఆ అశాంతినే మరింత రగుల్కొల్పును. తమ భూములు ఇతరులకు యివ్వబడునన్న భయముతో రైతులు ముందుగానే అమ్ముకొనజూచుట, అందువలన ధరలు పడిపోవుట జరుగవచ్చును. కేవలము భూమియే జీవనాధారముగా గల రైతులకు భూమిధరలు పడిపోవుట ఎంతేని నష్టదాయకము. భూముల ధరలు పడిపోవుటయేగాక భూస్వాముల పరపతికూడ పడిపోవును. పల్లెటూళ్ళలో వడ్డీరేటు పెరిగిపోవును.

మన దేశమున నూటికి డెబ్బదిమంది వ్యవసాయముపై ఆధారపడి జీవించుచున్నారు. ఇప్పుడు తలపెట్టబడుచున్న సంస్కరణలలో ఎట్టి కొద్ది లోపమున్నను దేశమంతట అనేకులు సంక్షోభపడిపోయెదరు. వ్యావసాయిక సంస్కరణలను గురించి ఇప్పుడాలోచించుచున్న సంఘము అన్ని విషయములను సాకల్యముగ ఆలోచించియే, దేశములో వ్యావసాయిక అశాంతికి దారితీయనట్టి విధానములనే సూచింపగలదు. కాబట్టి, ఎవరేమి చెప్పినను, సేద్యగాండ్లు ఆందోళన ప్రారంభించుటగాని, రైతులుభయపడుటగాని జరుగకుండ వ్యవసాయము మామూలుగా జరుగునట్లు, పరస్పరసహకారముతో వ్యవహరించుకొనవలెను.

నేటి ప్రపంచం:

సంక్షుభిత పాలస్తీనాలో ఆరబ్ రాజ్యాల యుద్ధసంరంభం



పాలస్తీనా పరిస్థితి అతి భయానకంగా పరిణమించింది. బ్రిటిష్‌వారు పెట్టిన గడువు ప్రకారం ఇక సరిగా పదేపది రోజులలో "పవిత్ర భూమి"లో మేండేటరీ పరిపాలనాధికారం సమాప్తం కాబోతున్నది. గడువు తేదీ దగ్గిరపడినకొద్దీ, యూదు అరబ్ జాతుల ఘోర సంఘర్షణ మరీ తీవ్రస్వరూపాన్ని ధరిస్తున్నది. కేవలం ఆయుధ బలప్రయోగంవల్లనే, భయంకరమైన హింసాకాండవల్లనే ఈ ఉభయజాతులవారు పాలస్తీనాలో తమతమ భవిష్యత్తును నిర్ణయించుకోడానికి సంపూర్తిగా ఉద్యుక్తులై వున్నారు. ప్రమత్తతవల్ల, అజాగ్రతవల్ల ఏ ఒక క్షణంపాటు విలంబన జరిగినా, ఏ ప్రమాదం సంభవిస్తుందోననే అనుమానంతో, బ్రిటిష్‌వారు నిష్క్రమించీ నిష్క్రమించక పూర్వమే, ఉభయులు అధికారస్థాపనకు రక్తపాత కార్యక్రమాన్ని నిర్ణయించుకుంటున్నారు.

యూదు అరబ్ జాతుల ప్రబల యుద్ధసన్నాహాల ఫలితంగా ఒక్క పాలస్తీనానేగాక, సమస్త ప్రపంచాన్నీ మహోపద్రవచ్ఛాయలు ఆవరించినట్లు ద్యోతకమవుతున్నది. ఈ వారం జరిగిన భయంకర సంఘటనలే ఇందుకు నిదర్శనలు.

* * *

యుద్ధవిరమణ సాధనకై భద్రతామండలి జెరూసెలంలోని అమెరికన్, ఫ్రెంచి, బెల్జియం కన్సల్స్ సభ్యత్వంతో ఒక ప్రత్యేక సంఘాన్ని నియమించినతర్వాత, ఐక్యరాజ్యసమితి రాజకీయ సంఘం పాలస్తీనా భవిష్యత్ రాజకీయ పరిష్కారాన్ని గురించీ, సత్వరమే జరగవలసిన ఏర్పాట్లనుగురించీ ఇప్పటికీ ఒకవైపు తర్జనభర్జన చేస్తూ మీన మేషాలు లెక్కపెడుతూనేవున్నది; మరొకవైపున వివిధఅరబ్ దేశాల సైనిక సహాయంతో అక్కడ హింసాకాండ తాండవిస్తూన్నది.

యూదు రక్షణదళాలకు చెందిన "హాగానా" సంస్థ, యూదు దౌర్జన్యవాదులకు చెందిన "ఇర్గన్ జ్వాయ్ ల్యూమీ" అనే సంస్థ రెండూ ఈమధ్య ఏకమై టెల్ అవీవ్ నగరంలో ఒక ఒప్పందం చేసుకున్నవనీ, ఒడంబడికపై సంతకాలుమాత్రం మొన్న ఏప్రిల్ 27 న జరిగినప్పటికీ, ఈ ఉభయయూదు సైనికసంస్థలు ఇప్పటికి కొన్నిమాసాలనుంచే అత్యంత సన్నిహిత సహకారంతో పనిచేస్తూ అరబ్ జాతిని, బ్రిటిష్ వారినీకూడా ప్రతిఘటిస్తున్నట్లూ స్పష్టపడుతున్నది. ఈ వార్తతోపాటు బ్రిటిష్‌వారి మాండేటరీ అధికారం అంతంకాగానే పాలస్తీనా అంతటిపైనా అరబ్ ఆధిపత్యాన్ని స్థాపించడానికి ఇరుగుపొరుగున వున్న వివిధఅరబ్ దేశాలు కూడా ఏకపంథాను అనుసరించి యూదుజాతిపై దండెత్తడానికి కృతనిశ్చయమై వున్న వర్తమానంకూడా వచ్చింది.

* * *

ఇరాక్, ఈజిప్టు, సిరియా, లెబనాన్, ట్రాన్స్‌జోర్డాన్ దేశాల రాజకీయనాయకులు, సైనికనాయకులు కలసి ట్రాన్స్‌జోర్డాన్ రాజధాని అమ్మాన్ నగరంలో ఈవారం సమావేశమై పాలస్తీనా ఆక్రమణవిషయంలో తాము అనుసరించవలసిన వ్యూహ విధానాన్ని నిర్ణయించుకున్నారు. ఈ నిర్ణయంఫలితంగానే ట్రాన్స్‌జోర్డాన్ రాజా అబ్దుల్లా యూదుజాతిపై యుద్ధప్రకటన చేసినట్లు, బ్రిటిష్ ఉద్యోగులకింద శిక్షణపొందిన తన ప్రత్యేకసేనలను పాలస్తీనాపై ప్రయోగించినట్లుకూడా వార్తలు వస్తున్నవి. ఇవి యాథార్థవార్తలేనని కొందరు, ధృవపడనివార్తలని మరికొందరూ అంటున్నప్పటికీ, అరబ్ దేశాలు సర్వసన్నాహాలను చేసుకొని యుద్ధప్రక్రియకు ఇదివరకే ఉపక్రమించి వుండకపోతే, కనీసం పిక్షణంలోనైనా ఉపక్రమించడానికి తయారుగా వున్నమాట నిజం.

ట్రాన్స్‌జోర్డాన్ రాజా అబ్దుల్లా ఈ వారారంభంలో బ్రిటిష్ హై కమీషనర్ (పాలస్తీనా) జనరల్ సర్ ఎలాన్ కన్నింగ్ హాంకు ఒక లేఖవ్రాస్తూ, పాలస్తీనాలో అరబ్ జాతికే సంపూర్ణాధిపత్యం ఏర్పడాలని కోరాడు. అరబ్బులకు, క్రిస్టియనులకు కూడా జెరూసెలం, నాజరెత్, బెతెల్‌హేం నగరాలు చరిత్రాత్మకమైన పవిత్రయాత్రాస్థలాలు కాబట్టి వాటిపై తానే పరిపాలనాధిపత్యం వహించదలచాలని కూడా ఇదే లేఖలో హెచ్చరిక చేశాడు. చదరంగం ఆటలో ప్రవీణుడని ఖ్యాతిగాంచిన అబ్దుల్లారాజా స్వార్థవైఖరి ఈ విధంగా వుండగా, యూదు జాతిపై యుద్ధప్రకటన చేశాడనడంలో గాని, తన సేనలను సరిహద్దు దాటి పంపించి పాలస్తీనాలోని యూదు పట్టణాలను ఆక్రమించాడనడంలోగాని అతిశయోక్తి ఏమీ వుండదనే నమ్మవలసివుంటుంది.

ఒక్క ట్రాన్స్‌జోర్డాన్ సేనలేగాక, ఉత్తర పాలస్తీనాపై సిరియా, లెబనాన్ సేనలు కూడా మే 1-వ తేదీ నుంచి దండయాత్ర ప్రారంభించినట్లూ, ఎగువ గెలీలీ ప్రాంతానికి చెందిన మూడు ముఖ్యమైన యూదు పట్టణాలను చుట్టుముట్టినట్లు వాటిని యూదులు తరిమి వేసినట్లూ తెలుస్తున్నది. * * *

సిరియా, లెబనాన్, ట్రాన్స్‌జోర్డాన్ సేనలు దండయాత్ర ప్రారంభించినవనే విషయం తమకు నమ్మకంగా తెలియదని బ్రిటిషువారు అంటున్నప్పటికీ, అరబ్ రాజ్యాలన్నీ పాలస్తీనా విషయంలో నిర్ణీతమైన వ్యూహంతోనే వ్యవహరిస్తున్నట్లు స్పష్టపడుతున్నది. ట్రాన్స్‌జోర్డాన్ సేనలు, ఇరాకీ సేనలు ఇరాకీ విమానబలాల సహాయంతో పాలస్తీనా పరిహద్దును అలెన్బీ వంతెనమీదుగా దాటి "డెడ్‌సీ"కి వాయవ్యంగా పాలస్తీనాలోని అరబ్ స్వతంత్ర సేనలను కలుసుకోవాలనీ, సిరియా, లెబనాన్ సేనలు ఉత్తరపాలస్తీనా సరిహద్దు దాటి జెనిన్-ఏకర్ సముద్రతీర త్రికోణ ప్రాంతాన్ని చేర్వాలనీ, ఈజిప్టుసేనలు సినాయ్ ఎడారికి వాయవ్యంగావున్న ఎల్ ఆరిష్ రాఫా పట్టణాలవద్ద సర్వసన్నద్ధమై వుండి ఆ అదనురాగానే యుద్ధరంగంలోకి దూకకపోయినా రక్షణ చర్యలకు సిద్ధపడాలని అరబ్ దేశాలు ఒక పెద్ద వ్యూహాన్ని ముందుగానే వేసుకున్నవి. ఈజిప్టుసేనలు ప్రత్యక్షంగా యుద్ధరంగంలో పాల్గొననందుకు, నౌకాబలాలను ఇచ్చి సహాయపడాలని మిగత అరబ్ దేశాలు ఆదేశించనవట.

* * *

ఐక్యరాజ్య సమితి ముగ్గురు కన్సల్స్‌తో నియమించిన యుద్ధవిరామసంఘం ఈ పరిస్థితులలో పాలస్తీనాపై యుద్ధానికి దిగవద్దనీ, తమ ఆదేశాన్ని నిర్లక్ష్యంచేసి యుద్ధకాండకు ఉపక్రమిస్తే అనేక ప్రమాద భరితమైన ఫలితాలకు దారితీసినవాడవుతాడనీ ట్రాన్స్‌జోర్డాన్ రాజుకు గట్టి హెచ్చరిక చేసింది.

"ట్రాన్స్‌జోర్డాన్ ప్రభుత్వం సర్వసైనిక సమీకరణకు సంకల్పించిందనీ, అచిరకాలంలోనే పాలస్తీనా సరిహద్దుదాటి దండయాత్రను ప్రారంభించబోతున్నదనీ మాకు తెలుస్తున్నది. ఐక్యరాజ్యసమితి ప్రస్తుతం పాలస్తీనా సమస్యనే చర్చిస్తున్నదనే విషయం మీకు తెలిసిందే. ఈ సందర్భంలో ట్రాన్స్‌జోర్డాన్ ప్రభుత్వం ఏవిధమైన యుద్ధచర్యలకు దిగినా, లేక తత్సంబంధమైన నిర్ణయాలుచేసినా, ఆ చర్యలను అతి ప్రమాదభరితమైనవిగా సమితి భావించవలసి వస్తుంది. సమితిసభ్యులందరూ వాటిని శాంతికి భంగం కలిగించే చర్యలుగా పరిగణించకతప్పదు. ఈ సలహాను త్రోసిరాజని, మీపని మీరు చేస్తే, భద్రతామండలి తీవ్రప్రతీకారానికి దిగవలసి వస్తుంది" అని కూడా ముగ్గురు ప్రతినిధుల యుద్ధవిరామసంఘం అబ్దుల్లారాజుకు ఆజ్ఞాపించింది. ట్రాన్స్‌జోర్డాన్ రాజు తన మొండిపట్టుదలను విడువకుండా యుద్ధానికే ఉపక్రమిస్తాడుగాని, శాంతిస్థాపనకు ఏవిధంగానైనా సహాయపడతాడని ఇప్పుడు వస్తున్న వార్తలనుబట్టి తోచదు.

* * *

జెరూసెలం నగరాన్ని యూదు అరబ్ సంఘర్షణలనుంచి ఏవిధంగా కాపాడవలసనే విషయంలోగాని, పాలస్తీనా అంతటిపై ఏవిధంగా ధర్మకర్తృత్వాన్ని స్థాపించాలనే విషయంలోగాని ఐక్యరాజ్యసమితి నేటికీ ఒక నిర్ణయానికి రాలేకపోతున్నది. యూదు అరబ్ జాతులమధ్య ఒక ఒప్పందం కుదిరితేనే పాలస్తీనా భవిష్యక్ పరిపాలనలో తమ కేవిధమైనబాధ్యతా వుండబోదనీ, ఈ 15-వ తేదీతో తమ నిష్క్రమణ తథ్యమేననీ బ్రిటిషు విదేశ మంత్రి బెవిన్ కామన్స సభలో మరొకసారి మొన్న స్పష్టపరిచాడు మొత్తముమీద అమెరికా తిరిగి విభజనవిధానాన్నే అమలు జరపడానికి యత్నిస్తున్నదనే అరబ్ జాతిని తీవ్రమైన అనుమానం బాధిస్తున్నది

బ్రిటిషు ప్రభుత్వం ఒక వైపు ఉపసంహార కార్యక్రమాన్ని ప్రకటిస్తూ, మరొకవైపు అదనపు సైనికులను సైతం పాలస్తీనాలో తెచ్చిపెడుతున్నది. ట్రాన్స్‌జోర్డాన్‌తో బ్రిటిషు సైనిక ఒడంబడికను ఈ వారం బ్రిటిషు ప్రభుత్వం ధృవపరచుకున్నది. అరబ్ దేశాలతో ధృవపడిన బ్రిటిషు ఒడంబడికలలో ఇదే మొదటిది. ఇరాక్‌తో గాని, ఈజిప్టుతోగాని బ్రిటన్ ఇంతవరకు సక్యమైన ఒడంబడికలు చేసుకోలేకపోయింది.

* * *


ఈ ఒడంబడికల తతంగం ఇలా వుండగా, పాలస్తీనాను సిరియా, లెబనాన్, ట్రాన్స్‌జోర్డాన్, ఈజిప్టులకు పంచివేయడానికి సమీప ప్రాచ్య దేశాలలోని బ్రిటిష్ ఏజెంటు బ్రిగడీర్ పాట్రిక్ అండ్రూ క్లేటన్ ఒక రహస్య ఒప్పందం చేసుకున్నాడని "యునైటెడ్ నేషన్స్ వరల్డ్" అనే పత్రిక సీనియర్ ఎడిటర్ ఆ పత్రికలో కొన్ని వివరాలను ప్రకటించాడు. సంక్షుభిత పాలస్తీనాలో బ్రిటన్ అతి రహస్యంగా నాటకం ఆడుతూ ప్రమాదభరితమైన ద్వంద్వ విధానాన్ని అనుసరిస్తూన్నదని కూడా ఈ వ్యాసకర్త ఆరోపణలు చేశాడు. ఈ రహస్య ఒడంబడికపైన అరబ్ ప్రముఖు లందరూ సంతకాలు చేసినట్లు తెలుస్తున్నది. మొత్తంమీద పాలస్తీనా విషయంలో బ్రిటిష్‌వారి వైఖరి అతి అనుమానాస్పదంగానే పరిణమించింది. ఈనాడు అక్కడ ఇంత భయంకరమైన రక్తపాతం సంభవిస్తున్నదంటే ప్రధాన కారణం, మేండేటరీ అధికారాన్ని చెలాయిస్తూ గత పాతిక సంవత్సరాలనుంచీ బ్రిటిషు ప్రభుత్వం అనుసరించిన "విభజించుపాలించు" విధానమే నని నిస్సందేహాంగా చెప్పవలసివుంటుంది. ఏ సమయానికి ఏ వైఖరి స్వార్థప్రయోజనాలకు అనుకూలమైనదని తోస్తే, ఆ సమయానికి ఆ విధానాన్ని బ్రిటిషు సామ్రాజ్యవాదులు అనుసరించారు. కొన్ని సమయాలలో యూదు జాతిని నెత్తిన పెట్టుకొని అరచేతిలో వైకుంఠాన్ని చూపించారు. మరికొన్ని సమయాలలో అరబ్ జాతినే తాము అంతా తవ్వితల కెత్తి ఉద్ధరించబోతున్నట్లు నటించారు. ఏ ఒక పక్షానికీ ఏ ప్రయోజనాన్నీ ఎప్పుడూ చేయకపోగా, ఉభయపక్షాలను ఒకదానిమీద మరొకదాన్ని తమ దీర్ఘపాలనలో పూర్తిగా రెచ్చగొడుతూ వచ్చారు ఈనాడు అరబ్ యూదు జాతులమధ్య వైషమ్యాగ్ని ప్రళయస్వరూపానికి వచ్చింది; దాన్ని ఎవరు ఆపినా ఆగని పరిస్థితి, ఎవరూ ఆపలేని ఉపద్రవపరిస్థితీ ఏర్పడింది.

* * *

యుద్ధశాస్త్రంలో ఆరితేరిన యూదుజాతివారు పెద్దపెట్టున మెరుపుయుద్ధం సాగించి ఒక దెబ్బతో విజయం సాధించడానికీ అరబ్ జాతివారు తండోపతండాలుగా తేనెటీగలమాదిరిగా పాలస్తీనాలో ప్రవేశించి దీర్ఘకాలం గోరిల్లా యుద్ధం సాగించి, యూదుజాతిని హింసించి ఓడించడానికి ఆలోచనలు చేస్తున్నారు. జాఫా, హైఫా, ఏకర్ అనే ముఖ్యరేవుస్థానాలను ఆక్రమించినట్లయితే, తమకు అదనపుసేనల సహాయం, ఆయుధసేనల సహాయం నిరాఘాటంగా అందుతుందని యూదుల విశ్వాసం.

యూదు అరబ్ జాతులమధ్య ఏకీభావం కుదిరితేనేగాని, పాలస్తీనాలో శాంతి సంభవంకాదనీ, శాశ్వత ధర్మకర్తృత్వ పాలనా విధానం, విదేశీసేనల ప్రయోగం ద్వారా శాంతిరక్షణ పద్ధతి శుభప్రదమైన విషయం కాదనీ మొన్న సమితి రాజకీయ సంఘంలో భారతప్రతినిధి డా॥ పి. పి. పిళ్లె హెచ్చరిక చేశాడు. ధర్మకర్తృత్వవిధానాన్ని ఖండించాడు. ఏదో ఒక తాత్కాలిక పరిపాలన ఏర్పాటు చేసి, తద్వారా ఉభయపక్షాలనూ ఒకదారికి తీసుకురావడం అవసర మన్నారు.

పాలస్తీనా విషయంలో సమితికృషి వృథా అయినట్లే కనిపిస్తుంది; సమితి చర్చలన్నీ ప్రతిష్టంభనకే దారితీసినవి. ధర్మకర్తృత్వ పరిపాలనను రష్యా, యుక్రేన్, పోలెండులు ఖండిస్తున్నవి. ఈ సమస్య చివరకు సమితి కార్యస్థానంలో కాకుండా, పాలస్తీనా భూభాగంలోనే దారుణ మారణహోమం ద్వారానే పరిష్కారం కావలసిన దుర్గతిపట్టే సూచనలు కనిపిస్తున్నవి. ద్వితీయప్రపంచ సంగ్రామానికి స్పెయిన్ అంతర్యుద్ధం ఏవిధంగా ప్రాతిపదిక అయిందో, తృతీయప్రపంచసంగ్రామానికి ఆదే విధంగా పాలస్తీనాలో యూదు అరబ్ జాతుల అంతర్యుద్ధం ప్రాతిపదిక అయితే ఆశ్చర్యపడవలసిన అగత్యమేమీ లేదు.



౯

ఆనాడే బజరోవ్‌కికూడా ఫెనీచ్కాతో పరిచయం కలిగింది. అతడు ఆర్కాడీతో తోటలో ఇటూ ఆటూ తిరుగుతున్నాడు; కొన్ని చెట్లు, ముఖ్యంగా ఓక్ చెట్లు ఎందుకు బాగా ఎదగలేదో చెపుతున్నాడు.

"తెల్ల పాప్లర్ చెట్లు వెయ్యవలసింది; సీమ ఫర్ చెట్లు, ఇంకా నిమ్మకూడా బాగానే అవుతాయి, ఇక్కడ. కొంచెం పెంట బాగా వేస్తే సరి. ఆ పొదరిల్లు బాగానే పెరిగింది," అన్నాడు, "జాకొమల్లి, ఆ ముళ్ళతీగ బాగా అల్లుకున్నాయి. అవి ఎల్లా పడితే అల్లా గడుపుకుపోతాయి, అట్టే జాగ్రత్త తీసుకోనక్కర లేదు. ఎవరో లోపల ఉన్నారే?"

ఆ పొదరింట్లో మిట్యాని ఎత్తుకుని ఫెనీచ్కా, దున్యాషా ఉన్నారు బజరోవ్ కదలకుండా నిలబడ్డాడు. ఆర్కాడీ పాత స్నేహితుడిలాగ ఫెనీచ్కాని చూసి తలఊపాడు.

"ఎవరామె?" పొదరిల్లు దాటిపోగానే బజరోవ్ అడిగాడు, "ఎంత చక్కని పిల్ల!"

"ఎవరినిగురించి?"

"అందులో ఒక పిల్లేగా చక్కగా ఉంటా?"

ఆర్కాడీ కొంచెం సంకోచం పడుతూనే ఫెనీచ్కా ఎవరో అతనికి చెప్పాడు.

"అహా!" అన్నాడు బజరోవ్—మీ నాన్నకి మంచి అభిరుచి ఉంది; స్పష్టంగా తెలుస్తోంది. నాకు నచ్చాడు మీ నాన్న. చాలా సరదాఅయినవాడు. ఏమయితే ఏం, నేను స్నేహం కలపాలి." బజరోవ్ వెనక్కి పొదరింటివేపు తిరిగాడు.

"యవ్‌గనీ", అని కంగారుగా ఆర్కాడీ కేక వేశాడు. "వద్దువద్దు, నా మాట విను. కాస్త ఆలోచించు."

"ఆట్టే కంగారుపడకు", అన్నాడు బజరోవ్, "నే నెల్లా నడుచుకోవాలో నాకు తెలుసును— నేను తెలివితక్కువ గబ్బిలాయిని కాను."

ఫెనీచ్కాను సమీపిస్తూ అతడు టోపీ తీసి చేత్తో పట్టుకున్నాడు.

"నన్ను నేనే పరిచయం చేసుకుంటున్నాను" అన్నాడు బజరోవ్—మర్యాదగా కొంచెం వంగి, "నేను కేవలం నిరపాయకరమైన మనిషిని, ఆర్కాడీ నికోలిచ్ స్నేహితుణ్ని."

ఫెనీచ్కా మాట్లాడకుండా తను కూర్చున్న తిన్నెమీదనించి లేచి నిలబడింది.

"ఎంత చక్కని పిల్లాడు!" అన్నాడు బజరోవ్. "అట్టే ఆందోళనపడవద్దు; నేను మెచ్చుకున్నంత మాత్రాన్ని ఇంతవరకూ ఎవరికీ దృష్టిదోషం తగిలి చెడు కలగలేదు. ఆ చెక్కిలంత ఉబ్బిఉన్నాయేం? దంతాలు వస్తున్నాయా?"

"మరే", అంది ఫెనీచ్కా "అప్పుడే నాలుగు పళ్ళు వచ్చాయి. ఇప్పుడు మళ్ళీ చిగుళ్ళన్నీ వాచాయి."

"ఏదీ చూస్తాను. భయపడవద్దు. నేను వైద్యుణ్ణి."

బజరోవ్ పిల్లవాణ్ణి తన చేతుల్లోకి తీసుకున్నాడు. పిల్లవాడు సంకోచమూ, భయమూ ఏమీ కనపరచకుండా వెళ్లాడు. ఫెనీచ్కాకీ, దున్యాషాకీ కూడా ఎంతో ఆశ్చర్యం వేసింది.

"సరి. సరి.. ఏమీ లేదు. అంతా సవ్యంగానే ఉంది. ఏదన్నా తేడా వస్తే నాకు చెప్పండి. మీరు కులాసాగా ఉన్నారా?"

"ఆ, భగవంతుడి దయవల్ల."

"భగవంతుడి దయ—బాగుంది—అదసలు గొప్ప విషయం. నవ్వో?" దున్యాషా వేపు తిరిగి అతడు అడిగాడు.

దున్యాషా తన యజమాని ఇంట్లో ఒక చిలక లాంటి పిల్ల, అవతల ఒక అంబాలరాణి. ఆమె సమాధానంగా కిచకిచ నవ్వింది

"సరే. బాగానే ఉంది. ఇదుగో మీ యోధుడు."

ఫెనీచ్కా పిల్లవాణ్ణి తన చేతుల్లోకి తీసుకుంది.

"మీ దగ్గర ఎంత నెమ్మదిగా ఉన్నాడు!" అంది ఆమె మెల్లగా.

"చంటిపిల్లలు నా దగ్గర నెమ్మదిగానే ఉంటారు," అన్నాడు బజరోవ్, "వాళ్ళ నెలా చనువుచెయ్యాలో నాకు తెలుసును."

"వాళ్ళ నెవరు ప్రేమగా చూస్తున్నారో చంటిపిల్లలకి తెలుస్తుంది" అంది దున్యాషా.

"నిజమే. తెలుస్తుంది," అంది ఫెనీచ్కా. "ఎందుకు, మిట్యా కొంతమంది దగ్గరకు ఏమిచ్చినా వెళ్ళడు."

"నాదగ్గరకు వస్తాడా?" అన్నాడు ఆర్కాడీ. కొంచెంసేపు అవతల నిలబడి తరవాత అతను కూడా పొదరింట్లోకి వచ్చాడు.

మిట్యాని తన దగ్గరకు తీసుకోడానికి ఎన్నో రకాల ప్రయత్నించాడు. కాని మిట్యా తల వెనక్కి విసిరి ఏడుపు ప్రారంభించాడు. ఫెనీచ్కా చాలా కంగారుపడింది.

"ఇంకోసారి వస్తాడులే. కొంచెం చనువయినతరవాత" అన్నాడు ఆర్కాడీ మన్ననగా. ఇద్దరు స్నేహితులూ కదిలిపోయారు.

"ఆమె పేరు?" బజరోవ్ అడిగాడు.

"ఫెనీచ్కా..... ఫెదోస్యా" అన్నాడు ఆర్కాడీ.

"తండ్రిపేరు? అది తెలియొద్దూ మరి?"

"నికోలేవ్నా."

"ఆమెలో నాకు నచ్చిన దేమంటే, ఎక్కువగా సంకోచపడలేదు. అలా ఉన్నందుకు కొంతమందికి తప్పుగా తోచవచ్చు. ఎంత తెలివితక్కువ! సంకోచాని కేముంది? చక్కని పిల్లవాణ్ణి కంది—అంతకంటే మంచేమిటి."

"ఆమెసంగతి సరే" అన్నాడు ఆర్కాడీ- "మా నాన్న."

"అతనికిమట్టుకు నిక్షేపంలాగ ఉన్నాడు" అన్నాడు బజరోవ్.

"ఏమో, నేనుమాత్రం అల్లా అనుకోడం లేదు."

"ఒక కొత్త వారసుడు తయారవడం నీకంత బాగా లేదనుకుంటాను."

"నాకల్లాంటి సంకుచితాభిప్రాయాల్ని అంటగట్టడానికి నీకు సిగ్గువెయ్యడంలేదూ?" ఆర్కాడీ తీవ్రంగా అన్నాడు. "ఆ దృష్టినించి మా నాన్న తప్పుచేశాడని నేను అనటంలేదు. ఆమెను వివాహం చేసుకోవలసిందని నా అభిప్రాయం."

"బాగు బాగు!" బజరోవ్ ప్రశాంతంగా అన్నాడు," ఎంత ఉదారహృదయులం మన మంతాను! వివాహానికి నువ్వింకా ఇంత ప్రాముఖ్యం ఇస్తున్నావే; ఆ పిచ్చి నీకుందని నేననుకోలేదు."

మిత్రులిద్దరు కొన్ని అడుగులు మౌనంగా నడిచారు.

"మీ నాన్న నడుపుతున్నదంతా చూశాను," బజరోవ్ మళ్ళీ ప్రారంభించాడు. "దూడా, దుడికీ బొత్తిగా నీరసంగా ఉన్నాయి. గుర్రాలకి నడుములు వంగిపోయాయి. ఇళ్ళు అంత ఎక్కువగా ఏమీ లేవు. పనివాళ్ళంతా వట్టి బడుద్ధాయిల్లా ఉన్నారు. ఆ దివాణ్‌ వట్టి మూర్ఖుడయినా అయుండాలి, కుదదొంగయినా అయుండాలి; ఈ రెంటిలో ఏదో నే నింకా తేల్చుకోలేదు."

"యవ్‌గనీ వాసిలీచ్, ఈ వేళ అన్నిటినీ చాలా తీవ్రంగా విమర్శిస్తున్నావు,"

"ఇక ప్రియతములైన ఆ రైతుబిడ్డలున్నారే, మీ నాన్నని అనుమానంలేకుండా బుట్టలో వేసేశారు. మన దేశపు సామెత తెలుసుగా; రష్యన్ రైతు దేవుడినే మోసపుచ్చగలడు."

"మా బాబయ్య చెప్పినదే నిజమని తోస్తోంది నాకు," ఆర్కాడీ అన్నాడు, "రష్యనులంటే నీకు చాలా తక్కువ అభిప్రాయముంది."

"అంచేత ఏదో పుట్టి మునిగినట్టు! రష్యనులకు ఒకటే మంచి లక్షణముంది—తమనిగురించి చాలా తక్కువ అభిప్రాయం తమకే ఉండడం. అసలు ముఖ్యమయిన విషయం ఏమంటే, రెండూ రెండూ కలిపితే నాలుగు అవుతున్నది, తక్కినదంతా వట్టి బూటకం."

"ప్రకృతికూడా బూటకమేనా?" ఆర్కాడీ దూరంగా ఉన్న పొలాలవేపు చూస్తూ ఆలోచిస్తూ అన్నాడు. ఆ పొలాలు ఇంకా ముదరని లేత ఎండలో అద్భుతంగా మెరుస్తున్నాయి.

"ప్రకృతికూడా బూటకమే, నువ్వనుకునే అర్థంలో. ప్రకృతి అంటే ఒక పవిత్ర దేవాలయం కాదు. ఒక కర్మాగారం. అందులో మనిషి ఒక పనివాడు."

ఆ సమయంలో, ఇంట్లోంచి వయలిన్ సెల్లో మీద వాయించిన దీర్ఘస్వరాలు గాలిలో తేలివస్తూ వారికి వినబడ్డాయి. షూబర్ట్ తయారుచేసిన 'నిరీక్ష' అనే గేయాన్ని ఎవరో ఆవేదనతో వాయిస్తున్నారు. ఆనాదం మధురమధురంగా గాలిలో వ్యాపిస్తోంది.

"అదేమిటి?" ఆశ్చర్యంగా బజరోవ్ అడిగాడు.

"మానాన్న"

"మీనాన్న వయలిన్ సెల్లో వాయిస్తాడా?"

"మరే"

"మీనాన్న వయస్సు?"

"నలభయినాలుగు"

బజరోవ్ చటుకుని కడుపు పగిలేటట్టు నవ్వాడు.

"ఎందుకు నవ్వుతున్నావు?"

"నిజంగానేం—నలభయినాలుగేళ్ళ మనిషి, ఓ కుటుంబానికి యజమాని, ఈ మారుమూల ఊళ్లో, వయలిన్ సెల్లో వాయించడం!"

బజరోవ్ కొంతసేపటివరకూ నవ్వుతూనే ఉన్నాడు. తన గురువంటే తనకి ఎంత గౌరవమున్నా, ఈసారిమాత్రం ఆర్కాడీ చిరునవ్వయినా నవ్వలేదు.

౧౦

పదిహేనురోజులు గడిచిపోయాయి. మెరీనోలో జీవితం ఎక్కడా తేడాలేకుండా ఒకే రకంగా నడుస్తోంది. ఆర్కాడీ ఏ పనీ చెయ్యకుండా కులాసాగా కాలం గడుపుతున్నాడు; బజరోవ్ దీక్షగా పనిచేస్తున్నాడు. ఆ యింట్లో అందరికీ అతను అలవాటయిపోయాడు; అతని నిర్లక్ష్యంతోకూడిన నడత, ముక్కతుంచినట్టు చటుకుని వచ్చే మాటలు అన్నీ అలవాటయిపోయాయి. ఫెనీచ్కాకి ముఖ్యంగా బాగా చనువయింది; ఒకనాటిరాత్రి మిట్యాకి ఎగుపులు వస్తే అతని గదికి కబురుపంపిందికూడాను. అతను వెళ్లాడు, మామూలులాగే వేళాకోళాలు ఆడుతూ, ఆవులిస్తూ. ఒక రెండు గంటలు అక్కడ కూర్చుని కుర్రవాడికి నెమ్మదించిన తరవాత వెళ్ళిపోయాడు. పావెల్ పెట్రోవిచ్ మాత్రం బజరోవ్‌ని మనోవాక్కాయకర్మల ద్వారా పూర్తిగా అసహ్యించుకునేవాడు, అతను గడ్డకట్టుకుపోయిన పొగరుబోతనీ, వట్టి మర్యాద తెలియని జంతువనీ, అవినీతిపరుడనీ అతని నిశ్చితాభిప్రాయం. బజరోవ్‌కి తనమీద గౌరవం లేదనికూడా అతని అనుమానం; అంతే కాదు, తనంటే అసహ్యమనికూడా—తనంటే! పావెల్ కిర్సానావంటే! నికొలై పెట్రోవిచ్‌కి ఆ కుర్ర 'నిహిలిస్టు'ని చూస్తే భయం. అతనితో స్నేహం ఆర్కాడీకి అంత మంచిది కాదేమోనని అనుమానంకూడా ఉంది. కాని అతను మాట్లాడుతున్నప్పుడు కుతూహలంతో వినేవాడు; అతని వైజ్ఞానిక, రాసాయనిక ప్రయోగాలను శ్రద్ధగా చూస్తుండేవాడు. బజరోవ్ ఒక సూక్ష్మదర్శినీయంత్రాన్ని తెచ్చుకున్నాడు. గంటలకొద్దీ దానితో పనిచేసుకుంటూ ఉండేవాడు. తమని వేళాకోళాలు చేస్తున్నా నేవకులంతా అతనిచుట్టూ చేరుతుండేవారు; అతను తమలోవాడే ననీ, తమ యజమానుల తరగతిలోవాడు కాడనీ వాళ్ళకి అనిపించేది. దున్యాషా ఎప్పుడూ అతనితో వేళాకోళాలు ఆడుతూ నవ్వడానికి సిద్ధంగా ఉండేది. చిన్న చెవులపిల్లిలాగ పక్కనించి పాకిపోతూ అతని వేపు అర్థవంతంగా చాటుచూపులు చూసేది. పీటర్ నూటికి నూరుపాళ్ళు మూర్ఖుడు, అనవసరమయిన దర్పం ఉందతనికి; ఎప్పుడూ అతి గంభీరంగా బొమలు ముడివేసి చూసేవాడు. అతనికి చేతనయినదల్లా, మర్యాదగా నిలబడ్డమూ, తడుముకుంటూ కాస్త చదవడమూ, కోటు శుభ్రంగా దులుపుకోడమూను. అతనుకూడా బజరోవ్ తనని చూచేసరికి ముఖం విప్పారి వెకిలిగా నవ్వేవాడు. కమతంలో కుర్రవాళ్ళు ఆ 'వైద్యుడి' వెనకాల కుక్కపిల్లల్లాగ పరుగెత్తేవారు. ముసిలి ప్రోకోఫిచ్‌కి ఒకడికే అతనంటే సరిపడేదికాదు. భోజనాలదగ్గర అతనికి కంచాన్ని అందించేటప్పుడు ముఖం వెగటుగా పెట్టేవాడు. అతన్ని 'కసాయివా'డనీ, 'నడమంత్రపువా'డనీ అనేవాడు; దవడలమీది వెంట్రుకలూ అతనూ, గుడిసెలో పందిలాగ ఉన్నాడని వర్ణించేవాడు. పావెల్ పెట్రోవిచ్ లాగే ప్రోకోఫిచ్‌కూడా ఒక రకంగా దర్జా అయినవాడు.

జూన్ మొదటిరోజులు వచ్చాయి; అవి సంవత్సరానికంతకీ సుఖమయినరోజులు. గాలి అద్భుతంగా చురుకుగా వీస్తోంది; కొంచెం దూరంలో కలరా భయపెడుతున్నమాట నిజమే; అయితే ఆప్రాంతాలవారికి కలరా రాకపోకలు కొంత అలవాటయ్యాయి. ప్రతీ ఉదయమూ బాగా చీకటితోనే లేచి బజరోవ్ మూడునాలుగు మైళ్ళు తిరిగి వస్తుండేవాడు. ఊరికే తిరిగిరావడానికి కాదు, పని లేనిదే ఊరికే తిరిగి రావడం అతనికి కిట్టదు—చిన్నకీటకాలను, మొక్కలను ఏరుకోడానికి పోతుండేవాడు. అప్పుడప్పుడు ఆర్కాడీనికూడా తీసుకుపోతూ ఉండేవాడు. తిరిగి ఇంటికిపోయేటప్పుడు ఏవో వాదప్రతివాదాలు వచ్చేవి. ఎప్పుడూ ఆర్కాడీయే పూర్తిగా ఓడిపోతుండేవాడు; నిజానికి అతనే అసలు ఎక్కువ మాట్లాడేవాడు.

(19 వ పేజీ చూడుడు)

మద్రాసు మహాజనసభ

శ్రీ దిగవల్లి వేంకటశివరావు

1844లో చెన్నపట్టణముననుండిన దేశాభిమానులైన పురప్రముఖులు కొందరు, ప్రజల కష్టములను గురించి విచారించి దానినిగూర్చి ప్రభుత్వమువారికి విన్నపములను, మహజరులను పంపుటకొరకు నొక ప్రజాసంఘమునుగా నేర్పడిరి. దానికి 'మద్రాసు నేటివు అసోసియేషన్' అని పేరు పెట్టుకొనిరి. దానికి అధ్యక్షుడు చెన్నపట్టణములోని తెలుగు వర్తకులలో నొకడైన శ్రీ గాజుల లక్ష్మీనరసు సెట్టిగారు. ఈయనకు లక్ష్మీనరసింహులుసెట్టిగారనికూడా పేరు. ఈ సంఘమువారు చాలా కష్టపడి ప్రజాసేవచేసిరి. ఆ కాలమున క్రైస్తవ మతబోధకులు చెన్నపట్టణమునందు చాలా పలుకుబడి కలిగియుండిరి. దేశీయులను తమ మతమునందు కలుపుకొనుటకనేక విధములుగా ప్రయత్నించుచుండిరి ప్రభుత్వపాఠశాలలందు తమ మతగ్రంథమైన బైబిలును ప్రవేశపెట్టుటకు పూనుకొనిరి. మద్రాసు దేశీయ ప్రజాసంఘము వారీ మిషనరీల దుష్ప్రయత్నములను ప్రతిఘటించిరి.

హిందువుల స్థితిని బాగుపరచు నుద్దేశ్యముతో లక్ష్మీనరసు గారు 'క్రెసెంట్' అను ఇంగ్లీషు వార్తాపత్రికను 1844 లోనే స్థాపించి యుండిరి. దానికి వేపేరిలో నుండిన హార్లే అను నొక ఆంగ్లేయుని సంపాదకునిగా నియమించిరి. అతడు చాలా సమర్థుడు, నిర్భయుడు, స్వాతంత్ర్యప్రియుడు. పైనచెప్పిన మిషనరీల యక్రమ ప్రయత్నములను గూర్చి తీవ్రముగా విమర్శించుచు ఆ పత్రిక చాలా జయప్రదమైన ఆందోళన జరిపించెను.

ఆకాలములో రైతులవలన శిస్తులు వసూలు చేయుటలో తూర్పు ఇండియా వర్తక కంపెనీ సర్కారు వారి యుద్యోగులు చాలా నిరంకుశముగా ప్రవర్తించుచు అనేక చిత్ర హింసలం చేయుచుండిరి ఈ యన్యాయమును గూర్చి దేశీయప్రజాసంఘమువారు 1850 మొదలు ఇంగ్లాండులోని పై యధికారుల కనేక విన్నపములను, మహజరులను పంపించి ఆందోళనము చేసిరి. దీని ఫలితముగా నొక హింసల విచారణసంఘము నియమింపబడెను. దేశీయప్రజాసంఘమువారు విన్నవించిన సంగతు లన్నియు నిజములే యని బయల్పడెను. అంతట నీ యక్రమపు పద్ధతులను రద్దుచేయుచు కొన్ని సంస్కరణలు గావించిరి

ఈ ఆందోళనమునం దెల్ల శ్రీ లక్ష్మీనరసు సెట్టిగారికి పి సోమసుందరం సెట్టిగారు కుడిభుజము వలె పని చేసిరి. ఆయన మద్రాసు నేటివు అసోసియేషనుకు గౌరవకార్యదర్శిగా నుండి చాలా ఉత్సాహముతో పనిచేసిరి. లక్ష్మీనరసు సెట్టిగారు 1868 లో చనిపోగా ఆయన స్థాపించి నడుపుచున్న దేశీయప్రజాసంఘమును, క్రెసెంటు పత్రికయు నిరాధారములై, బలహీనములై కొంతకాలమునకు అంతరించినవి.

ప్రజలలో మరల కొంత యుత్సాహమును జాతీయచైతన్యమును కలిగింపవలెనని కొందరు ప్రజానాయకులు ప్రయత్నించిరి గాని పదేండ్ల నాటి చెన్నపట్టణములోని రాజకీయ జీవనము నిర్జీవముగ స్తబ్ధమై యుండెను. (Mahajana Sabha Golden Jubjlee Number)

హిందూపత్రికాస్థాపనము

ప్రజల యావశ్యకతలనుగూర్చి ప్రకటించు వార్తాపత్రిక యొకటి అవసరమని గ్రహించి రాజా సర్ టి. మాధవరావుగారును, దివాన్ బహద్దరు ఆర్. రఘునాథరావుగారును, రంగనాథ మొదలియారుగారను పూనుకొనగా 'నేటివ్ పబ్లిక్ ఒపీనియన్' అను పత్రిక యొకటి స్థాపింపబడెను. తరువాత మైసూరులో న్యాయాధిపతియైన ఏ. రామచంద్రయ్యరుగారు స్థాపించిన 'మద్రాసీ' యను పత్రికలో నీ పత్రిక కలిపివేయబడినవి. ఈ పత్రిక కొంతకాలము చక్కగానే నడుపబడెనుగాని త్వరలోనే అది కొందరు స్వార్థపరుల చేతులలో పడెను. 1877 లో సర్ టి. ముత్తుస్వామిఅయ్యరుగారిని మద్రాస్ హైకోర్టులో న్యాయమూర్తిగా నియమించు విషయములో నీ పత్రిక అనిష్టమును ప్రకటించుటవల్లనే దాని నిజస్వభావము వెల్లడియయ్యెను. అంతట నిది ప్రజాదరణను గోల్పోయి త్వరలోనే యంతరించెను. ఇట్లు చెన్నపట్టణమున ప్రజాసేవ చేయు పత్రికయే లేకపోయెను.

ఆ సమయమున, నన‌గా 1876 లో లిట్టన్ ప్రభువు భారతదేశమునకు రాజప్రతినిధియయ్యెను. రెండు రాష్ట్రములు కరవులో మునిగి బాధపడుచుండగా నీ ప్రబుద్ధుడు 1877 లో ఢిల్లీదర్బారు నతివైభవముగా జరిపెను. దేశము కరవులోనుండి బయలుపడెనో లేదో ఇంతలోనే యితడు క్రొత్త పన్నులు విధింపసాగెను. దేశీయ వార్తాపత్రికల నిరోధకశాసనమును జేసెను. దేశీయులు ఆయుధములు ధరింపవీలులేకుండ నొక శాసనమును జేసెను అతనికి దేశీయులపట్ల దయాదాక్షిణ్యములు లేవు. పైన చెప్పిన చర్యలవలనను, ఇతడు చేసిన ఇతర చర్యల వల్లను ప్రజలలో అసంతృప్తి కలిగెను. ఈ నిరంకుశ ప్రభుత్వమునుగూర్చి విద్యాధికులైన దేశీయులు క్లబ్బులలోను, సంఘసభలలోను విమర్శింపసాగిరి కాని ఈ యభిప్రాయములనెల్ల కేంద్రీకరించుటకుగాని, ప్రజలలో దీనినిగూర్చి ప్రచారముచేయుటకుగాని ఒక వార్తాపత్రికగాని, ప్రజాసంఘముగాని లేనందువలన ప్రజల క్షేమలాభములనుగూర్చి గట్టి కృషి చేయుట కవకాశము లేకుండెను. కలకత్తాలోను, బొంబాయిలోను అట్టి పత్రికలును, ప్రజాసంఘములు, ఉండినందువలన కొంత పని జరుగుచుండెను. చెన్నపట్టణమున నట్టిది లేని కొరత విద్యాధికులమనస్సులకు బాగుగా తట్టెను. చెన్నపట్టణములో చాల కాలము క్రిందటనే తిరువల్లిక్కేణి వైజ్ఞానిక సంఘమొకటి యుండెను. ఈ లిటరరీ సొసైటిలో ఆకాలమున సర్వకళాశాలలో చదువుచుండిన విద్యార్థులు సభ్యులుగా నుండిరి. అందులో జి. సుబ్రహ్మణ్యయ్యరు, టి టి. రంగాచార్యులు, పి. వి. రంగాచార్యులు, డి. కేశవరావుపంత్, ఎం. వీరరాఘవాచార్యులు, న్యాపతి సుబ్బారావు పంతులు అను ఆరుగురు బుద్ధిశాలురు పై పరిస్థితుల నాలోచించి ఒక ఇంగ్లీషు వార్తాపత్రికను స్థాపించుటకు నిశ్చయించిరి. అంతట 1878 వ సం॥ సెప్టెంబరు 20 వ తేదీన హిందూపత్రిక ఒక వారపత్రికగా ప్రకటింపబడెను. దానికి సుబ్రహ్మణ్య అయ్యరుగారే సంపాదకులుగానుండిరి దేశములో గొప్ప సంచలనము కలిగెను. The Hindu Golden Jubılee Numb r—1928.

మద్రాస్ నేటివ్ అసోసియేషన్

1878 లో హిందూపత్రిక వారపత్రికగా స్థాపింపబడుటతో చెన్నపట్టణమును దక్షిణ హిందూదేశమునకు రాజకీయముగా నొక నూతన యుగారంభ మైనదని చెప్పవచ్చును. ఆపత్రికను స్థాపించిన వారిలో ప్రముఖులైన జి. సుబ్రహ్మణ్య అయ్యరుగారును, ఎం. వీరరాఘవాచార్యులుగారును పూర్వకాలమునాటి మద్రాస్ నేటివ్ అసోసియేషన్ అనుప్రజాసంఘమును కూడా పునరుద్ధరించుటకు పూనుకొనిరి. అంతట నా పేరుతో నొక ప్రజాసంఘము స్థాపింపబడినది. దానికి తరువాత చెన్నపట్టణమున హైకోర్టు న్యాయమూర్తిగ నుండిన (సర్) వి. భాష్యం అయ్యంగారు అధ్యక్షులుగా నియమింపబడిరి.

ఎంత సమర్థతతో నిర్వహించినను ప్రజాసేవ నిమిత్తము వార్తాపత్రిక చేయగల కృషి సంకుచితముగనే యుండును. ప్రజల బాధలనుగూర్చి తగిన ఆందోళనచేయుటకును ప్రజలలో రాజకీయ పరిజ్ఞానము కలిగించుటకును ప్రజాసంఘ ముండి తీరవలెను రైతుల స్థితిగతులను గూర్చియు, ప్రభుత్వమునందు దేశీయులకు పలుకుబడి యుండుటనుగూర్చియు, ఇంకను ప్రజలక్షేమలాభములకు సంబంధించిన ఇతరవిషయములను గూర్చియు ఎంత సమర్థులైనను వ్యక్తులు చేయగల కృషి బహుస్వల్పముగా నుండును. దానిని గూర్చి గట్టి పనిచేయుటకు ప్రజాసంఘమే సర్వవిధములుగను సామర్థ్యము కలిగియుండును.

ఆ కాలములో ప్రభుత్వోద్యోగులు ప్రజాసంఘములందు చేరగూడదను నిషేధము లేదు. అందువలన పైన చెప్పిన విధముగా స్థాపింపబడిన దేశీయప్రజాసంఘమునందు చాలామంది ప్రభుత్వోద్యోగులుకూడా సభ్యులుగా చేరిరి. ప్రభుత్వమువారి పట్ల భయభక్తులు కలిగి తమ కష్టసుఖములనుగూర్చి చాల అడకువతో విన్నపములను, మహజరులను పంపుచుండునంతకాలము అట్టి పత్రములందు ప్రభుత్వోద్యోగుల సంతకము లుండుట యొకవిధముగా లాభకరముగనే యుండెను. అయితే కొలది కాలములోనే ప్రభుత్వవైఖరి మారిపోయెను 1881 వ సం॥ నవంబరు నెలలో సర్ మౌంట్ స్టూవార్టు గ్రాంట్ డఫ్‌గారు చెన్నపట్టణమునకు గవర్నరై తమ నిరంకుశపరిపాలనమును ప్రారంభించిరి. దేశీయప్రజాసంఘములందు ప్రభుత్వోద్యోగులు చేరు విషయమున బహిరంగముగా నెట్టి నిషేధమును చేయకపోయినను, ఆ ప్రజాసంఘము యొక్క వ్యవహారములందు పాల్గొను ప్రభుత్వోద్యోగుల ననుమానముతో జూచుట ప్రారంభించెను. అంతట సర్కారు ఉద్యోగులొక్కరొక్కరే దేశీయప్రజాసంఘమునుండి జారిపోయిరి. కొంతకాలములోనే ఆ సంఘము అంతరించెను.


మహాజనసభ

క్రొత్త గవర్నరుగారి చర్యలు చాల నిరంకుశముగ నుండెను. సేలములో నొకచోట నొక క్రొత్త మసీదును కట్టగా దాని ప్రక్కనుండి హిందువుల యూరేగింపులు పోవు విషయమై తగవులు వచ్చి పోట్లాట జరిగెను. అంతలో నిది యొక రాజద్రోహకరమైన తిరుగుబాటు అని దీనికి పేరుబెట్టి దానిని అణచుటకతితీవ్రమైన విధానమవలంబింపబడెను. చాలమంది నిరపరాధులపైన కుట్రనేరములను మోపి ద్వీపాంతరములకంపిరి. ఈ విషయముననేగాక, చెంగల్పట్టులోని వ్యవహారములందు కూడా గవర్నరు అతి నిరంకుశుడై ప్రవర్తించెను. ప్రజలలో తీవ్రమైన అసంతృప్తి ప్రబలెను. దీనిగూర్చి ఆందోళన చేయుటకు ఒక బలమైన దేశీయప్రజాసంఘము అవశ్యమయ్యెను. దీనిని స్థాపించు విషయమును గూర్చి చెన్నపట్టణములోని ప్రముఖులు కొందరు తీవ్రముగా ఆలోచింపసాగిరి.

హిందూపత్రిక 1883 వ సం॥ అక్టోబరు నెల 1 వ తేదీ మొదలు వారమునకు మూడు పర్యాయములు ప్రకటింపబడసాగెను. ఇందులో సేలములోని యధికారులు చేయుచుండిన అన్యాయములు విమర్శింపబడెను. ఆ కాలమునాటి దేశీయ నాయకులకు హిందూపత్రికాకార్యాలయమే కార్యాలోచన మందిరముగ నుండెను. వారిలో సి. రంగయ్య నాయుడుగారును శ్రీమాన్ పనప్పాకం అనంతాచార్యులును ముఖ్యులు. వీరును, ఇతరులును ఆలోచించి మద్రాసు మహాజనసభ యను ప్రజాసంఘమును 1884 లో స్థాపించిరి. చెన్నపట్టణములోని ప్రజాసేవకులందరును. ఈ సంఘమునందు సభ్యులైరి. అంతట ప్రజాక్షేమమునకు సంబంధించిన వ్యవహారములెల్ల నీ ప్రజాసంఘముద్వారముననే జరుపబడ సాగెను.

చెన్నపట్టణములో నొక కేంద్రప్రజాసంఘమును, రాజధానిలోని వివిధప్రాంతములందుప శాఖ ప్రజాసంఘములను స్థాపించవలెనని ఈ సభాస్థాపకుల యుద్దేశ్యము. సభను స్థాపించినది మొదలు కొంతకాలమువరకును దాని కార్యస్థానము హిందూపత్రిక యుండిన మౌంట్ రోడ్డులోని 100 వ సంఖ్య ఇంటిలోనే యుండెను. చెన్నపట్టణములో నసంఖ్యాకములైన దానధర్మములను గావించిన ఆనంద గజపతి మహారాజులవారి హిందూపత్రికాకార్యాలయ

(18 వ పేజీ చూడుడు)



విజయవాడలో గతవారం హెచ్. జె. ఖండేకర్ గారి అధ్యక్షతను అఖిలభారత,నిమ్నజాతి పరిషత్తు వార్షిక సభ జరిగిన సందర్భమున తీసిన ఛాయాచిత్రం. అధ్యక్షుడు, సభను ప్రారంభించిన బొంబాయి మంత్రి తపసే, ఆహ్వాన సంఘాధ్యక్షులు కూర్మయ్యగారు పూలదండలు వేసుకొని ఉన్నారు.

మొగల్ చక్రవర్తులనాటి సంగీత కళాభివృద్ధి

శ్రీ కోన వేంకటరాయశర్మ

హిందువులకు బ్రహ్మనాదమే సంగీతము. అటులనే యరబ్బులకును, క్రీ. శ. 9-వ శతాబ్దమున 'బాగ్దాద్' (Baghdad) నగరమున సారస్వతవిషయములలో ప్రాచీ ప్రతీచీజాతుల ప్రతిభావ్యుత్పత్తులగూర్చిన వివాద ఘటిల్లెను. ఈ వివాదలలో సారస్వతోపాసకులు, విద్వదగ్రసరులు పాల్గొనిరి. ప్రాచ్యజాతులలో నగ్రసరులగు భారతీయుల నాగరక విజ్ఞాన ప్రాభవము లా వివాదయందు మీమాంసింపబడి, శ్వేతజాతులకంటె నన్ని విధముల ప్రాచ్య జాతు లున్నతులు, లతిశయము లని పరిగణింపబడి, పర్యవసానింపబడిన దని యా కాలపు ప్రసిద్ధ Stylist అగు 'జాహిజ్' (Jahiz) అను నతడు వ్రాసిన కరపత్రిము స్పష్టము సేయుచున్నది. హిందూ నాగరకతా ప్రాశస్త్య ప్రాముఖ్యముల గురించి యరబ్బీ యొక డొసంగిన ప్రశంసాపత్రిమే యిది.

మొగల్ కాందిశీకులు వాయువ్య దిశనుండి తమ వెంట శతాబ్దముల కొలది యరబీ పారసీక జృంభమాణ కలయికగా నున్న సంగీత సంప్రదాయముల గొనివచ్చిరి. సంగీతమునకును, భోగ్య భోగములకును, ఆనందాతిరేకమునకును నెలవగు 'బాగ్దాదు' నగరము చాల దూరములో నుండెను. 'అల్ హారొనల్ రషీదు' వంటి సహృదయుని కాలమున దప్ప నెప్పుడును మహమ్మదీయ విజ్ఞాన సారస్వతముల కునికిపట్టుగా 'బాగ్దాద్' నగరముండి యుండలేదు. ఒకప్రక్క 'అందులూషియా' (Anduisia) సరిహద్దు తరంగములు, వేఱొకవంక వంగదేశపు భీకరాటవులు,—ఉక్కిరిబిక్కిరి యగుచు నగపించుచుండెను.

'స్పెయిన్'లోని 'జార్యాబ్' (Zaryab) అను నతడును, 'బాగ్దాద్' నందలి 'ఇబ్రహీం మూజిలి' (Ibrahim Mausili) అను నతడును—ఆదర్శోపాధ్యాయులు మాత్రమేగాక ఆచరణోపాధ్యాయులుగూడనై యుండిరి. వారి పాటలు, పద్దెములు, ఫణతులు,—మహమ్మదీయ ప్రపంచమున గల ప్రతిగృహమునను బ్రతిధ్వనించుచుండెడివి. ఇవ్వికాసమే యీ జృంభణమే తరతరములుగా ననూచానములుగా భారతసంగీత ప్రోత్సాహమునకు, దత్ప్రశంసలకు—ప్రాతిపదికనైచినవి. భారతీయ సంగీతము (Indian Music) తురుష్కులకు "హిందూస్థాని" యను నొకఫణితి నొసంగుటయేగాక అరబీ, పారసీక, టర్కీ—హిందూసిద్ధాంతాదర్శములయొక్కయు, పశ్మేశనా సామరస్యములయొక్కయు,—ఫలితముగా రూపొందినది. కాని భారతీయ సంగీతము (Indian Music) కళోపాసకులను లక్షణజ్ఞులను బెక్కుర బ్రసాదింప గలిగినది.

'దిల్ రూబా, రూబబ్, ఉద్,'—అను వినూత్న సాధనలు, ఉపకరణములు,—వీణవలె హృదయంగమమై, శ్రోతృహృత్పద్మముల నలరింపజాలినవై చెవి కింపయి,—ఆ దినములలో జెజరిల్లినవి. 'అమీర్ ఖుస్రూ' (Amir Khusru) అను సంగీతవిద్వాంసుడు 'సితారు' అను వాద్యవిశేషమును గ్రొత్తగా గనిపెట్టి వ్యాప్తి గావించినాడు. ఇతడు కుశాగ్రబుద్ధి. కవితల్లజుడు; యోధాగ్రేసరుడు. ఇమ్మతిమంతుడు జన్మతః Lachin Turk అయ్యును భరత ఖండమున గాలిడి, తన కవితాప్రాగల్భ్యమును, విజ్ఞానప్రాభవవిశేషములను,—నగపఱచి, తన గ్రంథములలో నొకదానియందు భారతీయ వైచిత్ర్యముల దిక్ప్రదర్శకిన మొనర్చి, తన మాతృదేశ సౌభాగ్య రమణీయతల సమీకరించి, సమీక్షించి, యంతకంటె నెన్నదగినది, సంభావింపదగినది భారతదేశమే యని హెచ్చరించెను. భారతదేశ భాషా, వాఙ్మయ, కళోన్నతులు దేశసౌభాగ్యమును బెంటి రూపురేఖల దిద్దు ననుటయందతి యోక్తి లేదు.

తన దర్బారుయొక్క గౌరవమర్యాదలకు విప్రతిపత్తి గలుగనీక "అమీర్ఖుస్రూ" తన కవితాపటిమను, గానమాధురిమను బ్రపంచించుచు, సమకాలీనులగు సర్ ఫిలిప్ సిడ్నీ, లియోనార్డో డావింకి,—అను వారల యఖండ శేముషీవిభవమును విలోకించుచుండెను. సంగీతమున గావలి విధానము (Kavali System) ను, నింక ననేకఫణతుల (Tunes) ను,—గల్పించి, రాగముల సృజియించి, తన వేదాంత గురుడగు "షేక్ నిజాముద్దీన్ జేలియా" యను నాతని సిద్ధాంతము ననుసరించి దెర్విషు నృత్యము (Dervish dance) నందమరగ్రేమను జూపెట్టు భావగీతముల బాడుచు, వినువారిం దన్మయుల నొనర్చుచుండెన "కావలి" విధానము భరత ఖండమునగూడ మహాభివృద్ధితో బాటు సమితుఱెందినది. అక్కారణమున హిందూదేశములో "అమీర్ఖుస్రూ" వసించిన కొలది కాలములో నాతడు గనిపెట్టిన యీ సంగీత విధానమును బరికించి, ముగ్ధుడై, యతనిగూర్చియు, నాతని సంగీతవిధానమును గఱించియు,—నతని వేదాంతగురు వత్యధికముగ బ్రశంసించెను. "అమీర్ ఖుస్రూ" సంగీతవిద్యావిశారదుండు మాత్రమేగాక కృతికర్తయు నగుటవలన, దన భావపరిపుష్టి ననుసరించియు, శబలత ననుసరింయు, నుత్సాహతరంగములు ప్రేరేచ 'జానపదగీతముల' ను వ్రాసి జానపదుల నానందతరంగముల నోలలాడింపజాలిన మధురకవి ఉరుదు" భాషాచరిత్రమున జానపద సంగీత సారస్యములం గూర్చిన పరిశోధనలు జానపదగీతముల ప్రాశస్త్యము సర్వతోముఖముగ నవగతి మొనర్చుచున్నవి. 'రేఖ' అను పేరు "ఉరుదు" భాషకు గల పూర్వపు పేరు. వ్రజభాషయు, పారసీక శబలతయు,—సమ్మిళితమై యురుదుభాష విలసిల్లి హృదయంగమమైన పాటల సరఫరా చేసి పాటకపు బ్రజల హృత్పద్మముల నలరించినది.

ప్రతి జీమూతము రజతరేఖ కలిగి యున్నట్లు ప్రతి దండయాత్ర క్రొంగ్రొత్త విధానముల, నమూల్యవిశేషముల దెచ్చిపెట్టుచుండును. అప్పుడు పునసే "అమీర్ ఖుస్రూ" ఏలికయగు "నల్లాయుద్దీన్ ఖిల్జీ" యొక్క దండయాత్ర దక్కను పీఠభూములలో నవతరించినది. మహమ్మదీయదండయాత్రాపరులకు గళాప్రపూర్ణులన్నను, శిల్పులన్నను అఖండ గౌరవప్రపత్తులు, ఆదరాభిమానములు నుండుటచే దము ముట్టడి యనంతరము తత్తత్ప్రజ్ఞాశీలురకు బ్రోత్సాహసాహాయ్యముల నొసంగుచుండెడివారు.

'ఖిల్జీ' విజేత తనవెంట గళాప్రపూర్ణుల నెందఱనో గొనివచ్చి, హిందూస్థానమున వారిం బరిచయ మొనర్చి, యంతతో దనివోక, దక్షిణాపథమందలి యమలిన కళాసంప్రదాయముల, బ్రతిభాచమత్కారముల, దెఱగుల,—నవగాహ మొనర్చెను.

దక్షిణదేశమునుండి వచ్చిన గోపాలనాయకుడను సంగీత విద్వాంసుడు "అల్లాయుద్దీన్ ఖిల్జీ" దర్బారునకు వచ్చి, కళాప్రదర్శన మొనర్చి, మెప్పందినట్లు జనశ్రుతి కలదు. పండ్రెండువందల శిష్యులతో గోపాలనాయకుడు పల్యంకికలో బయనించెను. 'అమీర్ఖుస్రూ' అతని రాకను విద్యావైదుష్యమును గమనించియు నాలించియు, దన స్వంతపనలమీద దర్బారునకు రాజాలననియు, మన్నించి యంగీకరింపుడనియు,—జెప్పికొని 'ఖిల్జీ' యంగీకారము బడసెను. ఇవ్విషయ మెట్లో తెలిసికొని గోపాలనాయకుడు తన సంగీతసుధ నాస్వాదించి పరితృప్తులగువార లీ దర్బారున లేరని యెంచి ప్రదర్శన మొనర్ప శంకించెనుగాని పరిస్థితులు ప్రకోపింపగా, బ్రోద్బలపఱుపగా, జేయునదిలేక వరుసగ నాఱుదినములు దర్బారులో బ్రదర్శనముల నొసగెను. ఏడవనాడు "అమీర్ఖుస్రూ" వచ్చి దర్బారులో గోపాలనాయకుని గలసికొనియెను. ఇయ్యాఱుదినములు గోపాలనాయకుని గానామృత మీ 'యమీర్ ఖుస్రూ' దర్బారున కింకరవేషధారియై వచ్చి గ్రోలుచునే యుండెను. కాని యవ్విషయ మెఱుకపఱుపకయే యాతడు గోపాలనాయకుని తనకయి యొకసారి పాడవలసినదని వేడగా, నాయకు డొప్పికొని వీణ చేబూని దర్బారులో దొలినాడగపఱచిన భావవిన్యాసములనే, గమకములనే మరల జూపెట్టుచు గానవిహార మొనర్చెన అది చూచి "ఖుస్రూ" వెంటనే తన 'చితారు' గైకొని నాయకు డగపఱచిన భావవిన్యాసముల, బ్రతిభావ్యుత్పత్తులకంటె నతిశయముగ నతిశయ మగపఱచి శ్రోతృహృత్సరసిజముల వికసింపజేసెను

కాగా, గోపాలనాయకుడు వీణను జేబూని యంతకు ముం దగపఱచిన విశేషములకంటె నధికముగ బ్రతికీర్తనయు రాగ, భావ, పారశ్యము లతో నొప్పునట్లు లొనర్చి తన్మయత నందెను. ఇది చూచి "ఖుస్రూ" చితారు దీసికొని యాతని కంటె బదిగుణము లధికముగ శోభను దనర్చి శ్రోతల మెప్పందెను. ఇవ్విధముగ గోపాలనాయకు డన్నివిధముల దన శక్తిసామర్థ్యముల జూపుటయు, నావెనుక 'ఖుస్రూ' గోపాలనాయకునికంటె గ్రొంగ్రొత్త ప్రస్తారముల, భావరాగాలపుల నగపఱచుటయు, శ్రోత లానందించుటయు,-జరిగెను.

ఇవ్విషయ మవలోకించి గోపాలనాయకుడు చకితుడై 'ఖుస్రూ' నత్యధికముగ బ్రశంసించి బిగ్గ గౌగిలించికొనియెను. "దక్షిణాపథమునుండి వచ్చిన ప్రసిద్ధగాయకుడగు గోపాలనాయకుడు గొప్ప తార్కిక విద్వాంసుడు. అజ్ఞాతావస్థయందున్న ప్రతిభాశాలి"యని 'ఖుస్రూ' శ్లాఘించెను.

"మహమ్మద్ తుగ్లకు" దౌలతాబాదునం దొక వస్త్రువాకార భవనము వినిర్మించి యందు దర్బారు సంగీత విద్వాంసులు, నర్తకులు, నట్టువలు, ప్రదర్శనముల నొనరించి ప్రేక్షకుల నానందింపజేయ నవకాశ మొసంగెను. "జైన్-ఉల్-ఎబిడీన్" అను గొప్ప పాదుషా విద్యానిధి, ధర్మపథగామి, యై యుండి సంస్కృతము తిబెత్తుభాషలు, నేర్చి సంగీతమున గూలంకషమైన ప్రజ్ఞ గల్గియుండుటచే హిందూ మహమ్మదీయు లిర్వురును అతని సమాదరించుచుండిరి. "సులతాన్ షార్ఖి"యను నతడు శారదాదేవ్యుత్సవముల జాగించుచుండుటవలన "జౌనపురి విధాన" మనుపే రంకితమయ్యెను. అశేషశేముషీ విభవమున హైందవకళ తురుష్కుల యాదరాభిమానములతోడను, పోషణముతోడను దేజరిల్లిన దనవచ్చును.

అక్బరుచక్రవర్తి వంటి సుప్రసిద్ధు నాస్థానమున "మియాన్ తాన్సేన్" అను సంగీత సమ్రాట్టు కలడు. ఇతని యాస్థానమున నవరత్నము లుండె ననియు, నందొక రత్నమే యితడనియు దెలియనగుచున్నది. అక్బరుచక్రవర్తి కాలమున శిల్పులు, గాయకులు, చిత్రకారులు, పండితులు, కవులు విలసిల్లుచు, జక్రవర్తి యాదరాభిమానములతో బోషణతో నతిశయము గాంచుచుండిరి.

గొప్ప కళాభిమాని బాబరుచక్రవర్తి, శిల్పకళాచాతుర్యమున బేరందిన "బిహాజాడ్" వంటి శిల్పాచార్యుని శిల్పములనుగూడ గళాదృష్టితో విమర్శింపగల బుద్ధిమంతుడు. సంగీతకళలో సునిశితమైన ధీశక్తి గల్గి న్యాయైకదృష్టితో బరామర్శింపగల ప్రజ్ఞాశాలి ఇతడు తన యాస్థానమున వీణాగానయశోవిశాలురను, (Kanon) వాద్యకులను, సంగీతశాస్త్రవిశారదులను, కవులను నియమించి సంతోషాబ్ధిదోగాడుచుండెడివాడు. కావుననే యత డొకసారి "షెయిబాణీఖాన్" పాడవలసినదని యొక సందర్భమున గోరగా, శ్రోతలుక్కిరిబిక్కిరియై యతికష్టముతో నామీద నుమియుచుండ, నొక్కొక్క రొక్కొక గ్రుద్దుతో సంభావించునట్లు పాడితి" నని చమత్కరించి చెప్పెనని చాటూక్తి కలదు.

మొగలు రాజావళీయుగమున అక్బరుచక్రవర్తి శకము మహత్తరమైనది. ఇక్కాలమున సంగీతకళ యధికోన్నతి గాంచినది. "అయనీ యక్బరి" యను గ్రంథమున "అబుల్ఫజాల్" అనువాడు సంగీత విద్వాంసుల 38 మందిని బేర్కొనినాడు. పేర్కొనబడిన వారిలో "తాన్సేన్" అను నతడగ్రసరుడు ఇతడా కాలమునకేగాక భవిష్యత్కాలమునకును గొప్ప విద్వాంసుడని జనశ్రుతి గలదు. గొప్ప చారిత్రకపురుషు డతడు. అతని ప్రస్తావన లేకయే యా కాలపు జరిత్ర పూర్తి కాజాలదు. అతని బుద్ధి చాతుర్యమును, సమయస్ఫూర్తిని, అతని శిష్యప్రశిష్యవర్గము సాటుచు యశఃకీర్తి వెలయించుచుండెను. "తాన్సేన్" గ్వాలియరు హిందువు. 'బందేలు' రాజగు రాజా రామచంద్రుని కొల్వులో దొలుత విలసిల్లినవాడు. అతని జన్మస్థలము నవనవోన్మేషములగు కళాసంప్రదాయములతో దనరారుచు, నేటికిని గొప్ప జంత్రవాద్యకులకునికిపట్టయి యుండుచున్నది. గ్వాలియరు మహారాజావారి కళానిలయములు సర్వాంగశోభనములై, చూపఱుల కత్యాశ్చర్య జనకములై శోభిల్లుచున్నవి.

గ్వాలియరు మహారాణా యగు 'రాజా మానసింగు తొన్వార్' అను నతడు సుప్రసిద్ధ కళాభిమాని, అక్బరు పరిపాలనాంత్యమున నీ మహారాడా ప్రసిద్ధికి వచ్చినవాడు. ఇమ్మహారాణా సంగీతములో ద్రుపద శైలి (Drupada Style) ని బ్రవేశపెట్టిన మనీషి. "తాన్సేన్" కాలములో సంగీతకళయత్యున్నత దశ నధిష్ఠించి యమూల్యమై తనరారినది. 'తాన్సేన్' విద్వదగ్రసరుని కొక్కొక ప్రదర్శనమున కొక్కలక్ష టంకముల వంతున గ్వాలియర్ మహారాణా ఇచ్చుచుండెడి వాడట! ఇవ్విద్యాదయితుని యశఃకీర్తులను ప్రజ్ఞాప్రాభవములను గర్ణాకర్ణికగా నక్బరు చక్రవర్తి విని యాతని దన దర్బారునకు బంపవలసిన దని గ్వాలియరు మహారాజావారిని గోరగా, నిష్టము లేకున్నను 'తాన్సేన్' మహావిద్వాంసు నంపెను. ఆ సందర్భమున గ్వాలియరు మహారాణా "తాన్సేన్" సంగీత విద్వాంసుని బల్లకి నెక్కించి దానిం దన కేల బట్టి యెత్తి, భుజం బిడికొని, కొంతదూరము వోయి, తనకు గల కళాభిమానమును, ఆవిద్వాంసు నెడ దనకు గల గౌరవాభిమానములను జూపెట్టెనట! దీనింబట్టి యీ మహారాజావారికి విపశ్చిద్వరుల గౌరవించు పట్ల బడవినిమ్నోన్నతముల వాటింప నక్కఱలే దను నభిప్రాయ ముండినట్లు లవగతము కాగలదు.

ఆళ్వారు సంస్థానమున నున్న యీతనివంశ్యు లిప్పటికిని "తాన్సేన్" కళాప్రపూర్ణునకు జరిగిన రీతిగా గౌరవమర్యాదల నందుచున్నయట్లు లైతిహ్యము గలదు. అక్బరుచక్రవర్తి యిమ్మహావిద్వాంసున కట్టి లోటుపాటులు, విప్రతిపత్తులు, గలుగకుండ గంటికి ఱెప్పవోలె బరికించుచు నీతని హృదయము జూఱగొనియెను. కళాశిఖామణి యగు 'తాన్సేన్' నుపలక్షించి నప్పుడెల్లను అక్బరు చక్రవర్తి చేయెత్తి నమస్కరించుచుండెడివాడు. గ్వాలియర్ సంస్థానమున నివ్విద్యాదయితు డందుచున్న గౌరవమర్యాదల, బహుళసత్కృతుల నానుపూర్విగ వార్తాహరుల మూలమున న్వినుచుండినవా డగుటచే నక్బరు సార్వభౌము డా గాయకశిరోమణి సాహాయ్యమును, యోజనమును, అభిలషించుచుండెడివాడు. ఒకనాడు రాజప్రాసాదమునకు బ్రక్కను యారామమున జక్రవర్తియు, తాన్సేన్ మహావిద్వాంసుడును, బర్యటించుచుండ, 'తాన్సేన్' దాపున వ్రేలాడుచున్న యొక మామిడి కొమ్మ నందికొని యందలి పండువాఱిన రసాలమును గైకొన బ్రయత్నించెనుగాని దానిం ద్రుంచలేకపోయెను. కాగా; అతని వ్యర్థప్రయత్నమును విలోకించి యక్బరు చక్రవర్తి చిర్నగవుతో, నాతని దన వీపుపయి నెక్కి యా పండువాఱిన రసాలమును గైకొనవలసినదని చెప్పగా, "తాన్సేన్" మహాకవి చక్రవర్తి యుదారభావమునకచ్చెరువంది, తనపట్ల గనబఱచుచున్న యాదరాభిమానములకు, గౌరవప్రపత్తులకు, దల యొగ్గి, ముకుళితహస్తుండై, చక్రవర్తికి సభ్యతార్హమగు విధేయత (Taslim) నగపఱచెను.

దీనింబట్టి సార్వభౌము డయ్యును నక్బరు విద్య నాదరించుపట్ల న్యూనాధిక్యముల గమనింప దలంపు లేదని యగపడుచున్నది. "తాన్సేన్" తన దక్షిణహస్తమును గ్వాలియరు మహారాణా వారికి నమస్కరించుటకు మాత్రమే మీదు గట్టి నన, అక్బరు సార్వభౌముడు తనకు జూప్ర

(16 వ పేజీ చూడుడు)

బులుసూ-బలుసూ

2

బ్రహ్మశ్రీ శతావధాని చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

పాపయ్యశాస్త్రులుగారి ఔదార్యం యే పండితులకూ వున్నట్టు వినబడదు. ఒక గోదావరీ పుష్కరానికి వారి భార్యచేత పదివేలు పంచిపెట్టించినట్లు కింవదంతి. లేటు పిఠాపురం రాజావారికి సపరివారంగా ఒకరోజున చేసిన విందుకు యిరవైఅయిదువేలదాకా ఖర్చు యిందనిన్నీ వినడం. దేనికో యేదో రశీదున్నట్టు ఆయా సందర్భాలు నిజమే అని లక్షరూపాయీల ఋణం కనపడుతూనే వుంది. రు. 1-0-0 కి పదిశుంచాల బియ్యపురోజుల్లోను ఆయీ ఋణం. దీన్ని యిచ్చినవారు విజయనగర సంస్థానాధీశులు.

మహారాజావారిని వీరు ఋణంగా పెద్ద మొత్తాన్ని కోరితే వారు వీరి పేరు, ప్రఖ్యాతులు సంస్థాన పండితుల ద్వారా కర్ణతాడితమై వుండడంచేత, 'శాస్త్రుల్లుగారూ, మీకు ఋణ మెందుక్కనక, ఆయీ మొత్తాన్ని దానంగా స్వీకరించి మమ్మల్ని ఆశీర్వదించవలసిం'దనేటప్పటికి శాస్త్రుల్లుగారు- 'అమ్మ, అంతటి ద్రవ్యాన్ని దానంగా పరిగ్రహించడమేనా? మీ ఔదార్యానికి అనేకాశీర్వచనాలు. ఋణంగానే అనుగ్రహించాలి' అని పట్టు పట్టేప్పటికి మహారాజావారు ఋణమన్నప్పుడు ఆసిని బట్టి యీవలసి వుంటుంది కనక మీరు కోరే మొత్తానికి తగ్గ స్థిరాస్తిగాని, చరాస్తిగాని చూపించవలసిం దన్నారనిన్నీ, దానికి శాస్త్రుల్లుగారు ఆమోదించి, 'మహారాజా, శ్రీయుతులు పిఠాపురసంస్థానాధీశులు మాకు పద్దెనిమిది పుట్ల భూమి సర్వదుంబాలాగా కానపల్లిలంకలో దయచేసి వున్నారు కాబట్టి, ఆ భూమి యావత్తూ తనఖాగా అనుగ్రహించి ఋణమిప్పించవలసిం'దని మనవి చేసేటప్పటికి, సరే అని అంగీకరించి ఆ దానశాసనం చూపవలసిం దన్నారనిన్నీ, దానిమీద శాస్త్రుల్లుగారు 'భూమేమో మేం అనుభవిస్తూన్నాం కాని, యింకా వారు పట్టా దయచేయించలేదు. రాజావారికేర తాము వుత్తరం వ్రాయిస్తే వారు యథార్థం తమకు విశదపఱుస్తా' రనేటప్పటికి, మహారాజావారు ఆప్రకారం శ్రీ పిఠాపురం వారికి వ్రాయించారనిన్నీ, రాజావారు దానపట్టా మహారాజావారికి పంపించారనిన్నీ వినికి. అయితే శాస్త్రుల్లుగారు యీఋణం యితర సంపన్నులను కోరక విజయనగరంవారిని కోరడంలో వున్న అంతరార్థం యేమిటంటే—

రాజావారు యేదో సందర్భంలో సంతోషంతో లంకభూమి యివ్వడం జరిగింది. యిచ్చి కొన్నియేళ్లు గతించాయి. కాని పట్టా ఇవ్వనేలేదు. పట్టా దయచేయించవలసిందని మనవి చేస్తే ఆగ్రహకారణం కావచ్చు. ఆగ్రహమే వస్తే అది జుట్టుకోతదాకా (దివాన్ జీ ప్రభృతుల మాదిరి) రావచ్చు. యిదంతా యెందుకు? యీయెత్తు యెత్తితే సరి పోతుందని యెత్తి వున్నారనిన్నీ, శాస్త్రుల్లు గారు వైదికవిద్యాపండితులే కారు, అఖండలౌకికజ్ఞానధురంధరులు కూడాను అనిన్నీ చెప్పుకుంటారు.

ఈ శాస్త్రుల్లుగారి వేషం యేలాటిదంటే; నీరుకావి బట్టలేకాని చాకింటిబట్ట ముట్టరు. చొక్కా తొడగరు. విభూతి సరేసరి. చేతులో చెంబు రాగిది వుంటుంది. దాని రంగున్నూ, వారి రంగున్నూ కలిసి మెలసి వుంటాయి. ఆ చెంబు లోపటిభాగం యెఱ్ఱగా తళతళ లాడుతూ వుంటుందిగాని పైభాగం యెప్పుడూ నల్లగానే వుంటుంది. దానికి కారణం పైభాగాన్ని వుసిరికపప్పుతో తోమడమే అని చెప్పుకుంటారు. దీనికి ఫలితార్థం? వారి పత్తి విద్యలోనే కాని బాహ్యడంబరాలవల్ల ("వస్త్రేణ వపుషా వాచా" చూ.) తెలియతగ్గది కాదనియే. ("విద్యా రూపం విరూపాణామ్")

అసలు లోపల సరుకు తక్కువగా వుండేవాళ్ళకూ, యితరులకూ ముఖ్యంగా వుండే భేదం యిదే. అందులో వేషభాషల సందర్భం నేర్చుకోవాలంటే, శ్రీ వైష్ణవ పండితులను చూచి నేర్చుకోవాలి, గాని తదితరుల వల్ల నేర్చుకోవలసి వుండదని అందఱూ యెఱిగిందే. పైకి శాస్త్రుల్లుగారు శుద్ధ వైదీకంగానే వుంటారు గాని లౌకికంలోకూడా చాలా ఘనులని ఆయీ భూమిపట్టా యితిహాసంమాదిరివి చాలా యితిహాసాలు చెప్పుకుంటారు.

విజయనగరంలో జానకిరామ సోమయాజులు గారనేఅలు వేలనియోగులు కర్మఠు లుండేవారు. వీరి సోమయాజిబిరుదం యాగంచేయడంవల్ల వచ్చిందే కనక వీరికి కర్మప్రయుక్తమైన పూజ్యత్వాన్ని బ్రాహ్మణులు తోసిరా జనడానికి వీలు లేకున్నా, బహు అరుదుగానే కాని విస్తరించి కర్మఠులు వారిలో లేకపోవడంచేత వైదీకులు వారిని వైదీక సోమయాజులతోపాటు గౌరవించక ముట్టుతోపుగా యథాపూర్వంగానే ఆచరించే సందర్భంలో, ఆ సోమయాజులుగారు 'యీ విషయంలో మీ పాపయ్యశాస్త్రుల్లుగారు యే విధంగా వర్తిస్తారో ఆ ప్రకారంగా మీరు ప్రవర్తించడానికేమేనా అభ్యంతరవుంటుందా?' అని ప్రశ్నించేటప్పటికి వైదీకులకు మెసలడానికి అవకాశం లేక అలాగే,తథాస్తు అన్నారనిన్నీ— తరవాత యిందుకని కాక వారిని గౌరవించే నిమిత్తం సోమయాజులుగారు ఆహ్వానించారనిన్నీ, శాస్త్రుల్లుగారు దయచేశారనిన్నీ, వచ్చీ రావడంలో సోమయాజులుగారు కర్మజ్యేష్ఠులై వుండిన్నీ వారికుండే పాండిత్యప్రతిభ లోకాతీత మవడంచేత తామే (శాస్త్రం అందుకు వ్యతిరేకమైనా) సాష్టాంగపడ్డా రనిన్నీ, శాస్త్రుల్లుగారు సోమయాజులు గారిని—"అబ్బ! మీరేనా? మీరేనా? మీరు కర్మజ్యేష్ఠులు, అబ్బ! అబ్బ!" అని గౌరవభావాన్ని అభినయిస్తూ లేవనెత్తారు గాని ప్రతినమస్కారం, చేసినట్టూ లేదు, చేయనట్టూ లేదుగాని, చమత్కరించారనిన్నీ, (ఆ చమత్కరించడం చూచేవారికి తెలియవలసిందే అనుకోవాలి) తరవాత సోమయాజులు గారు తమ మాటే నెగ్గిందంటే, లేదు మామాటే నెగ్గింది. వూరికే మిమ్మల్ని లేవనెత్తడమే కాని, ప్రతినమస్కారం చేయలేదని వైదీకులనే వారనిన్నీ చెప్పగా మావిద్యార్థిదశలో వినడం. యీసందర్భాలన్నీ అనకట్టకు పూర్వం ముచ్చట్లు.

పాపయ్యశాస్త్రుల్లుగారు బ్రహ్మణ్యులు, లోకోత్తరులు. వారు తమతండ్రిగారి యశస్సు హైదరాబాదులో వ్యాప్తమయి వుందిగదా? అనే ధైర్యంతో తమకు వుండుకున్న ఋణం లక్షరూపాయీలు నవాబు యివ్వకపోతాడా? అని వార్ధక్యంలో హైదరాబాదు ముకాం వేశారు. నవాబుతాలూకు వుద్యోగస్థులు చాలా గౌరవించి యేలాగయితే యేమిటి, ఒక పుష్కరకాలం యత్నించి దర్శనం చేయించారు. బహుశః ఇప్పటి నైజాంగారి తాతహయాంలో జరిగివుంటుంది. యీసంఘటను యీయనతండ్రి వలెనే, ఆ సుల్తానుకూడా హిందువులంటే ప్రేమ కలవాడే అని వినికి. సుమారు గంటకాలం శాస్త్రుల్లుగారికి అవకాశం యిచ్చి, (శాస్త్రుల్లుగారు నవాబుగారికి వేదార్థం వురుదులో తర్జుమా చేయడానికి అభ్యసించి తయారైనారట?) ఆదరించి "మీకోరిక యేమిటి"అని అడిగితే "నాకోరిక యింకొకసారి దేవరవారిసందర్శనం అనుగ్రహించడమే అని అన్నారనిన్నీ తరవాత ఉద్యోగులు 'మీకోరిక చెప్పక మళ్లా దర్శనమెందుకు శాస్త్రుల్లుగారూ?' అని నొచ్చుకున్నారనిన్నీ, శాస్త్రుల్లుగారు 'నాపాండిత్యం "నావిష్ణుః పృథివీపతిః"కనుక ప్రభువుకు వినిపించకుండా పొందే సమ్మానం సమ్మాన మనిపించుకోదు గనక ఆవిధంగా కోరవలసివచ్చిం'దని ఆ వుద్యోగులకు సమాధానం చెప్పారనిన్నీ, దానిమీద వుద్యోగులు 'మఱి పన్నెండేండ్లకుగాని మళ్లా సుఖసుఖాల సుల్తానుగారి దర్శన మవుతుందా? శాస్త్రుల్లుగారూ! మీరు పొరబాటు చేశారని నొచ్చుకున్నా'రనిన్నీ, తుదకు మళ్లా దర్శనమూ లేదు, గిర్శనమూ లేదుగాని మంత్రులు సమయం కనిపెట్టి ఆస్టే మనవి చేయగా చేయగా "మన సామ్రాజ్యం పుట్టింది మొదలు నేటిదాకా చేసిన పండితసమ్మానాలలో పెద్దసమ్మానం యేదో ఆ సమ్మానం చేసి పంపవలసిం"దని ఆర్డరయిందనిన్నీ, ఆ సమ్మానం రు 6000-0-0 వేల రూపాయీలు (హాలీలు, రు 1-0-0 టికి సుమారు రు 0-3-0 లు తఱుగు) న్నూ, వొక యేనుగున్నూ, చాలా వెలగల నేల్జిదున్నూ అని లోగడ చిర్రాలవల్ల తేలిందనిన్నీ, ఆకారణంచేత వీరి అప్పు అప్పులాగే వుండిపోయిందిగాని తీరలేదనీ వినికి. యావత్తు ధనం (లక్షా అన్నమాట) నవాబువల్ల పుచ్చుకోవాలని పట్టు పట్టుకొని కూర్చోవడంవల్ల గాని అలా కాకపోతే వుద్యోగస్థులూ, సంపన్నగృహస్థులూ కలిసి పదివేలూ, అయిదువేలూ, వేయీ యీ విధంగా లక్షపూర్తి జరిగేదేఅనిన్నీ చెప్పుకోగా వినికి వుంది. కాని యివన్నీ మధ్యవాళ్ళు చెప్పుకొనే మాటలు, చిల్లరగా స్వీకరించడానికి వొడబడకపోవడమే బాగుంది. వొడబడితే—

"కాకమాంసం శునోచ్ఛిష్టం
స్వల్పం తదపి దుర్లభమ్"

మాదిరికి పరిణమించేదని తోస్తుంది. ఆయా లక్షరూపాయీలఋణంలో సగం విజయనగరం వారికనిన్నీ, తక్కినది కొంత విడివిడినోట్లనిన్నీ వినికి. యిదంతా ఆకాశపురాణంగా వినడంగాని నిపలైన సంగతి యెఱిగిన వాళ్ళ మాటలు కావు. చిల్లర బాకీదారు యెవరేనా హైదరాబాదులో వున్నప్పుడు వెడితే వాళ్ళకు పిండివంటలతో విందుచేసి యెక్కువగా ఆదరంచూపేవారనిన్నీ తీరా అడగాలనుకోవడమే కాని అడగడానికి నోరు రాక సెలవు పుచ్చుకొని చక్కా వచ్చేవారనిన్నీ చెప్పుకుంటారు. యీ తుదిమాట సత్యదూరం కాదు. ఆ మహానుభావుని దర్శనమందు ఆయీ విశేషం వుండితీరుతుంది.

నూజివీటిసంస్థానపు జమీందారులలో అందఱూ మాడపాటి వేంకటేశ్వరరావుగారి వలలో పడ్డవారేకాని, వొక్క రాజబాబయ్యగారుమాత్రం ఆయన వలలో పడలేదనిన్నీ చెప్పుకుంటారు. కారణం వేంకటేశ్వరరావుగారు యెన్నిసార్లు దర్శనానికి యత్నించినా, రాజబాబయ్యగారు పరోక్షంగా జవాబిప్పించడమే గాని సాక్షాద్దర్శనానికి అంగీకరించనే లేదనిన్నీ, ప్రత్యక్షంగా మాట్లాడితే తప్పక ఆయనకు దాసానుదాసుడు కావడం దుర్వారమని భయపడేవారనిన్నీ చెప్పుకుంటారు. వాలి తనయెదట బడ్డవానిబలంలో సగంబలాన్ని ఆకర్షించే శక్తి కలవాడంటూ చెపుతారు. ఆ మాదిరి వేంకటేశ్వరరావుగారికి సమన్వయిస్తుంది. రోజుకి మూడు డబ్బులు రొక్కం; తవ్వెడో మానెడో బియ్యం (ఇందులో కొంత అత్యుక్తి వుంటే వుంటుంది)—ఆయీ యేర్పాటుతో ప్రవేశించిన వేంకటేశ్వరరావు ఆ సంస్థానం భాగస్థులు యేడుగురిలో వొకడుగా తేలడం మాటలా, యెంతటి శక్తిసామర్థ్యాలూ కలవాడు కాకపోతే? జీవితకాలంలో యేలా ఆర్జించినా ఆఖరికి యీ రావుగారి ధర్మకార్యాలు ఆసేతుహిమాచలంవఱకూ వలిశాయి. యిందులో యెన్నో వంతున్నా తక్కిన ఆ సంస్థానీకులు చేసినట్టే లేదు. వెనకటికాలంలో—"బచ్చు రామేశంగారిని మీ రెఱుగుదురా?"అని, లేటు. పిఠాపురంరాజాగారిని గవర్నరుసభలో ప్రశ్నిస్తే రాజాగారు — "అతడు మా యెస్టేటు గ్రామాల్లో వొకగ్రామంలో వొకవీథిలో వొక యింట్లో వుండే మనిషి" అన్నారని చెప్పుకుంటారు. కాని ఆరామేశంగారికీర్తి ధాతయీశ్వరకఱవుల్లో ఆవిధంగా వ్యాపించింది. యీ క్షామంలో చుండూరి వేంకటరెడ్డిగారు కూడా ఆమాదిరిపుణ్యపురుషుడే. వ్యాసం విషయాంతరంలోకి దిగింది.

మన పాపయ్యశాస్త్రుల్లుగారు వార్ధక్యంలో ఋణబాధచేత స్వదేశం వదలి పరదేశంలో ముకాం పెట్టి గాఢంగా యత్నించి నైజాం దర్శనం చేసి గొప్ప సన్మానమే పొందినా ఋణం ఋణంలాగే వుండిపోయిం దన్నది ప్రస్తుతం. హైదరాబాదునుంచి



బొంబాయికి వెళ్ళి వుండగా పెద్ద కొమారుడు ప్రకాశశాస్త్రుల్లుగారు తండ్రిగారి దర్శనానికి వెళ్ళి ఆయన్ని రమ్మని కోరడమో, లేక తాను కూడా వారితోటే వుంటాననడమో జరిగేటప్పటికి శాస్త్రుల్లుగారు అందుకు సమ్మతించక—"నాయనా? నువ్వు కూడా యీ పడమటిదేశంలోనే వుంటే మన తూర్పుదేశాన్నెవరు ప్రకాశింపజేస్తారోయి?"అని చెప్పి పంపించేశా రనిన్నీ చెప్పగా వినికిడి.

పాపయ్యశాస్త్రుల్లుగారి పరాకాష్ఠలు యీ కాలంలో నచ్చనివి కొన్ని వున్నాయి. అందులో వొకటి-ద్విజేతరులసభల్లో వారు వేదార్థం చెప్పరనేది. అయితే నైజాం సభలో యేం చెప్పాలనుకున్నారనే ప్రశ్న వుంది. ఆయీ ప్రశ్నకు జవాబు లేకపోలేదు. నూజివీడు సంస్థానంలో మూడు రోజులు వరుసగా సభలు జరిగినా వేదశ్రుతిని స్పృశింపకుండానే కాలక్షేపం చేసినట్లు చెప్పుకోవడం. వారికి దేనికీ పుస్తకాపేక్ష లేదు. సర్వమూ హృత్కవిలి, వాచోవిధేయం. దీనికి వక యితిహాసం.

శిష్టు కృష్ణమూర్తిగారు మనదేశాన్నుంచి కాళహస్తిసంస్థానానికి వెళ్లబోతూ దానికి కారణంగా—

"త్రిస్థలీధ్వంసనారాయ
ప్రవిష్టం నాయనత్రయమ్,
తత్త్రైకస్తు కృతార్థోఽభూ
దన్యౌ ద్వౌతు భవిష్యతః"

అనే శ్లోకం యథాలాభంగా వచించారు. కృష్ణమూర్తిగారు కోటరామచంద్రపురం తాలూకాలో, కాకర్లపూడివారి సంస్థానంలో అంతకు ముందు వుండేవా రన్నమాట. పిమ్మట సుమారు పద్దెనిమి దేళ్లు కాళహస్తి సంస్థానంలో వుండి అంతట్లో లేటు పిఠాపురం రాజావారు, హింగు రామశాస్త్రిశాస్త్రుల్లుగారికి 14 పుట్ల భూమిన్నీ, బులుసు పాపయ్యశాస్త్రుల్లుగారికి 18 పుట్ల భూమిన్నీ యిచ్చా రన్నవార్త విని, మనకు మాత్రం అట్టి భూపతి ఆ దానకర్ణునివల్ల ముట్టక పోతుందా అని స్వదేశానికి వచ్చారు. వచ్చి శ్రీ రాజావారిని సందర్శించారు. పాపయ్యశాస్త్రుల్లు గారుకూడా సమయానికి అక్కడే వున్నారు. ఆయేడు విజయదశమినిగూర్చి ద్వైవిధ్యం వచ్చింది. ఆ ధర్మసందేహాన్ని రాజాగారు పాపయ్యశాస్త్రుల్లుగారిని తీర్చవలసిం దన్నారు. శాస్త్రుల్లుగారు వుభయపక్షాలలో యేది ధర్మబద్ధమో, యేది కాదో నిర్ణయించారు. శిష్టు కృష్ణమూర్తిగారికీ,శాస్త్రుల్లుగారికీ మనస్తాపాలేవో యేకగ్రామవాస్తవ్యులవడంచేత అంతకు పూర్వమే వున్నాయి. అందుచేత సంస్థానంలో ధర్మశాస్త్రినికిగా ప్రత్యేకించివున్న కంచిభొట్లవారిని కృష్ణమూర్తిగారు పురికొల్పి పాపయ్యశాస్త్రుల్లుగారు చెప్పిన దాన్ని కాదనిపించారు. అథార్టీ చూపవలసిం దని రాజాగా రడిగితే, కృష్ణమూర్తిగారు లోగడనే రచించి యిచ్చివుండడంచేత ఆ శ్లోకాలు చదివారు. రాజాగారు పాపయ్యశాస్త్రుల్లుగారిని యేమంటారు మీరు? అని ప్రశ్నించేటప్పటికి ఆ యీ శ్లోకాలు కృష్ణమూర్తిగారి కవిత్వంబాపతు గాని ఋషిప్రోక్తాలు కావని స్పష్టంగా చెప్పక వ్యంగ్యంగా తెలిసేటట్టుగా—మహాప్రభో, కృష్ణసహాయం అని వూరుకున్నారు. దానికి కృష్ణమూర్తిగారు గంభీరంగా వూరుకోక పాపుడికి

(16-వ పేజీ చూడుడు)

భారత రాజకీయాలు :

పశ్చిమబెంగాల్, సింధురాష్ట్రాలలో రాజకీయకలతలు

సింధు ప్రధాని ఖుర్రో బర్తరఫ్ గావింపబడెను. ప్రభుత్వవ్యవహారములలో అసమర్థత, అవినీతి నేరములు ఈయనపై ఆరోపింపబడెను. ఈ నేరములను విచారించుటకు త్వరలో నే ప్రత్యేక న్యాయస్థానము ఏర్పాటుచేయబడును. సింధు శాసనసభగాని, సింధు గవర్నర్ గాని గాక ఈ ప్రత్యేకచర్య కాయిదే అజాం జిన్నా స్వయముగా జరిపెను.

సింధు ముస్లింలీగ్‌లో అనాదినుండియు రెండు వర్గము లుండెను. ఒక వర్గమునకు గులాం హుస్సేన్ హిదాయతుల్లా నాయకుడు; రెండవ వర్గమునకు ఖుర్రో నాయకుడు. సింధు ప్రజలలోను, శాసనసభ్యులలోను అధికసంఖ్యాకులు ఎప్పుడును ఖుర్రో పక్షపాతులే అయినప్పటికీ జిన్నాకృపాదృష్టి గులాం నే ఆవరించెను. సింధులో ముస్లింలీగ్ ప్రభుత్వ మేర్పడినపుడు గులాంహుస్సేన్ ప్రధానియయ్యెను ఖుర్రోకు ఒక మంత్రిపదవి యివ్వబడినప్పటికీ అతడప్పుడప్పుడు తిరుగుబాటుచేయుట, జిన్నా సద్దుట జరుగుచుండెడిది. పాకిస్థాన్ స్థాపనానంతరం సింధుగవర్నర్‌గా గులాం హుస్సేన్ హిదాయతుల్లా నియమింపబడెను. ఖుర్రో ప్రధానిగా ఎన్నుకొనబడెను. రెండు వర్గముల నాయకులకు రెండు ప్రముఖపదవులు లభించెను గాబట్టి ఇక ముందు సింధులో రాజకీయ కలతలు రేకెత్తవని అప్పట్లో ఆశించినారు.

పాకిస్థాన్ రాజధానిగా కరాచీనగరము వరింపబడెను. లాహోర్‌కన్నను, మరే ఇతర పట్టణముకన్నను ఇందుకు కరాచీ తగియున్నమాట వాస్తవము. పాకిస్థాన్ కేంద్ర ప్రభుత్వమునకు, కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కావలసినన్ని అదనపు కట్టడములు గాని, సౌకర్యములుగాని కరాచీలో లేవు. అదియుగాక, కేంద్రప్రభుత్వ మున్నచోట రాష్ట్రప్రభుత్వము కూడ తన కార్యాలయములన్నింటిని కేంద్రీకరించియుంచుట మంచిదిగాక జిన్నాకు తోచెను. కాబట్టి సింధురాష్ట్ర ప్రభుత్వము తన రాజధానిని కరాచీనుండి హైదరాబాద్ (సింధు) కు మార్చుకున్నచో బాగుండునని ఆయన ద్వారా రాష్ట్రమంత్రులకు తెలియజేయబడెను. జిన్నా చెప్పుచేతులలో మొదటినుండి మెలగుచున్న గులాం ఇందుకు కాదనలేడుకదా! జిన్నా అనాదరణకు పాత్రైయుండి, ప్రజలలో మాత్రి మెక్కుడు పలుకుబడి గల్గియున్న ప్రధాని ఖుర్రో ఇందుకు ససేమిరా, కాదనెను. సింధుప్రజలత్యధిక సంఖ్యాకులు ఖుర్రోనే, ఈ విషయములో, బలపరచుచున్నారనుట నిస్సందేహము. ఈ కారణమున ఖుర్రోపై ముస్లింలీగ్ అగ్రనాయకులకు ఆగ్రహము జనించుటయం దాశ్చర్య మేమున్నది? కాందిశీకుల సమస్య ఈ ఆగ్రహమును మరింత ప్రబల మొనర్చినది. తూర్పుపంజాబ్‌నుండి వెడలిపోయిన ముస్లిం లనేకులు సింధులో స్థిరనివాస మేర్పరచుకొని, సింధు హిందువులు వదలివెళ్ళిన భూములను వ్యాపారమును తమ వర మొనరించుకొనవలెనని ప్రయత్నించుచున్నారు. ఇది జరినచో సింధులో పంజాబీ ముస్లింలకు సింధు నివాస ముస్లింలకన్న ఎక్కువ పలుకుబడి, ప్రాముఖ్యత లభించు ననుట తథ్యము. ఇది సింధు ముస్లింలకు, వారి నాయకులకు ఇష్ట ముండదు కదా! సింధుకు పంజాబీముస్లింలు వలసవచ్చుట ఖుర్రోకు యిష్టములేదు. దీనివలన కూడ ముస్లింలీగ్ అగ్రనాయకులకు ఖుర్రోపై విసుగు జనించినది. అతని నెట్లయిన పదవీభ్రష్టు నొనర్చి, తమ చెప్పుచేతులలో నుండువాని నాపదవికి నియమించవలెనని సమయమునకై వారెదురుచూచుచున్నారు. ఖుర్రోపై తనకు పూర్వమునుండి యున్న కక్షను తీర్చుకొనుటకు కూడ అదే మంచి తరుణమని గులాంహుస్సేన్ భావించినాడు.

సింధుశాసనసభ గత ఫిబ్రవరి నెలలో నే సమావేశమై బడ్జెట్‌ను ఆమోదించి, ఖుర్రోపట్ల విశ్వాసము ప్రకటించెను. తరువాత కొన్నాళ్ళకు, శాసనసభలోని ముస్లింలీగ్ పార్టీచే నియమింపబడిన స్థాయిసంఘము సమావేశమై సరఫరాశాఖలో జరిగిన కొన్ని అక్రమకార్యములను ఖండించెను. సరఫరాశాఖమంత్రియగు మీర్ గులాం ఆలీఖాన్ గవర్నర్ హిదాయతుల్లా పక్షపాతి. తనశాఖవ్యవహారములను ఇతరులు ఖండించుట కితడు కినుక వహించి, ప్రధానిని దూషించుచు ఒక ప్రకటన చేసెను. వాస్తవ పరిస్థితులను ప్రధాని ఖుర్రో ఇతనికి నచ్చజెప్పిన తరువాత ఇందుకు పశ్చాత్తాపపడుచు మరొక ప్రకటనకూడ చేసెను. కాని ఇంతలో నే ఏమి జరిగినదోగాని, మంత్రివర్గములో హిదాయతుల్లా వర్గమునకు చెందిన రెండవ మంత్రి పీర్ ఇలాహిబక్స్‌తో కలసి ఇతడు ప్రధానిపై వ్యతిరేక ప్రచారము తిరిగి ప్రారంభించెను. వీ రిద్దరు రాష్ట్రమంతా పర్యటించుచు ఈ ప్రచారము జరిపి, శాసనసభ్యులను తమవంక త్రిప్పుకొనుటకు శాసనసభ్యుల ప్రత్యేకసమావేశ మొకటి ఏర్పాటుచేసిరి. ఆ సమావేశమునకు వీ రిద్దరుగాక మరి ఆరుగురు మాత్రమే హాజరైరి; వారును ఏ తీర్మానము చేయలేరు. ఖుర్రోపై శాసనసభ్యులచే అవిశ్వాసము ప్రకటింపజేయు ఆశ అంతటితో సడలిపోగా, గవర్నర్ హిదాయతుల్లా ప్రధానిని సంప్రదించకుండా శాఖల పునర్విభజన జరిపినాడు, ప్రధాని ఖుర్రో, అతనిపట్ల విశ్వాసముగల కాజీఫజలుల్లాల శాఖలు, ప్రధానిపై తిరుగుబాటు జరిపిన పీర్, మీర్‌గారలకు పంచి యిచ్చినాడు. ప్రధానిపై తిరుగుబాటు జరిపిన వారు దండింపబడుటగాక భూషింపబడిరి! ఈ పునర్విభజనకు ప్రధాని అంగీకరించలేదు. ప్రధాని ఆజ్ఞలప్రకారము చీఫ్ సెక్రటరి ప్రభుత్వ గెజెట్‌లో ఈ మార్పును ప్రకటింప నిరాకరించెను. కాని గవర్నర్ ఆంతరంగిక కార్యదర్శియగు రాజా సంతకముతో ఈ మార్పులు ప్రచురింపబడెను అందువలన పరిపాలనలో క్రొత్త ప్రతిష్టంభన ఏర్పడెను. సింధు ముస్లింలీగ్ పక్షపత్రికయగు 'ఆల్ వహీద్' ను నిషేధించి, ఆ పత్రిక సంపాదకుని అరెస్టుచేయుచు క్రొత్త మంత్రి ఉత్తరువులు జారీచేసెను. వానిని పాత మంత్రి కాదనెను. సంపాదకుని అరెస్టు చేయలేదుగాని పత్రికను బహిష్కరించిరి. ఈ విధముగా పరిపాలన జరుగుట అసంభవమే! కాయిదే అజాం జిన్నా ఈ సమయమున సరిహద్దు రాష్ట్రములో పర్యటించుచుండెను. పర్యటన నుండి రాగానే ఈ విషయమును జిన్నా ఆలోచించునని అందరూ వేచి యుండిరి. జిన్నా రాగానే ఉభయ పక్షములు ఆయనను కలుసుకొని తమతమ వైఖరులను సమర్థించుకొనెను. శాసనసభ ముస్లింలీగ్ పార్టీలోని 37 గురు సభ్యులలో 25 గురు ఖుర్రోపట్ల విశ్వాసము ప్రకటించుచు ఒక మెమోరాండమును దాఖలుచేసిరి. ఫలితము, ఖుర్రో బర్తరఫ్ చేయబడడమే! ఖుర్రో అవినీతిని గురించి, అసమర్థతను గురించి ఇంతవరకు జరిగిన వాగ్వాదములలో ఎట్టి ప్రసక్తియు రాలేదు అది ఒక్క జిన్నాకే తట్టినది.

ఖుర్రో బర్తరఫ్ గావింపబడిన మరునాడు శాసనసభ లీగ్ పార్టీ సభ్యులు 22 గురు సమావేశమై, మెజారిటీ వోట్లతో పీర్ సాహెబ్‌ను క్రొత్త నాయకునిగా ఎన్నుకొనిరి. కాని ఇతడు ప్రధానియగుట జిన్నాకు ఇష్టములేదట. ప్రస్తుతం పాకిస్థాన్ మంత్రివర్గములోనున్న పీర్ జాదా అబ్దుస్ సత్తార్‌ను సింధ ప్రధానిగా పంపెదరట. ఇతడైనచో జిన్నా చెప్పినదానికెల్ల కొట్టును. సింధురాజధాని కరాచీనుండి హైదరాబాదుకు త్వరలో నే మారుననీ, సింధులోని 8 జిల్లాలలో 4 జిల్లాలు ఒక కమీషనరు రాష్ట్రముగా ఏర్పరచి, తక్కిన నాల్గుజిల్లాలు బెలూచిస్థాన్‌తో కలిపివేసి, సింధు రాష్ట్రమునే రద్దుపరచెదరని వదంతులు వస్తున్నవి. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్య పద్ధతికి తావులే దన్న విషయము మాత్రము తేలిపోయినది.



అంబేద్కరు



బి. సి. రాయ్

పశ్చిమబెంగాల్ రాజకీయ కలతలు

పశ్చిమబెంగాల్‌లో ప్రస్తుతము అధికారములోనున్న డా. బి. సి. రాయ్ మంత్రివర్గము మారవలెనని కాంగ్రెస్ పక్షశాసన సభ్యులు అధికసంఖ్యాకులు వాంఛించుచున్నట్లు వార్తలు వస్తున్నవి. మే 5వ తేదీన పశ్చిమబెంగాల్ శాసనసభలోని కాంగ్రెస్ పక్షసభ్యులు సమావేశమై ఈ విషయమును నిర్ణయింతురు. పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్రమోహన్ ఘోష్ నాయకత్వమున క్రొత్త మంత్రివర్గ మేర్పడునని భావించబడుచున్నది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర మేర్పడి ఇప్పటి కింకను సంవత్సరము కాలేదు. అప్పుడే రెండు మంత్రివర్గములు మారినవి.

పశ్చిమబెంగాల్ శాసనసభా కాంగ్రెస్ సభ్యులలో మొత్తము మూడు వర్గము లున్నవి. మొదటిది, ముఖ్యమైనది ఖద్దరువర్గము ఈ వర్గమునకు డా. ప్రఫుల్ల చంద్రఘోష్ నాయకుడు. ఈయన కాంగ్రెస్ కార్యవర్గములో సభ్యుడు, కాంగ్రెస్ అధిష్టానవర్గములో ఎక్కువ పలుకుబడిగలవాడు. పశ్చిమబెంగాల్ రాష్ట్ర మేర్పడగానే ఏర్పడిన మంత్రివర్గములో ప్రధానమంత్రిగా నుండెను. కాంగ్రెస్ సూత్రముల ప్రకారము, గాంధీజీ ఆశయముల ప్రకారము, పరిపాలన జరుపవలె ననువాడు. ఈయన ప్రదానిగా నుండుట రాష్ట్రప్రజలకు, కాంగ్రెస్ అధిష్టానవర్గమునకు కూడ అంగీకారమే. ఇప్పుడిప్పుడు పైకి వస్తున్నది అధికార కాంగ్రెస్‌వర్గము. ఈవర్గమునకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సురేంద్రమోహన్ ఘోష్, ఐక్యబెంగాల్ శాసనసభలో కాంగ్రెస్‌పార్టీ నాయకుడు కిరణశంకరరాయ్‌గారలు నాయకులు. ఈ వర్గమునకు చెందినవారు రాష్ట్రకాంగ్రెస్ వర్గ మందురు. మూడవది కాంగ్రెస్ పెట్టుబడి నాయకులుగా నుండుటచే దీనిని అధికారకాంగ్రెస్‌దారుల వర్గము. ఈ వర్గమునకు డా. బి సి. రాయ్ నాయకుడు. ఈయన ప్రముఖ కాంగ్రెస్‌వాది. అనేకపర్యాయములు కాంగ్రెస్ కార్యవర్గములో సభ్యుడుగా నున్నాడు. కార్యవర్గ సభ్యులలో కొంతమంది ఈయనయే ప్రధానిగా వుండవలెనని ఇప్పటికికూడా భావించుచున్నటు తెలుస్తున్నది.

డా. ఘోష్ మంత్రివర్గమును తొలగించి డా. రాయ్ మంత్రివర్గమును స్థాపించుటకు గల కారణము లేమో పూర్తిగా తెలియవు. అదియంతయు అతిరహస్యముగా జరిగిపోయినది. ఈమార్పు కేవలము పదవీవ్యామోహమువలననే జరిగిన దనుటకు సందేహము లేదు. డా. రాయ్ కన్న డా. ఘోష్‌కే ప్రజలలో ఎక్కువ పలుకుబడి వున్నదనుట నిస్సందేహము. డా. రాయ్ మంత్రివర్గ మేర్పడినప్పటినుండి దానిపట్ల చాలమందికి అసంతృప్తి కలిగినది. పదవులు తమవంతుకు రానందున కొందరు అసంతృప్తి జెందుట సహజమే. డా. రాయ్ తన మంత్రివర్గములో నళినీరంజన్ సర్కార్‌వంటి కాంగ్రెస్ వ్యతిరేకులకు కూడ స్థాన మిచ్చెను. ఇందువలన మరికొందరికి అసంతృప్తి జనించెను. డా. రాయ్ నిరంకుశప్రవర్తన, పార్టీ సమావేశము నేర్పాటు చేయుటకు నిరాకరించుట, పార్టీ నిబంధనావళినే ఆమోదింపకుండుట, ప్రస్తుత శాసనసభను రద్దుపరచవలసిందని కాంగ్రెస్ అధిష్టానవర్గమునకు సిఫార్సుచేయుట మొదలగు కారణములవలన సభ్యులకు ఆయనపై పూర్తి అవిశ్వాస మేర్పడెను. ప్రస్తుతమంత్రివర్గములో డా. రాయ్ పక్షసభ్యులేగాక, ఖాదీవర్గమునకు చెందిన ప్రఫుల్ల చంద్రసేన్, అధికార కాంగ్రెస్ వర్గమునకు చెందిన కిరణశంకరరాయ్ మొదలగువారు కూడ మంత్రులుగా నున్నారు. కాని వీరు సమయము వచ్చినప్పుడు డా. రాయ్‌ని ప్రధానమంత్రి పదవినుండి తొలగించవలెననియే ఆలోచించుచున్నారు. డా. రాయ్‌కూడ ఇట్టి కుట్రలవలననే అధికారములోనికి వచ్చెను. కాబట్టి వీరి నదుపులో పెట్టలేక పోవుచున్నాడు. ఖాదీవర్గమువారు డా. రాయ్‌మంత్రివర్గమును పడగొట్టి డా. ఘోష్‌ను తిరిగి ప్రధానిగా తేవలెనని ప్రయత్నించుచున్నారు. ఇందుకు వీరికి అధికారకాంగ్రెస్‌వర్గముసహాకార మవుసరమైయున్నది. ఆవర్గనాయకుడగు సురేంద్రమోహన ఘోష్ తానే ప్రధానికావలెనని కోరుచున్నాడు. ఇందుకు ఖాదీవర్గము అంగీకరించవచ్చును. ఈవిషయమై బహుశః ఇప్పటికే రాజీ కుదిరియుండవచ్చును.

పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ శాసనసభ్యులు 25 మంది డా. రాయ్‌కి ఒకలేఖ వ్రాస్తూ, కాంగ్రెస్‌మంత్రివర్గములో కాంగ్రెసేతరులను జేర్చుకొనటంవలన కాంగ్రెస్‌ప్రతిష్ఠ నశించిపోతున్నదనీ, ఇప్పుడుపేక్షించినచో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్‌విజయము అనుమానాస్పదమే ననీ తాము భావించుచున్నట్లు తెలియ

(21-వ పేజీ చూడుడు)

కథానిక:

వంశోద్ధారకుడు

శ్రీ పి. శ్రీనివాసరావు

శ్యామలబుగ్గలు కందివున్నాయి. ఆ కందిన బుగ్గలమీదుగా కన్నీళ్లు జారుతూ వున్నయ్.

ఊరికే యేడుస్తుందేగాని యేమీ చెప్పదు. బడికి పోతూన్నప్పుడు పెట్టుకున్న కాటుక తడిసి మొఖాన్నంత వికృతంగా చేసింది. యేడుస్తూ కళ్లను వూరికే చేతుల్తో రుద్దడంలో మరీ యెఱ్ఱబడ్డాయి కళ్లు.

యేడుస్తు యేడుస్తు తల్లిముఖం చూసి యేమో చెప్పబోయి మళ్లీ ఆగిపోతుంది. వేళ్లతో పరికిణీని మెలివేస్తుంది మధ్య మధ్య.

రేగిన శ్యామల జుత్తును సవరిస్తూ తల్లి అడిగింది. "యెందుకమ్మా యేడుస్తున్నావు? బళ్లో పంతు లేమన్నా కొట్టాడా?"

కాదన్నట్టు తల ఆడించింది శ్యామల. "మరి యింత తొందరగా వచ్చావెందుకు యేడుస్తూ? బళ్లో పిల్ల లెవరూ తిట్టలేదు గదా?" యేం జరిగిందో చెప్పకుండా శ్యామల యేడవడం ఆమె కర్థంగాలేదు. యేదో జరిగి వుండాలి—చెప్పడానికి యెందు కంత జంకు?

శ్యామలను మేష్టర్లు యెందుకు తిడతారు? శ్యామల తెలివితేటలు గల బిడ్డ అని వాళ్లందరికీ ప్రేమేగా! పాఠాలవిషయంలో శ్రద్ధచూపక పోతేగదా వాళ్లేమైనా అనడానికి? శ్యామల చదువుసంధ్యల్లో యింతవరకు లోటులేదు మరి.

కాకపోతే సహాధ్యాయు లెవరితో దెబ్బలాట జరిగిందా? దానికైనా ఆస్కారం లేదు. శ్యామల అల్లరితనంగా తిరగదు. యెక్కువగా యెవరితోనూ నేస్తం చేయదు. అలాంటప్పుడు మరి జరిగిన దేదో యెందుకు దాస్తోంది?

గడియారం రంగుమని అరగంట కొట్టింది. ఐదున్నర. బాబు వస్తుండాలి బడినుంచి. వాడొస్తేగాని యేం జరిగిందో తేలదు.

"చెప్పమ్మా యేం జరిగిందో; నా బంగారు తల్లిగదూ? నిన్నెవ రేమన్నారో చెప్పు. వాళ్ల సంగతి కనుక్కుందాం."

శ్యామల యేడ్చి యేడ్చి అలిసిపోయినా మూగనోము మాత్రం వదల్లేదు. యింకా కుంయ్ కుంయ్ లాడుతూనే వుంది. అంత మెత్తటి అమ్మాయికి యింత మొండితనం యేమిటి!

"పానీ, నువ్వు దాచినా బాబు వస్తే చెప్పడూ?" వేటకాడు వస్తున్నాడని తెలుసుకుని భయపడే జంతువులా శ్యామల గజగజలాడుతూ తల్లివొడిలో తల దాచుకుంది. యి దేమిటి? యెందు కంత భయం?

"యేం తల్లీ!" ఆమె శ్యామలవీపు నిమిరింది. చెప్పుల సవ్వడి వినిపించింది. "అదుగో అన్నయ్య వస్తున్నాడులే!" శ్యామల తలెత్తి చూస్తునే బాబు దొంగలాగా అడుగు పెట్టున్నాడు. వీళ్లిద్దర్నీ చూస్తునే వాడి ముఖకవళిక మారింది. కాళ్లు వణికిపోతున్న ట్టున్నాయి. వెనక్కు తిరిగి వెళ్లబోతుంటే తల్లి పిల్చింది. "బాబూ! యిటురా!"

బాబువాలకం వింతగా వుందేం? క్షణంలో అంతగా మారిపోయాడు! అంతగా యెందుకు భయపడ్తున్నాడో విచిత్రంగా తోచింది ఆమెకు.

"అడుకోడానికి పోవా.. లమ్మా!" బాబు తడబడ్తున్నాడు. "వెళ్దువుగానీలే, ముందు యిటు రా!" యెదురు చెప్పలేక వచ్చి యెదురుగా నిల్చున్నాడు.

"యెందు కలా జడుస్తావు? యిక్కడ కూర్చో!" అట్లాగే చేశాడు. శ్యామల, బాబు, వొకర్నొకరు భయంతో చూచుకున్నారు. క్రోధం సూచనలుకూడా లేకపోలేదు ఆ చూపుల్లో—

"యెందుకని శ్యామల బడినుంచి యేడుస్తూ వచ్చింది?" బాబు జవాబు చెప్పకుండా యిద్దరికేసి గుటకలు మింగుతూ చూస్తున్నాడు. యేమి చెప్తాడో అన్నయ్య, అన్న అనుమానం శ్యామలలో అగుపిస్తోంది.

"చెప్పవేంరా!" తల్లి గద్దించింది.

"నా కేం తెలీదమ్మా! నేనేం... చేయ లేదమ్మా!" పట్టుబడ్డ దొంగలాగా బెదరు చూపులు చూస్తున్నాడు.

యేమీ అనకముందే యెందు కలా గాభరా పడుతున్నాడు? యేం జరిగిందో చెప్పమంటే నే నేం చేయలే దంటాడేం? ఐతే బాబు కేదో సంబంధం వుండాలి, అనుకుంది తల్లి. అందుకే గ మాలు యిద్దరూ వొకరినొకరు అంత భయంగా చూస్తున్నారు! అసలు సంగతి వీడివద్దనుంచి మంచిగా లాగాలి.

"శ్యామల నేమన్నావ్? చెప్పు!"

"నే నేమనలే దమ్మా!"

"యేమీ చేయందే యెందు కలా గడ గడ లాడి పోతున్నావ్? అబద్ధ మాడావా నీకు యీ పూట డొక్క మాడిందే! యిక మీ నాన్నగారు వచ్చారంటే.. !"

బాబు లేచి పోబోతూంటే ఆమె గట్టిగా పట్టుకుని కూచోబెట్టింది. బాబు నేరస్థుడనే నమ్మకం దీంతో స్థిరమైంది. అంతేగాదు, బాబు నేరం రుజువుచేసే సాక్ష్యంకూడా దొరికింది. అదేమిటీ అంటే లాగి కూర్చోబెట్టడంలో జారిపడ్డ రంగుపెన్సిలు! అది శ్యామలకు దాని మామయ్య మొన్ననే యిచ్చిపోయాడు!

"శ్యామల పెన్సిలు నీదగ్గర కెలా వచ్చింది బాబూ?" ఆ ప్రశ్నతో బాబుముఖం బిక్కవోయింది. యిక తప్పించుకోవడం సాధ్యం కాదు.

"శ్యామలదగ్గర్నుంచి.... నేను ...వుహుం శ్యామల యిచ్చింది!"

"అబద్ధాలుకూడానా పైగా! యేం శ్యామలా? నువ్వు వీడికి పెన్సి లిచ్చావా నిజంగా?"

శ్యామల కేం చెప్పాలో తోచలేదు. నిజం చెబితే అన్నయ్య తనని బ్రతకనిస్తాడూ? ఐతే అబద్ధం చెప్పడం తప్పుగదూ మరీ? యేమైనా నిజం చెప్పా లనుకుంది.

"అన్నయ్యే ... నన్ను కొట్టి లాక్కున్నాడే!"

"మరి ఆ సంగతి యింతవరకూ చెప్పలేదేం!"

"యింట్లో చెబితే చంపేస్తానన్నాడమ్మా! యివ్వ నన్నా తిట్టి గుంజుకున్నాడు!"

బాబు కళ్లు మిటకరించాడు. యిక తప్పించుకునే మార్గాలన్నీ బంద్! "యెన్నాళ్లకూ యీ పెడబుద్ధులు మానవ్ గదా! చదువు అట్లాగే వెలగబెడ్తున్నావు. బుద్ధికలిగి వుంటావుగదా అనుకుంటే అదీ సున్న! మా కప్రతిష్ఠ తేవడానికి పుట్టిన ట్టున్నావురా తండ్రీ!"

బాబు మెల్లగా కూనిరాగాలు ఆలాపిస్తున్నాడు.

"నీముఖానికి యేడుపు కూడా దేనికీ! శ్యామల నెప్పుడూ పీడించుకు తింటున్నావు గదా! అది తెలివిగలదనీ, అందరికీ యిష్టురాలనీ, నీ కెందు కంత అసూయ! మీనాన్న రానీ వుండు!"

యిక అంతకంటె తిట్టడం ఆమె కిష్టం లేదు. వాణ్ణి మందలించడ మంటేనే అవిసెకు యేవగింపు! బాబు బాగుపడ్తా డనే ఆశ లేనాడో అడుగంటాయి!

"మీ నాన్న వచ్చేవరకు కదిలేవుసుమా!" అని చెప్పి శ్యామలను తీసుకుని వంటింట్లోకి వెళ్లిపోయింది. బాబు యిక దెబ్బ లెలాగూ తప్పవని మొండికేసి కూచున్నాడు.

* * *

రాజభూషణం యింటి కొస్తూనే బాబు చేసిన ఘనకార్యంవార్త విన్నాడు. విన్నవాడల్లా వుగ్రుడై పోయాడు.

అసలే రాజభూషణం ముక్కోపి — దానికితోడు 'ఆరోగ్యం బాగా వున్నది' అనుకోడానికి వొక్కరోజు కూడా వుండదు. అతని కోపానికి కారణం ఆ అనారోగ్యమే! ఆకోపం కొంగు పట్టుకుని తిరుగుతుంటాయి-చిరాకు, ప్రతి చిన్న విషయంలోనూ వోర్పు లేకపోవడం, అశాంతి, మొదలైన వన్నీను—అంతలోకే చిర్రుబుర్రు లాడ్డం, అంతలోకే నవ్వుతూ ఛలోక్తులు విసరడం, జరుగుతూంటాయి.

ఆఫీసులో ముఖ్యమైన ఫైల్సన్నీ రాజభూషణమే చూడాలి. తెలివితేటలు కలిగివున్నందువలన కలిగే లాభం-గాడిద చాకిరీ, తెమలని పనీ. ఆ తెలివితేటలు లేకుండినా బావుణ్ణు, అనుకునేవాడు తనరక్తం వొడ్చి పనిచేస్తున్నా ప్రమోషన్ లేదు. యితనిద్వారా బల్లకింద వ్యవహారాలు జరగవని అరవఆఫీసరుకి మంట!

పోనీ ఆఫీసు వదిలాక యింట్లో ఐనా విశ్రాంతి సున్న! యెప్పటూ యేదో గొడవ—వెసవసంసారం, సంతానమున్నా! తనకి ఆఫీసెంత నరకమో యిల్లూ అంతే—యింటి యిల్లాలయినా ఆ బాధ్యత గుర్తించదు.

ఆ దినం ఆఫీసునుంచి విసుగ్గా రావటం, వస్తూనే యింట్లో రభస వినడం, అతని ఆగ్రహాన్ని రెచ్చగొట్టాయి. ఆ కోపాన్నంతా బాబుమీద వెళ్ళగక్కాడు. వొళ్లు తెలియకుండా వాణ్ణి చావబాదాడు. యేమిటిరా, యెందుకీ పని చేశావ్? అని అడగనేలేదు. తల్లి అడ్డం రాకుంటే ఆ దినం బాబు యెముకలు సున్నమయేవి! శ్యామల అదిరిపోయి వంటింట్లోంచి తల యివతలకు మాపలేదు! కొట్టడంతో ఆయనకోపం చల్లారలేదు. యిక తిట్టడం ప్రారంభించాడు.

"వీ డిలా పాడయి పోవలసిందే! బాగుపడే యోగం లేకనే యిలాంటి గుణాలు అబ్బుతున్నాయి..."

"వొక్కగా నొక్క కొడుకు అని మురిసి పోయినందుకు బాగానే తయారవుతున్నాడు! వంశోద్ధారకుడు! రేపు పెద్దవాడయాక అందరూ తలిదండ్రుల్ని తిపతారు యెలా పెంచారో అని! మంచి కీర్తే మనకు!......"

"యెప్పుడూ యేదో వొక తుంటరిపని చెయ్యని రోజు లేదుగదా! చదువు చూడబోతే అలా అఘోరిస్తున్నాడు! బుద్ధి యిలా తగలబడింది— సహవాసం వొట్టి కోతిమూకతో..."

"ఆ సీతారాం, గోపీగాళ్ళతో తిరగొద్దురా అని నెత్తిన నోరు పెట్టుకుని కొట్టుకున్నా వింటాడా? అంత దరిద్రపు వెధవ లుండ రెక్కడా! దొంగతనాలు, చాటుగా బీడీలు కాల్చడం లాంటివికూడా వాళ్ళదగ్గర నేర్చుకుంటున్నాడేమో! పోనీ, యెప్పుడో తీసుకెళ్లి జైలు కేస్తారు. మనకు దాంతో..."

"ఛీఛీ! పిల్లలు గాదు పిడుగులు!"

* * *

యేడ్చి యేడ్చి అలిసిపోయిన శ్యామల, పగలంతా చాకిరిచేసిన రాజభూషణం, శ్యామల తల్లి—అందరూ వొళ్లుమరచి నిద్రపోతున్నారు. బాబు తిన్న దెబ్బలకు మూలుగుతూ అటూయిటూ దొర్లుతున్నాడు.

సినిమా రెండో ఆట అయిపోయిందేమో వీథిలో లైట్లు లేని జట్కాబళ్ళు మునిసిపాలిటీ వారి పుణ్యాన గతుకులు పడ్డ రోడ్డుమీద టకటక్ లాడ్తున్నయ్. రాత్రిపూట వుండే నిశ్శబ్దం మూలాన ఆ చప్పుడు మరీ కఠోరంగా వుంది.

కొన్ని నిమిషాల తర్వాత మళ్ళీ నిశ్శబ్దంలో మునిగింది రాత్రి. బాబు మూలుగుతూ పలవరిస్తున్నాడు! "అబ్బా! నన్నెందుకు బాధ పెడ్తారు? నాకీ చదు వొద్దు!" అంటూ— అమాంతంగా "అబ్బా! కొట్టకు నాన్నా!" అంటూ వులిక్కిపడి లేచాడు.

గడియారం చూశాడు. వొంటిగంట దాటింది. బాబుకళ్లు గదినంతా కలయజూశాయి. అమ్మ, నాన్న, శ్యామల మీదకు వెళ్లేసరికి ఆ చూపులలో అసూయ, క్రోధం తాండవించినై— అందరూ తనకు శత్రువులే!

ఆలోచనలో పడ్డాడు—చిన్న బుర్రలో అపాయకరమైన ఆలోచనలవి!

తన నెందుకు యింట్లోవాళ్ళందరూ, బంధువులూ, అంత చులకనగా చూస్తారు? శ్యామల అంటే మళ్ళీ అందరికీ యెంతో యిష్టం! తనను హింసించాలేం? శ్యామలను ఆదరించాలేం? ఆడపిల్లమీద అంత యిది దేనికీ?

శ్యామలమూలంగానే తనకు యీ చిక్కులన్నీ! శ్యామల లేకపోతే తనను బంగారంలా చూచుకొనేవారేమో! అది లేకుండా పోయినట్లయితే బాగుండేది.

తను చదువులో మొద్దని వీళ్లందరి వుద్దేశం. యేవిధంగా "మొద్దు" అనే విషయం బాబుకి అర్థంగాలేదు. పోనీ చదువులో తెలివితేటలు లేవే అనుకో! అది తన తప్పు యెలా అవుతుంది? "నువ్వింకా కుర్రవాడివిగానే వున్నావ్! పెద్దవాడివి గాలేదేం!" అని మందలించినట్టుంది.


తన స్నేహితులు చెడ్డవాళ్లయితే నాన్న స్నేహితులుమాత్రం మంచివాళ్లా? అప్పుడప్పుడు వచ్చే చప్పిడిముక్కు గోపాలరావు అమ్మవేపు దొంగచూపులు మాడ్డం యెన్నోసార్లు కనిపెట్టాడు. వాళ్ళందరూ బీడీలుకూడా తాగుతారు!

దెబ్బలుగాని, చీవాట్లుగాని లేనిరోజు పండుగే! యిట్లాగే యెల్లకాలం పీడిస్తారు గామాలు! మోహన్ వాళ్ళ అమ్మ, నాన్న యెంతో బాగా చూస్తారు. సినిమాలకు తీసుకెళ్తారు. మంచి బట్టలు కుట్టిస్తారు. వాడి జేబులో యెప్పుడూ డబ్బులు గలగలలాడ్తుంటాయి. నాన్న యెప్పుడన్నా సంతోషంగా ఒక్క అణా యిచ్చాడూ?

బాబు బుర్రలో తళుక్కుమని మెరిసింది ఒక వుపాయం. అపాయం లేంది గాదు! మళ్లీ ఒక్కసారి పడుకున్న వాళ్ళని చూశాడు. అందరూ మంచి నిద్రలో వున్నారు. వికసించిన ముఖంతో వెళ్ళి నాన్న జేబులోనివి యేవో తన జేబులోనికి మార్చాడు. చిన్నసంచీ తీసుకుని తన బట్టలు కొన్ని దాన్లో వేసుకున్నాడు.

తలుపులు తెరుస్తుంటే కీచుమన్నయ్. వులిక్కిపడి తిరిగి చూశాడు పడుకున్నవాళ్ళని- యెవరూ మెదల్లేదు.

ఒకటి రెండు వీథికుక్కలు మొరుగుతున్నాయి. చీకటి తెరలు తొలగకుండానే వున్నాయి.



అఖిలభారతకాంగ్రెసుమహాసభ



అఖిలభారత కాంగ్రెస్ కమిటీ గత వారాంతంలో బొంబాయిలో డా. రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన సమావేశమయ్యెను. ఎ. ఐ. సి. సి. పుట్టకనాటినుండి ఇది 56 వ సమావేశము. భారత దేశం స్వతంత్రమైన తరువాత జరిగిన బహిరంగ సమావేశమిదియే. గత సెప్టెంబరు నెలలో ఎ. ఐ. సి. సి. ఢిల్లీలో సమావేశమయ్యెనుగాని అది రహస్యసమావేశము మాత్రమే. ఎ. ఐ. సి. సి. భారత దేశమునకు అనధికార శాసనసభ వంటి దని చెప్పవచ్చును. భారత దేశము బ్రిటిషు వారి పరిపాలనలో నుండగా ఎ. ఐ. సి. సి. భారత ప్రజాప్రతినిధుల సభగా ఉండి, ప్రజాభీష్టములను, ఆశయములను ప్రతిబింబించుచుండెడిది. దేశము స్వతంత్రమై, ప్రభుత్వము ప్రజాప్రతినిధులే నిర్వహించుచున్నను ఇప్పుడు కూడ ఎ. ఐ. సి. సి. ప్రాముఖ్యత తగ్గిపోలేదు. భారత శాసనసభలో సభ్యులు దాదాపు అందరూ ఎ. ఐ. సి. సి. లో సభ్యులుగానే యున్నారు. భారత శాసనసభ సభ్యులకన్న ఎ. ఐ. సి. సి. సభ్యుల సంఖ్యయే హెచ్చు. అందువలన ఎ. ఐ. సి. సి. లో ప్రజాప్రతినిధులు ఎక్కువమంది పాల్గొనుచు, ప్రజాభిప్రాయమును మరింత స్ఫుటముగా ప్రతిబింబించుటకు వీలగుచున్నది.

గత వారాంతమున బొంబాయిలో జరిగిన ఎ. ఐ. సి. సి. అన్నివిధముల చారిత్రాత్మకమగు సమావేశమని చెప్పవలెను. ఇంతవరకు కాంగ్రెస్ లక్ష్యము భారత స్వాతంత్ర్య సముపార్జనమే. ఇప్పుడా లక్ష్యము సిద్ధించినది. అందువలన కాంగ్రెసు సంస్థను పూర్తిగా రద్దుచేయవలెనని నేడు చాలమంది అభిప్రాయపడినారు. కాంగ్రెసు సంస్థను పూర్తిపూర్తిగా రద్దుపరచక పోయినను, కాంగ్రెసు సంస్థ నిర్మాణవిధానమును పూర్తిగా మార్చివేసి, కాంగ్రెస్ లక్ష్యములను పునఃనిర్వచించవలసియున్నదని అందరును అంగీకరించిరి. ఈ ఎ. ఐ. సి. సి. సమావేశములో జరిగిన ముఖ్యకార్యమిదియే. స్వతంత్ర భారత వాతావరణమునకు, పరిస్థితులకు అనువగు నూతన కాంగ్రెస్ సంస్థను ఈ ఎ. ఐ. సి. సి. ఏర్పాటు చేసినది. కాశ్మీర్, హైదరాబాద్ సంస్థానములలో రాజకీయ పరిస్థితులు ఆందోళనకరముగ నున్నవి. కాశ్మీర్ పై భద్రతామండలి తీర్మానము మన ప్రయోజనములను వమ్ముచేయునట్లున్నది. హైదరాబాద్‌లో ఏక్షణముననైనా ప్రత్యక్ష పోరాటము సంభవించునట్లున్నది. ఇట్టి సమయమున అనధికార ప్రజాప్రతినిధిసభ సమావేశమై పరిస్థితులను గురించి ఆలోచించుట ఎంతేని అవసరము కదా! కాంగ్రెస్ నుండి సోషలిస్టులు విడిపోయి, ప్రత్యేకరాజకీయపక్షముగా ఏర్పడిన తరువాత ఎ. ఐ. సి. సి. సమావేశమగుట ఇదే ప్రథమము. ఇన్ని కారణములవలన సమావేశము చారిత్రాత్మక-మైనదని చెప్పవలెను.


బొంబాయిలో చర్చిగేట్ ప్రాంతమున సముద్రమున కభిముఖముగ ఈ సమావేశమునకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు జరుపబడినవి. 60 వేల మంది ప్రేక్షకులు కూర్చునుటకు సరిపడునట్లు, గుర్రపుగిట్ట ఆకారమున పెద్ద పందిళ్ళు వేయబడినవి. ఏ. ఐ. సి. సి. సభ్యులేగాక అన్నిరాష్ట్రముల గవర్నర్లు, ప్రధానులు, ఇతరమంత్రులు ఈ సమావేశమునకు ప్రత్యేకముగా ఆహ్వానింపబడిరి. ప్రేక్షకులు సమావేశమునకు హాజరగుటకు 'టిక్కెట్లు' అమ్మబడినవి. సమావేశ స్థలమునకు పోవుటకు శోభాయమానమగు ఒకపెద్ద ముఖద్వారము గాక, మరి మూడు ద్వారములు మూడు వైపుల అమర్చబడినవి. 5 గురు డాక్టర్లు, 60 వైద్యవిద్యార్థులు ఒక వైద్యశిబిరముగా ఏర్పడి, ఒక చిన్న వైద్యశాలను సమావేశము జరుగు పదివిద్దగ్గరనే ఏర్పాటుచేసిరి. బొంబాయి పట్టణములోని విద్యావంతులందరు ఈ సమావేశమునకు హాజరగుటకు వీలగునట్లు పట్టణములోని ప్రభుత్వ, ఇతర కార్యాలయములన్నిటికీ ఆరోజు సెలవుయివ్వబడినది. బొంబాయి పౌరులు ఈ సభలో, ఈసభ చారిత్రాత్మకతకు, తమ పట్టణప్రసిద్ధికి తగినంత తండోపతండములుగా పాల్గొనినారు. ఎ. ఐ. సి. సి. సమావేశమునకు వచ్చిన పండిట్ నెహ్రూను విమానాశ్రయము వద్ద స్వాగత మిచ్చుటకు చేరిన జనసమూహము గుండా పోవుటకు ఆయనకు త్రోవయే దొరకలేదు. ఆయనకు స్వాగతమిచ్చుటకు జరుపదలచిన గౌరవసైనికవిన్యాసము, విమానాశ్రయమంతయు ప్రజలతో నిండిపోవుటచే, మానుకొనవలసివచ్చినది.

సభాకార్యక్రమం

దేశ రాజకీయ పరిస్థితి

దేశ రాజకీయపరిస్థితిని గూర్చి మహాసభలో ప్రత్యేకతీర్మాన మేదియు చేయబడలేదు. సభను ప్రారంభించుచు అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాద్, ఆయనతరువాత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయపరిస్థితులను గూర్చి విపులముగా నుపన్యసించిరి. సభికులనే గాక దేశమునంతను ఎక్కువగా ఆందోళన పరచుచున్న హైదరాబాద్ పరిస్థితినిగూర్చి సంస్థానశాఖమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రత్యేక సందేశ మంపినాడు. గత మాసములోజులనైగా అస్వస్థతగానుండి, ఇంకా సరిగా కోలుకోనందువలన. ఆయన ఈసభకే రాజాలకపోయెను కాని ఆయన శ్రద్ధ అంతయు సమావేశముపైననే యుండెననుట నిస్సందేహము.

అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాద్ తన ఉపన్యాసములో భారతస్వాతంత్ర్యప్రాప్తి నాటినుండి జరిగిన సంఘటనలను సింహావలోకన మొనరించుచు, ఇప్పుడు మనల నాందోళన పరుస్తున్న సమస్యలను ప్రభుత్వము త్వరలోనే, సక్రమముగా పరిష్కరించుననీ, కొంతకాలము మనము ఓపిక పట్టియుండి ప్రభుత్వము ఆ సమస్యలపై తన శక్తినంతను కేంద్రీకరించుటకు అవకాశమివ్వవలెననీ ఉద్బోధించిరి. దేశములో ఆంతరంగిక శాంతిని కాపాడవలసిన అవసరమును గురించి ఉద్ఘాటిస్తూ "ఇప్పుడు భారతదేశం స్వతంత్రదేశమన్న మాట మరవకండి. మన స్వాతంత్ర్యాన్ని మనం సుస్థిరము, సౌభాగ్యసంపన్నము చేసుకోవాలి. కొట్టి ఇప్పుడుకూడా మనం, ఇది వరకు స్వాతంత్ర్యాన్ని సంపాదించటానికి ఏ విధంగా జాగ్రత్తగా వున్నామో అట్లానే వుండాలి. మనపై బాధ్యతలు అనేకములు; అవి కూడా రోజూ పెరిగిపోతున్నాయి. మనం వాటి నన్నిటిని నిర్వహించగలిగి వుండాలి"—



అఖిలభారత కాంగ్రెస్ సంఘం (బొంబయి) సమావే

అని ఆయన అన్నారు. దక్షిణాఫ్రికాలోని భారతీయుల హక్కులను కాపాడుటకు ప్రభుత్వము కృషిచేయగలదనికూడా డా. ప్రసాద్ తన ప్రారంభోపన్యాసంలో వివరించెను.

దేశరాజకీయ పరిస్థితులను సమీక్షిస్తూ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ తన వైదేశిక విధానముయొక్క విశిష్టతను పునరుద్ఘాటించారు. అంతర్జాతీయ రాజకీయకల్లోలాలలో తాటస్థ్యం వహించి వుండుటయే భారతదేశము ఇప్పుడు చేయదగినదని ఆయన చెప్పారు. ఈనాడు ప్రపంచం ఇదివరకెన్నడూ లేనంతిగా, రెండు భాగాలుగా విభజితమైపోయిందనీ, ఈ రెండు భాగాలలోను యుద్ధప్రలాపాలు చాల ఎక్కువగానే జరుగుచున్నవనీ చెపుతూ, అంత త్వరలో యుద్ధం వస్తుందని తాననుకోవటంలేదని నెహ్రూజీ అన్నాడు.

కాశ్మీర్ విషయమై ప్రస్తావిస్తూ, భద్రతా మండలి అసలు విషయాన్ని విస్మరించి శుష్కవిచారణతో కాలయాపనం చేసిందనీ, ముస్లింలు అధికసంఖ్యాకులుగా వున్న సంస్థానమేదీ భారతదేశంలో చేరనిష్టపడదని పాశ్చాత్యరాజ్యాలు దురభిప్రాయపడుచున్నవనీ ఆయన అన్నారు. భారత యూనియన్‌లో చేరిపోవటమో, యుద్ధం చేయటమో—ఈ రెండిటికన్న నిజాముకు వేరే మార్గమేమీ లేదనీ, సంస్థానంలో బాధ్యతాయుత ప్రజాప్రభుత్వం స్థాపించి తీరవలసిందేననీ చెపుతూ, ఇప్పుడు సంస్థానాన్ని పాలిస్తున్నది ఇత్తెహాద్ అధ్యక్షుడు కాశింరజ్వీయో, లేక నిజామో తనకు తెలియటంలేదని నెహ్రూ అన్నారు.

కాంగ్రెస్‌సంస్థ నూతననిబంధనావళి

కాంగ్రెస్ సంస్థ పునర్నిర్మాణ విధానాన్ని సూచించటానికి చాలరోజులక్రితమే ఒక ప్రత్యేక సంఘం ఏర్పాటు చేయబడింది. ఈ సంఘం మహాత్మాజీతో అనేకపర్యాయాలు సంప్రదించింది. ఈ సంఘం కోరికపై మహాత్మాజీ తన జీవితంలో ఆఖరురోజునన్నే. తన సూచనలను లిఖితపూర్వకంగా ఇచ్చిపోయినారు దాదాపు ఆ సూచనలప్రకారమే కాంగ్రెస్ సంస్థ నూతన నిబంధనావళి ముసాయిదా తయారుచేసి, ఈ సంఘం కాంగ్రెసు కార్యవర్గచర్చలకు దాఖలు చేసింది. వానినే కాంగ్రెస్ కార్యవర్గం ఆమోదించి, ఎ. ఐ. సి. సి. ఆమోదమునకు ఈ సమావేశంలో ప్రతిపాదించెను. ఈ నిబంధనావళిలో గల 30 నిబంధనలనలో ప్రతిదీ విపులముగా చర్చించి ఏ. ఐ. సి. సి. చే, కొద్దిమార్పులతో ఆమోదింపబడెను.

"భారతప్రజల శ్రేయస్సుకొరకు, పురోభివృద్ధికొరకు, శాంతియుత, న్యాయసమ్మత మార్గములద్వారా, సర్వమానవులకు సమానావకాశములు, సమానరాజకీయ, ఆర్థిక, సామాజిక హక్కులు నిచ్చు ప్రాతిపదికపై భారతదేశములో సహకార ప్రజాస్వామ్యము నేర్పరచుటకొరకు, ప్రపంచశాంతి, సర్వమానవసౌభ్రాతృత్వముల కొరకు" కృషిచేయుటయే కాంగ్రెస్ లక్ష్యమని నూతన నిబంధనావళిలో నిర్వచింపబడినది. భారతదేశం స్వాతంత్ర్యము పొందినతర్వాత పాకిస్థాన్‌గా ఏర్పడిన తూర్పుబెంగాల్ పశ్చిమపంజాబ్, సింధు, సరిహద్దు రాష్ట్రములును, బెలూచిస్థాన్ కాంగ్రెస్ సంస్థనుండి తొలగింపబడినవి. ఈ ప్రాంతములలోని కాంగ్రెస్‌వారు ఇతర ప్రత్యేక సంస్థ లేర్పరచుకొనవచ్చును. కాంగ్రెస్ భారతదేశములోని ఒక రాజకీయపక్షము కాబట్టి, ఇతరదేశములోని రాజకీయపక్షములలో జోక్యము కలిగించుకొనుట సమంజసము కాదు. ఇందుకు ముఖ్యముగా తూర్పుబెంగాల్ ప్రతినిధులకు కష్టము కల్గినను, పాకిస్థాన్‌లో కాంగ్రెసు సంస్థను రద్దుపరచుట అవుసరమని అందరూ అంగీకరించిరి.

కాంగ్రెస్ అధికారవర్గము ఇచ్ఛలకు వ్యతిరిక్తముగా ఎ.ఐ. సి.సి. నూతన నిబంధనావళిలో రెండు మార్పులు జరిపినది. వీనిలో ఒకటి—ఎ. ఐ. సి. సికి సభ్యులను ఎన్నుకునే విధానమునకు సంబంధించినది. కాంగ్రెస్ కార్యవర్గసంఖ్యకు సంబంధించినది. రెండవది కాంగ్రెస్ కార్యవర్గములో అధ్యక్షు, కార్యదర్శులతో సహా మొత్తం 20 మంది సభ్యులుండవలెనని నిబంధనావళిని తయారుచేసిన ఉపసంఘం సూచించెను. కాని కాంగ్రెస్ కార్యవర్గం ఆ సంఖ్యను 15 కు తగ్గించెను. ఎ. ఐ. సి. సి. చర్చలలో ఈ సంఖ్యను 25 కు పెంచవలెనని ఒక సవరణ తేబడెను. చివరకు రాజీగా, 20 మంది సభ్యులుండవలెనని అందరూ అంగీకరించిరి. కార్యవర్గసభ్యులలో మూడవవంతుకన్న ప్రభుత్వాధికారములలో నున్నవారు నియమింపబడకూడదను సవరణ కేవలము కాంగ్రెస్ అధిష్ఠానవర్గపు ఇచ్ఛకు వ్యతిరిక్తముగా నెగ్గినది. ఇటువంటి చిన్నవిషయములు అగ్రనాయకుల అభిప్రాయములకు వ్యతిరిక్తముగా నెగ్గినా, ముఖ్యమైన విషయములన్నింటిలోను ఎ. ఐ. సి. సి. పండిట్ నెహ్రూ ఆదేశమును శిరసావహించునని మరొక సంఘటన రుజువొనర్చినది. ఇప్పటి ఎ. ఐ. సి. సి. కి ఎన్నికలు జరిగి రెండేండ్లు గడిచినవి. క్రొత్తనిబంధనావళి ప్రకారం ఎన్నికలు జరుగునప్పటికి మరొక రెండేండ్లు పట్టును. అంతకాలము, అదీ స్వాతంత్ర్యము పొందినతరువాత, ఎ. ఐ. సి. సి. కి ఎన్నికలు జరగకుండా వుండుట కార్యవర్గమునకు ఇష్టములేదు. అందువలన ఎ. ఐ. సి. సి. కి వెంటనే ఎన్నికలు జరుపవలెనని 'తాత్కాలిక నిబంధనల'లో సూచింపబడెను. ఆచార్య జుగుల్‌కిషోర్ నిబంధనలను అంగీకరింపవలసిందని ప్రతిపాదించగా తీర్మానమునకు అనుకూలముగా 58 వోట్లు, ప్రతికూలముగా 63 వోట్లు వచ్చెను. పండిట్ నెహ్రూ మిక్కిలి వ్యసనపడెను. ఎ. ఐ. సి. సి. కి తిరిగి వెంటనే ఎన్నికలు జరుగకపోయినచో తాను తన సభ్యత్వమునకు రాజీనామా నిచ్చెదనని ఆయన కోపోద్రేకముతో వెల్లడించెను. తీర్మానమును తిరిగి వోటుకు పెట్టగా ప్రతికూలముగా 66 వోట్లు, అనుకూలముగా 103 వోట్లు వచ్చి తీర్మానము నెగ్గెను. గాంధీజీకి నెహ్రూజీ వాస్తవముగా వారసు డైనాడు.

ఆర్థిక ఆశయములు

కాంగ్రెస్ ఆర్థిక ఆశయ నిర్వచన ఇదివరకే జరిగినది. ఆ సూత్రముల ప్రకారమే భారత ప్రభుత్వ పారిశ్రామిక విధానముకూడ నిర్వచించి ప్రకటించినారు. ముఖ్యమైన పరిశ్రమలను ప్రభుత్వపరముగా నడుపుట, మరికొన్ని పరిశ్రమలను ప్రభుత్వము, వ్యక్తులు కూడా నిర్వహించుట, కొన్ని పరిశ్రమలను వ్యక్తుల నిర్వహణకే వదలివేయుట ఈ విధానము మూలసూత్రములు. ముఖ్య పరిశ్రమలలో ఇప్పుడున్న సంస్థలను 10 సంవత్సరములవరకు ఇప్పటి యజమానుల చేతులలోనే వుంచినప్పటికీ, క్రొత్తగా ఏర్పరచు సంస్థలను మాత్రము ప్రభుత్వపరముగా స్థాపించవలెననుట కూడ ఈ విధానములో ఒక భాగమే. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వములు కాంగ్రెస్ ఆర్థిక లక్ష్యములను ఏ విధముగా ఆచరణలో అదరించుచున్నారో పరిశీలించుచు, ఆర్థిక విషయములపై కార్యవర్గమునకు సూచనలు చేయుచుండుటకు ఒక ప్రత్యేక స్థాయిసంఘము ఏర్పరచవలెనను తీర్మానము ఆమోదింపబడినది. ఈ సంఘమునకు పండిట్ నెహ్రూ అధ్యక్షుడుగా నుండును; రఫీ అహ్మద్ ఖిద్వాయ్, శంకర్‌రావ్ దేవ్, ఆచార్య రంగా, డా. పట్టాభి, జగజీవన్‌రాం, గుల్జారీలాల్ నందా, జె. సి. కుమారప్ప, ఆనంద్ ప్రసాద్ చౌదరిగారలు ఇతర సభ్యులు. ఈ సందర్భములో పండిట్ నెహ్రూ ఉపన్యసిస్తూ గాంధీజీ ఆశయములను ఆచరణలో పెట్టకుండా, అవుసరమైనప్పుడు ఆయన పేరునుమాత్రము ఉగ్గడిస్తుండేవారిని నిశితంగా విమర్శించారు.

రహస్య సమావేశం

కాశ్మీర్, హైదరాబాద్‌ల విషయమై సమగ్రముగా చర్చించుటకు రహస్య సమావేశము ఏర్పాటుచేయవలసినదిఅని ఎ. ఐ. సి. సి. సభ్యులు 76 గురు అధ్యక్షుని కోరినారు. అందువలన రహస్య సమావేశమొకటి ఏర్పాటుచేయబడినది. ఈ సమావేశములో ముఖ్యముగా హైదరాబాద్ విషయమే చర్చింపబడినట్లు తెలుస్తున్నది. హైదరాబాద్ సంస్థానములోని అంతరంగిక పరిస్థితులనుగురించి ఎ. ఐ. సి. సి. కి సాకల్యముగ సంస్థాన కాంగ్రెసువాదులు కొందరు ప్రత్యేకాహ్వానముపై ఈ సమావేశములో ఉపన్యసించిరి. సంస్థాన పరిహద్దులలో పర్యటించివచ్చిన శ్రీయుతులు బి. జి. ఖేర్, టి. ప్రకాశం, కాశేశ్వరరావ్ గారలు, శ్రీ పురుషోత్తమదాస్ టాండన్, ఆచార్య కృపాలనీ, అన్సర్ హర్వాణీ, మోహన్‌సింగ్ మహానీ మొదలగు ప్రముఖులుకూడ ఉపన్యసించిరి. అధ్యక్షులు డా. రాజేంద్రప్రసాద్ ప్రధానమంత్రి పండిట్ నెహ్రూగారలుకూడ చర్చలలో పాల్గొనిరి. నిజాం తన విధానమును మార్చుకొనకపోయినచో తా మనుసరింపదలచిన విధానమును పండిట్ నెహ్రూ విశదపరచినట్లు దానిపట్ల సభ్యులు సంతృప్తిజెందినట్లు తెలుస్తున్నది.

సంస్థాన ప్రజామండలి

అఖిలభారత సంస్థాన ప్రజామండలి స్థాయి సంఘము ఈ సమయముననే బొంబాయిలో సమావేశమై, అఖిలభారత ప్రజామండలిని రద్దుచేసి, కాంగ్రెస్‌తో కలసిపోవుటకు తీర్మానించెను. క్రొత్త నిబంధనావళి ప్రకారము కాంగ్రెసు సభ్యులు ఇతర రాజకీయపక్షములలో సభ్యులుగా నుండరాదు. సంస్థానము లన్నింటిలోను—హైదరాబాద్ తప్ప—రాష్ట్ర ప్రభుత్వములవంటి ప్రజాప్రభుత్వము లేర్పడినవి. చిన్న చిన్న సంస్థానముల ఏకీకరణకార్యము పూర్తియైనది. ఇకముందు భారతప్రజలు, సంస్థాన ప్రజలు ఎదుర్కొనవలసిన సమస్యలు ఒకేవిధముగా నుండును. అందువలన ఈ రెండు సంస్థలను ఐక్యపరచి కాంగ్రెస్‌ను బలవత్తరమొనర్చుట కాంగ్రెస్‌కేగాక సంస్థాన ప్రజలకే లాభదాయకము.





రెండవరోజు; వేదికపై ప్రముఖసభ్యులు గౌరవప్రేక్షకులు రాష్ట్ర, కేంద్రప్రభుత్వ మంత్రులు, కార్యవర్గసభ్యులు ఆసీనులై ఉన్నారు.



అల్లీబిల్లీ లోకంలో అమ్మాయి కథ

'ఆలీస్ ఇన్ ది వండర్లాండు'
రచన:
లూయీ కెరోల్

3

అనుకరణం.
"ఆప్లవాన్"

ఆయే! అయే! బరే గోమ్మత్తుగా ఉందే!"

పాపకు ఆశ్చర్యం పట్టలేక గబుక్కున ఒక్కసారి ముద్ద మాటలు నోటివెంబడి వచ్చేసాయి.

"ఏంతీ! మలి పే-ఏ-ఏ-ద్దదాన్నయిపోతున్నాను—అయ్యో, ఎంతయిపోయానో! పాదా లేవీ? అయ్యో, పాదాలా!"

(పాప కాళ్ళవంక చూసుకుంటే పాదా లెక్కడో, కంటిచూపుకే అందనంత అడూగున ఉన్నట్టున్నాయి.)

"అయ్యో పాపం! నా పాదాలు ఎంతదూర మయిపోయాయో! ఇంక వాట్లకి పసుపూ పారాణీ ఎవరు రాస్తారు? పాంజేబుపట్టాలు ఎవళ్ళు తొడుగుతారు? నేనేం చెయ్యటానికి ఇంత దూర మైపోయానాయెను, వీలే పడదుకదా! అయ్యో పిచ్చిపాదాలా! ఇంక మీసంగతి ఎవళ్ళు చూస్తా రమ్మా? ఇంక మీ దోవ మీరే చూసుకోవాలికదా!—అయినా నేను కాస్త వాటిని మంచితనం చేసుకొని దయగా ఉండకపోతే, బహుశా నేను చెప్పినట్టు నడవక, వాట్ల దోవ నవి పోవూ? వీట్లను మంచిచేసుకోవటం ఎల్లా? చూస్తానుండు. రేపు శ్రావణశుక్రవారంనాటికి, కొత్త పాంజేబుపట్టాలు కొని వాట్లకు బహుమతి ఇస్తా....నే నియ్యటం ఎల్లా? బంగీకట్టి పంపించాలి. అడ్రెసు ఏమని రాయాలో!

"(శ్రీ) పాపకుడిపాదంగారికి,
తివాసీపేట,
(గుండ్రడబల్లప్రక్కన)
—పాప ముద్దులతో పంపించినవి".

అని రాయాలిగాబోలు!

"ఛా! ఏమిటీ అవకతవక వాగుడూ, నేనూను?"

ఇల్లా అనుకొంటూండగానే పాపకు ఆహాలుశాబాకప్పు లోపలివాసాలు తక్కున నెత్తికి తగిలాయి. అసలు ఇప్పటికే పాప తొమ్మిది అడుగుల ఎత్తు ఎదిగిపోయింది.

వెంటనే బంగారపు తాళంచెవి బల్లమీదనుంచి, చేతిలోకి ఎగరేసుకొని, తోటలో కెళ్ళే, తలుపుదగ్గిరకు పరుగెత్తింది.

కాని పాపం! ఎంత వంగి, వంగి, పాకుతూన్నట్టు నేలమీద పడుకొని, మొహం కిందికి పెట్టి, తోటకేసి చూద్దామన్నా తలుపుద్వారం, ఒక కంటికి సరిగ్గా కనబడేటప్పటికే కష్ట మయింది. ఇంక ఆ తలుపులోంచి వెళ్ళట మెలా! అసలే లాభం లే దనిపించింది. పాప కూర్చుని ఏడవటం మొదలు పెట్టింది. ఆ ఏడుపులోనే—

"చాల్లే! వెధవఏడుపూ, నువ్వూను! దయ్యంలాగ ఇంత పెద్దదాన వయూక కూడా, (నిజానికికూడా పాప యప్పుడంత పెద్దపిల్లా అయిపోయింది) ఇంకా ఏడుపేనా? తక్షణం ఆపుతావా, లేదా? చెప్తూంటే మరీను!"

అనుకొంటూందే గాని, ఏడుపు పాగలేదు. కళ్ళనీళ్ళు కడవలకొద్దీ బడబడా కురిసిపోతున్నాయి. ఏడుపు పాగటమే లేదు. కురిసి కురిసి, అల్లా ఆ నీళ్ళతో పాపచుట్టూ జానెడులోతున హాలంతా కళ్ళనీళ్ళమడుగు అయిపోయింది.

కాసేపటికి దూరాన ఎక్కణ్ణుంచో బుల్లిబుల్లి అడుగుల్తో ఎవరో పరుగెత్తుకొస్తున్న చిరు చప్పుడు అయింది. ఎవళ్ళన్నా చూస్తారేమో అని పాప అడావుడిగా కళ్ళు తుడిచేసుకొంటూ, ఎవరొస్తున్నారో అని చూసింది.

ఇందాకటి తెల్లకుందేలే! ఈమాటు ఇంకా అలంకారంగా చక్కచక్కని దుస్తులన్నీ వేసుకొంది. ఒక చేతిలో మెరిసిపోతున్న రెండు చిన్న బంగారపు మురుగులూ, ఇంకో చేతిలో తళతళ లాడ్తూ పట్టుకుచ్చులు మడతలు విప్పిన ట్టున్న ఒక వింజామరము, (దేవుడికి విసిరే విసనకఱ్ఱలను వింజామర లంటా రనుకొందిపాప) పుచ్చుకొని మళ్ళీ గట్టిగా గొణుగుకొంటూ రివిత్తోటి అడావుడిగా నడుస్తూ వస్తూంది.

"అయ్యయ్యో! రాణిగారికి కోపం వచ్చేసే ఉంటుంది! అమ్మో! రాణిగారు ఇంక బతకనిస్తుందా? ఇంతసేపు కాచుకు నుంచాల్సొస్తే ఆవిడ కాగ్రహం వచ్చేస్తుందిగానీ, ఇంకేమన్నా ఉందా? అయ్యో! అయ్యో!...

పాపకు అంత కుముందు దాకా ఎవళ్ళూ లేక బెంబే లెత్తిపోయినట్లుంది. ఎవళ్ళతోనైనా సరే మాట్లాడి, ఏదో సలహా తీసుకోకపోతే ఉండబట్ట లేనట్టుగా ఉంది. కాస్త కుందేలు దగ్గిరకు రాగానే, భయంభయంగా చిన్న గొంతుకతో—

"ఇదుగో, ఏమండోయ్! క్షమించి, కాస్త..."అని మొదలుపెట్టింది. మాట ఇంకా పూర్తి కానే లేదు.

కుందేలు అదిరిపోయినట్టు ఒక్క ఎగు రెగిరి, హడిలిపోతూ, ఆ మురుగులూ, విసనకఱ్ఱా అక్కడే పారేసి, హాల్లో చీకట్లోకి ఒకటే దాడు తీసింది.

పాప ఆ మురుగులూ, విసనకఱ్ఱా చేత్తో పుచ్చుకొంది.

హాల్లో ఇరుకుగా ఉన్నట్టయి, వేడెత్తిపోయి, ఉక్కపోస్తున్నట్టుంది. పాప ఆ విసనకఱ్ఱతో చెమట ఆర్చుకొందామని విసురుకోటం మొదలు పెట్టింది. అల్లా విసురుకొంటూనే తనతో తానే గట్టిగా మాట్లాడుకొంటూ కూర్చుంది.

బాల

పిల్లలపెట్టే వస్తువులు

పిల్లల కథలు

చి॥ చల్లా సత్యనారాయణశర్మ

పూర్వం ఒక గ్రామంలో ఒక ధనికుడుండేవాడు. ఆ గ్రామంలోనే రాముడు అనే తెలివిగల బీదవాడు వుండేవాడు.

అతను ఒకసారి ధనికుని వద్దకు పోయి, "అయ్యా, రేపు మా అమ్మాయికి పెండ్లి, దయవుంచి నాకు కొన్ని వస్తువు లీయండి" అన్నాడు. ధనికుడు కొన్ని వస్తువులను యిచ్చాడు.

రెండు రోజులు పోయాక, ఆ వస్తువులతో, కొన్ని చిన్నచిన్నవస్తువులు కూడ పట్టుకొచ్చి ధనికుని కిచ్చాడు.

ధనికుడు ఆ చిన్నవస్తువులను చూసి "యివి యెక్కడివి?"అని అడిగాడు. రాముడు, "మీరు యిచ్చిన వస్తువులు యీ చిన్నవస్తువులను పెట్టాయి!" అన్నాడు. ఇది విని ధనికుడు చాల సంతసించాడు.

మరి కొన్నాళ్ళు పోయాక, రాముడు ధనికునివద్దకు పోయి వస్తువుల నడిగాడు. ధనికుడు—బోలెడన్ని చిన్నవస్తువులు దొరుకుతాయనే ఆశతో యింట్లోవున్న వస్తువులన్నీ యిచ్చి, "ఈ వస్తువులు పెట్టే పిల్ల లన్నిటిని జాగ్రత్తగా తీసుకురా" అన్నాడు.

నాలుగు రోజులు పోయాక, రాముడు ధనికుని యింటికి ఏడుస్తూ వచ్చి యిల్లా అన్నాడు: "అయ్యా. మీ వస్తువులన్నీ రాత్రి చనిపోయినాయి!" ఇది విని ధనికుడు నిర్ఘాంత పోయాడు. విచారంతో యిల్లా అన్నాడు:

"అన్ని వస్తువులూ చనిపోయినాయా?"


రాముడు: "ఔనండి అయ్యా!"

ఇంతలో ధనికునికి ప్రాణంలేని వస్తువులు చావ వనే సంగతి జ్ఞాపకం వచ్చి, "నీవు చెప్పే దంతా అబద్ధం! ప్రాణంలేని వస్తువు లెలా చస్తాయి?" అన్నాడు.

రాముడు, "అయ్యా, మీ వస్తువు లన్నిట్లు మోస్తరు కాదు! మీవి పిల్లలనూ పెడ్తాయి! చావనూ చస్తాయి!" అన్నాడు. ఇది విని ధనికుడు తన దురాశకు చాల విచారించాడు. ఇప్పుడు రాముని యింటి నిండా వస్తువులే.

"అరేరే! ఇ దేమిటి, ఇవా ళన్నీ ఇల్లా తమాషాగా, వింతవింతగా జరుగుతున్నాయి? మళ్లీ నిన్నటిదాకా అన్నీ మామూలు ప్రకారంగానే జరుగుతూ ఉండేవే! రాత్రికి రాత్రి, నేను గబుక్కున ఏమీ మారిపోలేదు కదా? అయినా జ్ఞాపకం చేసుకొని చూస్తానాగు. పొద్దున్న నేను నిద్రలేచేటప్పటికే ఇల్లాగ ఉన్నానా? ఊఁ. ఏదో ఇంకో మాదిరిగా ఉండేదాన్న నే నాకు బాగా జ్ఞాపకం. ఇంతలో ఇంకో అమ్మాయిగా మారిపోయానా? మరి ఇంకో అమ్మాయినే అయితే, ఇప్పుడు నేను నేనుకాక ఇం కెవరి నన్నమాటా?"

తను ఎరిగిఉన్న పిల్లల్లో తను ఎవరుగా మారిపోయి ఉండవచ్చా అని, తనయీడు పిల్లలవిషయా లన్నీ జ్ఞాపకం



చేసుకొంటూ తిరగేసుకోటం మొదలు పెట్టింది.

"సీతిని కాను. సీతిజుట్టు, గొత్తె పొట్టేలుబొచ్చులాగా గొగ్గులుగొగ్గులుగా దువ్వెనకు లొంగకుండా బిరుసుగా ఉండి, జడ గొంగళిపురుగులా ఉంటుంది. నాజుట్టు ముంగుర్లు తిరిగి మెత్తగా పట్టుకుచ్చులాగా ఉంటుంది. మరి పోతే, సూరిని కాను—దాని మొహం దాన్నవట మేమిటి? వెంకి నసలే కాను. వెంకిబండ మొద్దు. అయినా వెంకివెంకే, నేనునేనే. నేను వెంకయితే, వెంకి ఏం కావాలి? అదీ కాకుండా నేను బండమ్మాయినా ఏమిటి?

అసలు నా కొచ్చినవన్నీ జ్ఞాపకం ఉన్నాయో, లేదో చూస్తాను. నాలు గయిదులు పన్నెండు, నాలు గార్లు పదమూడు, నాలు గేళ్ళు...ఛా!ఛా ఇదేం ఎక్కం? ఈలెఖ్ఖని, ఇరవైదాకా రావటం ఈ జన్మకి పడదు. అయినా! వెధవ ఎక్కాలు ఎక్కాల్సి బట్టా ఏమిటి, తెలివి తేటలు చూసుకోటం? పాఠాలు చూసుకోవాలిగాని. - ఆవుకు నాలుగు కాళ్ళుండును. ఇది సకిలించును. దీని మెడపైనను, తలపైనను పెద్ద కేసరము లుండును. ఇది పిల్లిజాతిలోనిది. చెట్లెక్కుటలో గట్టి పట్టు, నేర్పును గలదు. శత్రువులు తరుముకొని వచ్చినప్పుడు ఎడారిఇసుకలో తన తలను దాచుకొనును. ఉష్ట్రపక్షి యని దీనికి మరో పేరు. ఉష్ట్రపక్షి ఏమిటి? ఆవుపాఠముకాదూ, మొదలెట్టాను? ఛా! ఛా! అన్నీ తప్పులే వచ్చినట్టున్నాయి. అయ్యయ్యో! అప్పుడే వెంకి నై పోయాను గాబోలురా! అయినా పద్యాలుకూడా రావేమో చదువుకొని చూస్తాను.

పాప రెండు చేతులూ కట్టుకొని, కళ్లుమూసుకొని, పంతులమ్మదగ్గిర పద్యం అప్ప చెప్తున్నట్టుగా భయంతో బొంగురుపోయిన గొంతుక పెట్టి అప్పచెప్పింది.

"ఉప్పు కప్పురంబు నొక్కపోలిక నుండు
సజ్జనుండు పల్కు చల్లగాను
పిల్లి తిన్న కోడి పిలిచితే పలుకునా,
విశ్వదాభిరామ వినర సుమతీ!"

ఊఁ, కాదు. ఎక్కడో తప్పినట్టే ఉంది! అయ్యో కర్మమా. మొద్దుపిల్ల 'వెంకి'నై పోయే ఉంటాను. వెంకికి ఆడుకొనేందు కేమీ ఇయ్యరు. ఓ మంచి గౌనూ, చొక్కా, పరికిణీ ఏమీ ఉండవు. అస్తమానం చివాట్లూ, చెప్పు దెబ్బలేగా?

ఊహు! వెంకి నైతే ఇక్కడి నుంచి కదలనే కదలను. ఊ! కన్నం దగ్గిరకు వచ్చి ఎవ ళ్లెంత కేకలేసినా సరే కదల్నే కదలను "అమ్మా, తల్లీ! పైకిరా అమ్మా" అని కేకేసి కేకేసి వాళ్ల నోళ్లు బద్దలుగొట్టుకోవలసిందే! లాభం లేదు. లేకపోతే, "సరే, రమ్మంటున్నారే! మరి ముందు నే నెవర్తెనో చెప్పండి. మీరు చెప్పిన పిల్లనుగా ఉంటానికి నా కిష్టమైతేనే వస్తాను. లేకపోతే రానే రాను. నాకు కావలసిన ఇంకో అమ్మాయి నయ్యేదాకా ఇక్కడే ఉంటాను. అందుకని ముం దెవర్నో చెప్పండి" అని అడుగుతా అంటూనే, పైకి చూసి "అబ్బ! ఎవళ్ళన్నా వచ్చి, పో నీ రమ్మనైనా కే కెయ్యరే? ఒక్కతెనే ఎంతసే పిక్కడ పడుండనా ఏమిటి! అబ్బా!" అంటూ ఒక్కసారిగా కళ్ళనీళ్లు పొర్లు కొచ్చి ఏడ్చింది.

ఏడుస్తూనే పాప తన చేతులవంక చూసుకొంటే, చేతులు మళ్ళీ చిన్నవైపోయాయి. అల్లా మాట్లాడు కొంటూనే ఎప్పుడో, ఇందాక కుందేలు అక్కడ పారేసి పోయిన బంగారు ముసుగు ఒకటి తనకు తెలియకుండానే చేతికి తొడుక్కుంది. అంత చిన్న ముసుగూ చేతికి సరిగ్గాపట్టింది.

"అయితే మళ్ళీ చిన్నదా న్నయిపోతున్నానే!" అంటూ చటుక్కున లేచి నిలబడి, తనని కొలుచుకుందామని బల్లదగ్గిరకు వెళ్లింది.


అప్పటికి దాదాపు రెండడుగులు ఎత్తుంది. ఇంకా చిన్నదిగా అయిపోతూనే ఉంది. ఏమిటా అని పాప పరకాయించి చూసుకుంటే, విసనకఱ్ఱతో విసురుకుంటూండటంవల్ల చిన్నదాన్నయిపోతున్నానని తోచింది. చటుక్కున విసనకఱ్ఱ అక్కడ పారేసింది. "నయమే, త్వరగా తెలుసుకున్నాను. బతేగండం తప్పిపోయింది." అనుకొంటూ, తోటకు వెళ్ళే చిన్నద్వారం దగ్గిరకు పరుగెత్తింది.

కాని పాపం, మళ్ళీ ఆ తలుపు వేసే ఉంది. ఆ బంగారంతాళంచెవి ఇందాకటిలాగే బల్లమీదే ఉంది.

"సరి! మరీ బాగుంది! అంతకంతకూ మరీ అధ్వాన్న మైపోతోంది బతుకు

(21-వ పేజీ చూడుడు)





కథా గేయం :



ఆణిముత్యం

'ప్రసాదరావు'

3

బాల్యప్రాయాల్ గడిచిపోయీ
పాలపొంగుల యౌవనంతో
లీలజీవితవార్ధితరగల
తేల సాగారోయ్. 1
పూలమాలలు గూర్చుకొంటూ,
పూలపేరులు పాడుకొంటూ,
నవ్వులా వెదజల్లుతూ ముత్యం
పువ్వు లమ్మేదీ. 2
ఆటుపోటుల వేళ సంద్రపు
ధాటికీ ఎదురీది తెప్పతో,
పోటుమగడై, ఆణీ, చేపల
వేట లాడ్తాడోయ్. 3
ఉన్నవాడై, తాతతండ్రులు
మున్నెనిల్పిన, బేరవృత్తిలో,
మిన్నయై సుజనుడని వేణూ
మన్ననందాడోయ్. 4
చిన్ననాటీ హృదయబంధాల్
చివురులెత్తీ వలపులై, ఆ
కన్నియనె కోరుతూ, ఇద్దరు
కలలుగంటారోయ్. 5
మేలిబంగరునగలు చీరలు,
పూలమాలలు కానుకతెచ్చీ,
లలితముగ, తనవలపు, వేణూ
తెలుపుకొంటాడూ. 6
భోరున్న వానల్లు కురిసీ,
హోరెత్తు కెరటాల మునిగీ
జారు, నిట్టానిలువుకొండల
జోరుగా ఎగబ్రాకిపోతూ;— 7
కొండకొన, వన్నెల్ల మొక్కల
కొత్త పూవుల కోసితెచ్చీ,
పెగ్గెతో ఆణీ, వలపును
అగ్గిలిస్తాడు. 8
ఇద్దరిలో తన కెవ్వ రెక్కువో
బుద్ధినెరుగగ లేదు ముత్యం;
ఎరుకలేకే, ఆణికై, ఎద
ఒరుగుతూంటుంది...... 9

బులుసూ బలుసూ

(9 వ పేజీ తరువాయి)

కృష్ణసహాయం కలగడు అని శ్లేషించి, అంతతో కూడా సరిపెట్టక తమ మనస్సులో వున్న వైరాన్ని—

"రామరావున్నపతౌ వుదారతా
భావుకేచ్ఛ వకదాచిపి లోపితా,
కింతు సాధు పదలభ్యకృత్తితా
వాంత పూర్వభవపాపవృత్తితః"

అనే శ్లోకంద్వారాగా వెల్లడించారు. యీ శ్లోకంలో శ్లేష వుంది. అంతరార్థం—రాజాగారు మహాదాతలే అయినను పాపయ్యశాస్త్రుల్లుగారికి యతఃపూర్వం చేసిన పెద్ద భూదానం కారణమై యిటీవల భూదానాలు సంక్షేపించారని స్ఫురిస్తుంది. సంక్షేపించడం యెందు కొచ్చిందంటే? రాజాగారు శాస్త్రుల్లుగారిని, మీకు సేంకు హదానం చేయడానికి సంకల్పించుకున్నాం. యెంత యిస్తే గ్రాసవాసో దైన్యం లేకుండా మీకు జరుగుతుందో, చెప్ప వలసిం దనేటప్పటికి, నెల 1 కి పుట్టెడు చొ॥ లెక్క చూచుకొని సంవత్సరానికి యెన్ని నెలలో అన్ని పుట్లు (12) కోరుకుంటే, రాజాగారు పాలెపు పల్లం రాజాగారిని నియోగించేటప్పటికి ఆ జున్ని లో బరచుకొని శాస్త్రుల్లుగారు పన్నెండు పుట్లకు పద్దెనిమిది పుట్లు కొలిపించుకున్నా రనిన్నీ, అప్పటి రాజాదారు ఆ కారణం చేత యెవ్వరికీ భూమి యివ్వడం మానేశారనిన్నీ అంత రార్థం స్ఫురిస్తుంది. పాపవృత్తితః అన్న పదం శ్లేషిస్తుంది. పూర్వభవపదంకూడా శ్లేషిస్తుంది. పైగా కృష్ణమూర్తిగారు యీమాట నేను చెప్పడమే కాదు, త్రికాలవేది కాళిదాసే చెప్పివున్నాడని -"పార్వతి, పాపకృత్తయే" అనే అక్షరాలుదాహరించి, పాపపాపయ్యశాస్త్రియొక్క, వృత్తయే వృత్తికొఱకు అని అర్థం చెప్పినట్టుకూడా పండితులు చెప్పుకుంటారు. భూదానాలు విస్తరించి చేసిన రాజాలలో ఆఖరువారు శేటుకృష్ణగంగాధర రామారావుగార్లు. వీరివల్ల భూసంపాదన తమకు తప్పక అయితీరుతుందనే నమ్మికతో కాళహస్తి సంస్థానంనుంచి కృష్ణమూర్తిగారు పిఠాపురానికి వచ్చారు. కాని వారనుకున్నట్టు జరగలేదు. దానం దాత్రువశంకనక రు500 ల రొక్కమున్నూ, వెలహెచ్చైన శాల్జోడున్నూ యిచ్చి సత్కరించారనిన్నీ, భూమి యివ్వకపోవడంచేత కృష్ణమూర్తిగారికి సంతుష్టి లేక ఆ శ్లోకం ద్వారా వెల్లడించి పిమ్మట మాడుగులసంస్థానానికి వెళ్ళి యీ పంక్తి తెల్పితే ఆ బలిచక్రవర్తి (కృష్ణభూపతి) పద్దాలుగు పుట్లభూమి యిచ్చి సన్మానించా డనిన్నీ వినికి. వట్టి వినికిమాత్రమే కాదు—

"పండితమాళి శిష్టకుల
వారిధిచంద్రుడు కృష్ణమూర్తి కా
ఖండలతుల్యవైభవుడ
ఖండదానవ్యడు కృష్ణనేత భూ
ఖండ మొసంగె; నద్ది యిట
గాపుర మండమి బోతె, తుమ్మితే
నుండని ముక్క దగ్గిన మ
ఉండునె? కృష్ణనృపాలకాగ్రణీ!"

బాగా జ్ఞప్తి లేక పద్యంలో కొంచెం తబ్బిబ్బు లుంటే వుంటాయి. విషయం తెలియడానికి కభ్యంతరం వుండదుగదా? దీనిపుట్టుకకు కారణం వ్యాఖ్యానించ నక్కఱ లేదు. తిమ్మన్నా అంటే, నాకేరు నీ కెవరు చెప్పారంటే నీమొఖమే అన్నమాదిరిని పద్యమే వ్యాఖ్యానిస్తూ వుంది. కృష్ణమూర్తిగారు సుమారు తొంభై యేళ్లు జీవించి వుంటారు. ఆఖరుదశలో భూప్రదాతగారి రాజధాని మాడుగులలో నివసించక పోయినా భూమికి యేవిధమైన ఆటంకమూ కలగలేదనే వినికి. ఆకాలంలో సుమారు ముప్పై లక్షలవరిమానం గల విజయనగరసంస్థానంకంటే కూడా అంత పేలవరిమానంగల మాడుగులసంస్థానాని, పండితసత్కారప్రయుక్తమైన గౌరవ మని పూర్వులు చెప్పేవారు. ఆ మాడుగుల బ్రహ్మయ్యశాస్త్రుల్లుగారికి వ్యాకరణారంభగురువులు శ్రీ యింద్రగంటి గోపాలశాస్త్రుల్లుగారు మాడుగులసంస్థానవిద్వాంసులే. వీరికీ రాజాగారికీ సంబంధించిన చిన్నచిన్న యితిహాసాలు ముచ్చటించడానికి యిక్కడ తావు చాలదు.

వాక్యార్థచంద్రికాదివ్యాకరణ గ్రంథకర్త, లోకోత్తరవిద్వచ్ఛిరోమణి శ్రీ భాగవతుల హరిశాస్త్రుల్లుగారున్నూ యీ శాస్త్రుల్లుగారున్నూ మేనత్తమేనమామబిడ్డలు. హరిశాస్త్రుల్లుగారే గొప్పవా రనుకుంటే, యీ గోపాలశాస్త్రుల్లుగారున్నూ, అంతకంటే అధికులని కొన్ని యితిహాసా లున్నాయి. విజయనగరం మహారాజావారున్నూ హరిశాస్త్రుల్లుగారున్నూ సజ్జపు సారటుమీద షికారు వెడుతూవుంటే గోపాలశాస్త్రుల్లుగారు బలవంతంగా సజ్జాలని ఆపి—రాజా, మీ హరిశాస్త్రుల్లుకి యేం వచ్చునో చూడాలని వుంది. మహాభాష్యంలో నాపరీక్ష కాగలదా డెమో కనుక్కోండి; అన్నారని చెప్పుకోవడం. యిందులో యే కొంచెమో యిటీవలివారి పైత్యం వున్నా, యీవత్తూ పైత్యం కాదు, కవిత్వం కూడా వుండి తీరుతుంది.

గోపాలశాస్త్రుల్లుగారికి మహాభాష్యం యీవత్తూ కంఠోపాఠమని పండితపరంపర చెప్పుకుంటూ రు. యి అవధుల్యో, ముప్పయ్యో యేళ్ళు కాశీవాసంచేసి వ్యాకరణాదిశాస్త్రాలేకాక మంత్రశాస్త్రంకూడా అధ్యసించి దేశానికి వస్తూ మాడుగులరాజదర్శనానికి వెళ్ళిన పుల్లెల దక్షిణామూర్తిశాస్త్రుల్లుగారు యీ గోపాలశాస్త్రుల్లుగారికి వ్యాకరణ మహాభాష్యంలో వోడిపోయి మళ్ళా వెనక్కి మళ్ళి, కాశీ వెళ్ళి మహాభాష్యంలో పెద్దగా కృషి చేసి జిగీషతో మాడుగులకు రావడమైతే జరిగింది గాని అప్పటికి కొలదిదినాలక్రిందటనో, మాసాలక్రిందటనో గోపాలశాస్త్రుల్లుగారు కీర్తిశేషులు కావడంచేత గాలీ వానా వస్తే కథే ఆగిన ట్టయిందనిన్నీ చెప్పుకోవడం; మొత్తం వీరిద్దఱూ వుద్దండమైన విద్వాంసులనిన్నీ, గోపాలశాస్త్రుల్లుగారు వ్యాకరణమహాభాష్యం వేదం వుూదరిగా జట్టిపెట్టడంచేత అందులో వారి వుపజ్ఞ హెచ్చుగా వుండేదనిన్నీ మనం తెలుసుకోవాలి. వొక్క వ్యాకరణం అంతగా బట్టి పెట్టడంకన్న తదితరశాస్త్రాలలో కొంత ప్రవేశం సంపాదించినవారి పాండిత్యమే సర్వధా శ్లాఘనీయం. వ్యాకరణం కౌముదిమాత్రం చదివి యితర శాస్త్రాలలో తక్కినకాలం వినియోగించడమే సమంజసం. బెంగాలీలు తర్కానికి ప్రాధాన్యం యిస్తారు గాని, వ్యాకరణానికివ్వరు. యే లఘుకౌముదినో చదివి వుంటారు. దానివల్ల "అస్మాకూడాం శార్కికేసాం" అనే ఆక్షేపణకు అవకాశం కలగదు. వ్యుత్పత్తివాద శక్తివాదాదుల వల్ల యెన్నో సంగతులు వారికి తెలుస్తాయి. మన పాపయ్యశాస్త్రుల్లుగారికి అంత గొప్ప పేరు రావడానికి కారణం ప్రధానమైన వేదాన్ని ముందు సక్రమంగా చెప్పుకొని వెంటనే వేదాంగాలు—

"శిక్షా వ్యాకరణం ఛందో
నిరుక్తం జ్యోతిషం తథా
కల్పశ్చేతి షడంగాని
వేదస్యాహు ర్మనీషిణః"

—అనేవి అవసరమైనంతవఱకే అభ్యసించి అని తరసాధ్యమైన వేదార్థం చెప్పేవారు కావడం చేతనే అనుకోవాలి. కొందఱు—

"ఏకవిద్యా సురక్షితా" అన్నారంటూ యావజ్జీవమూ వొక్క వ్యాకరణమో, తర్కమో, కృషి చేసి మహోకదానిప్రసక్తి వచ్చేటప్పటికి కల్ల—"నన్ను ముట్టుకోకు నా మాలకాకీ" అని దూరంగా తొలగుతారు. యిట్టి పండితులలో ముఖ్యంగా గణించ తగ్గవారు మార్కొండపాటి చయప్రయ్యం. పాపయ్యశాస్త్రుల్లుగారిది అట్టిది కాదు. వేదం శ్రౌతం యివి ప్రధానం. వ్యాకరణాదులు సామాన్యం. ప్రత్యేకించి యేకశాస్త్రంలో గాని వాదించవలసివస్తే యేకైకశాస్త్రజ్ఞులుగా వుండే పండితులకు వారు చాలరు. వారికి ప్రతి శాస్త్రంలోనూ వుండే సిద్ధాంతాలెమట్టుకే తెలిసి వుంటాయి లక్కి కిలిక్కి పాదంతో వారికే కాదు యెవరికీ అవశ్యకత వుండదు. అయితే వొక్కొక్క శాస్త్రంమీద అన్నేసి గ్రంథాలు యెందుకు పుట్టాలి? అంటారేమో? వారువారు గ్రంథాలు వ్రాసి శాస్త్రాలను పెంచారు. భగవద్గీతలో— "యావా నర్థ ఉదపానే" అని చెప్పినట్టే ఆయా శాస్త్రాలవిషయంలోనూ ప్రవర్తిస్తే వొక్క జన్మంలో అనేకసందర్భాలు తెలుస్తాయి. పాపయ్యశాస్త్రుల్లుగారిని అవమానించడానికి అప్పుడప్పుడు ప్రత్యేకశాస్త్రజ్ఞులు ప్రయత్నించేవార నిన్నీ, లౌకికజ్ఞానధురంధరులు కావడంచేత శాస్త్రుల్లుగారు దొరకడేవారు కారనిన్నీ చెప్పుకుంటారు. యీ చిన్న యితిహాసం దాన్నే బలపరుస్తుంది.

విజయనగరంలో వేదార్థం చెపుతూ వుండగా పట్నాప్రశేత్త శ్రీకొవ్వూరు గోపాలశాస్త్రుల్లుగారు అవమానించే వుద్దేశంతో 'యేదీ భావగారు, అక్కడ మళ్ళా సెలవియ్యండీ' అని యేదో పదసలో కంకించినట్టున్నూ శాస్త్రుల్లుగారు గోపాలశాస్త్రుల్లుగారి వుద్దేశం గ్రహించి, యిదుగో పనస తుట్టతుద దాకా అర్థం మనవి చేసి తమ సందేహం తీర్చడానికి యత్నిస్తానని చెప్పి, కొంతసేపటిదాకా వుపన్యసిస్తూ కాలం గడిపి, అప్పుడు గోపాలశాస్త్రుల్లుగారివైపు చూచి—"యేదీ? బావగారూ? మీ రిందాకా యేదో ప్రశ్నించబోతే నేను తరవాత మనవిచేస్తానన్నాను. అదేదో సెలవీవలసిం" దనేటప్పటికి వేదంలో ప్రవేశం బొత్తిగా లేని గోపాలశాస్త్రుల్లుగారు దాన్ని స్వరయుక్తంగా పలకలేకపోయా రనిన్నీ పాపయ్యశాస్త్రుల్లుగారు విని—"నారాయణ! నారాయణా?" అని చెవులు మూసుకొని, 'యధేంద్రశత్రుస్స్వరతో ఽపరాధాత్, ఇంద్రశత్రుర్వర్ధస్వ, ఇంద్రశత్రుర్వర్ధస్వ' అనే అనువాకం యెత్తుకొని పెద్దగా వ్యాఖ్యానం చేసి మృదువుగానే గోపాలశాస్త్రుల్లుగారిని అవమానించి మళ్ళా శాస్త్రుల్లుగారిని గొప్పచేయడానికి—"యేదో? చూచారా? శాస్త్రాలల్లో మీరు వుద్దండులు. మాది చిల్లర దుకాణం. కాస్త వుప్పూ, కాస్త చింతపండు మిరపకాయలూ వొక చేటేమిటి? అన్నీ దొరుకుతాయి. పట్టుమని మణుగులకొలది కావాలంటే? యేదీవుండదు" అంటూ చెప్పి గౌరవించా రనిన్నీ గురువుగారు చెప్పగా విన్నాను—

యేమైనా వొక్కటే యావజ్జీవమూ కృషి చేయడంకంటే చిల్లరదుకాణపు విద్యాభ్యాసమే అనేకవిధాల లోకానికి వుపయోగం. మాపరమగురువుగారి వ్యాకరణగురువులు—"రాజారామశాస్త్రుల్లుగారు. వీరు కవులలో అమరం రచించిన కవివంటి కవి లేనే లేడనిన్నీ, వ్యాకరణగ్రంథకర్తలలో సిద్ధాంతకౌముదీకర్తవంటివాడున్నూ, తర్కంలో ముక్తావళీరచయితవంటివాడున్నూ నభూతో నభవిష్యతి; అయీ మూడూ కంఠస్థంగా వుంటే యితరగ్రంథాలతో అవసరం లేదనిన్నీ అనేవారట. యీ రాజారామశాస్త్రుల్లుగారి గురువు కాశీనాథశాస్త్రుల్లుగారు. మన దేశంలో పండితులు తమ కొడుకులకు పెట్టిన పేరు వీరిదే. "కాశ్యాం మేకః కాశీనాథో ఽవశిష్టః" అనే శ్లోకపాదంలో వున్న కాశీనాథపదం శ్లేషభంగ్యా వీరినే బోధిస్తుందని వినికిడి.

(సశేషము)

సంగీత కళాభివృద్ధి

(8 వ పేజీ తరువాయి)

చున్న గౌరవము ర్యాదలను, ఐరుపుమన్న సత్కృతులను, బరికించి యీ నియమము దొలగించికొనియె నని యవగత మగుచున్నది.

అక్బరు సార్వభౌముని పరిపాలనాకాలము "కళాయుగ" (Age of Art) మని చెప్పదగును. సంఘశ్రేణుల నన్నిట గౌరాధకులు, కళాప్రపూర్ణులు, గల రు "బిజాపుర"మందలి 'యాదిల్‌షా' గొప్ప సంగీతవిద్వాంసుడు. ఆతడు సంగీతమున ననేకఘణములు (Tunes) ను గ్రొత్తగా గనిపట్టి వ్యాప్తి జెందించినవాడు. "అజట్బగ్" అనునతడు సార్వభౌముని రాయబారిగా విజాపురము (Bijpur) నకు బోవగా విజాపురనవాబు "ఇబ్రహీం ఆదిల్ షా" యొద్ద గ్రొంగ్రొత్త ఘణములు నేర్పికొనుటకయి సంగీతవిద్వాంసుల గొందఱి నాతని వెంట బంపెను. ఆతని దొడ్డకొల్ల విజాపురనవాబు 'తాన్‌సేన్' గాయకశిఖామణిగూర్చియు, దర్బారులో నతడు సేయు కచేరీలను గుఱించియు, నడురేయి యమునావదీసైకతసంబులు...... ... (Retiring Tower)ను గుఱించి యు బ్రశ్నించెను. దీనింబట్టి విజ్ఞానమునకు మూలకారకులు తపోధనులగు సంయమీంద్రు లనియు, వారా ధనముచే జ్ఞానసంపత్తిని దెలిసికొనగల్గిరనియు, వారు వ్యాపించిన ప్రణవమంత్రమున నాద మున్నదనియు, నాదము ధ్వన్యాత్మకమనియు—స్థాయీ భేదములవల నాదము రమ్యతను బొందుననియు, శ్రోత ఆనందరసానుభూతి నందినప్పుడే కళోపాసకుడయి రసజ్ఞుడగుననియు, దీన గళలు బ్రహ్మానందాయకము లనియు, గళాప్రపూర్ణులానందమును జవిజూచెదరనియు, నానందము యొక్క పరమావధి దెలిసికొనినవారు వేదాంతులనియు, సంగీతసుధాస్వాదనోత్సుకత ప్రాంతీయములు, అవధులు, గడచి విశ్వవ్యాప్తమై పరిణమించినదనియు, నన్నతని జెందినదనియు నవగతము కాగలదు.

"బిల్‌గ్రాం"లో వసించు "మధనాయకు"ని మహోన్నతగౌరవసత్కృతులు సుపలక్షించుటకయి "తాన్‌సేన్" వెడలినట్టు లగపడియెడిని. అంతియకాక పలువుర గాయకశ్రేష్ఠుల గానసుధ నాస్వాదించి యయ్యై పెటుంగుల, బల్కు పొందికల, నవగాహ మొనర్చికొని యానందించుచుండెడివాడు.

బహుమనీ సులతాను డగు "మహమ్మద్‌షా" యనువాడు మధుపాన మత్తవివశుండయి యున్న సమయమున సంగీతవిద్వాంసులు కొందఱు వచ్చి "యమీర్ ఖుసూ" రచించిన గీతముల రెండింటిని శ్రావ్యముగ బాడి వినిపింపగా, దన్మయుడై యొడలెఱుంగని రీతి మధువును సేవించియున్న నుకోన్నతబంధిత మగుటచే జిత్తమిగు రొత్తసన వజిరుడగు "మల్లిక్ సయ్యఫ్ ఉద్దీన్" నకువాని రావించి 'విజయనగరకోశము' (Vizianagar Empire Treasary) నుండి ద్రవ్యమును గైకొని యీ కళోపాసకుల బహూకరింపవలసిన"దని యాజ్ఞనొసంగెను గాని వజీరాతని యాజ్ఞ బాటింప డయ్యెను. కాగా మఱునాడు సులతాను వజీరును బిలువంబనిచి "నిన్నటి సంగీతవిద్వాంసుల సత్కరించి యనిచితివా?" యని యడుగ, నవ్వజీరుడు 'లేదనియెను. అప్పలుకు నాలించి మహమ్మద్‌షా "ఓయీ! నా నోట వెడలిన మాట వ్యర్థము కాగూడ" దని హెచ్చరింపగా, వెంటనే మల్లిక్ సయ్యఫ్ ఉద్దీన్ సులతాను నాజ్ఞాపత్రముపయి రాజముద్రికను వైచి శీఘ్రగామియగు నొకచారునిచేతికిచ్చి విజయనగరమున కంపగా, విజయనగరచక్రవర్తి క్రోధోద్రిక్తమానసుండై దూతను బరాభవింపగా, నది కారణముగ గ్రీస్తుశకము 1366 వ సంవత్సరము జులై 23 వ తేది గురువారమునాడు సూర్యోదయసమయమున యుద్ధములను గయ్యమునకు సన్నద్ధు లయిరి. కడకట్టయనను "మహమ్మద్‌షా" సంగీతకళాభిమాని యని విదిత మగుచున్నదిగదా!

క్రీ. శ. 1625 లో జహంగీరు చక్రవర్తి పరిపాలనాకాలమున దామోదరమిశ్రుడు "సంగీతదర్పణము" ను గ్రంథము నొత్తరాహాగానపద్ధతి ననుసరించి వ్రాసి, రాగలక్షణముల వివరించు చిత్రములుగూడ నుటంకించినాడు "షాహజహాన్" చక్రవర్తి పరిపాలనాకాలములో జగన్నాథపండితుడను వాడు తన గానామృతమును బంచిపెట్టి తన యెత్తు వెండిబంగారములను "బీరంభాగ్" చక్రవర్తి యొద్ద బహుమాన మందెనట! అహోబల పండితుని "సంగీతపారిజాతము" క్రీ. శ. 1824 లో పారసీక భాషలోనికి ననువదింపబడినది. ఈ గ్రంథమున బంధ్రెండు స్వరముల నక్షరములలో వీణ కుండవలసిన తంత్రుల పొడవు లొనగు విషయములు సమగ్రముగ వివరింపబడినవి.

క్రీ. శ. 1397 వ సంవత్సరము నవంబరు 15 వ తేదీన రాజ్యమునకు వచ్చిన సులతాన్ దావూద్ కొమారుడగు "ఫిరోజ్‌సాహ" యనువాడు హరిహరరాయల ప్రబలసేనానివహంబుల నెదుర్కొనుపట్ల యోజనలు సాగించుచుండ సులతానుకడనున్న 'కాజీ' యొకడు మాయోపాయమున దక్సేనా నివహంబుల బరిమార్తునని చెప్పి, యనుజ్ఞ వడసి, ఫకీరువేషమును ధరించి, శత్రుసైన్యమున బ్రవేశించి, రాజపుత్రుని శిబిరమున కొచ్చి, యచట వారకాంతపై ననురాగముదయించినట్లు నటించి, తన సంగీతవిద్యచే నవ్వారవనితను మెప్పించి, యామె వేషమున జేరి నాట్యమున కయి రాజపుత్రు నెదుటకు బోయి, కత్తులతో నాట్యము సేయుచు, మోసముచే నాతని వధింపగా, శత్రువులు భీతావహులై చెల్లాచెదరైరట! సంగీతవిద్యా ప్రభావమున శత్రుసంహార మొనర్చిన "కాజీ" కి సులతాను దనేకవిధముల బహుమానము లొసంగి "వీరేతవు నీవే" యని యుగ్గడించెను. మధురములలో మధురమైన సంగీత మొక సమ్మోహనాస్త్రమే గదా!

కులాసా కబుర్లు :

"అందచందాలూ - పేరు ప్రతిష్ఠలూ"

శ్రీ జి. యన్. సూరి

లండన్ పట్టణంలోని చూడతగిన వింతలలో నేషనల్ పోర్ట్రెయిట్ గ్యాలరీ ఒకటంటారు. వివిధరంగాలలో ఘనాపాఠీ లనిపించుకున్న ఉద్దండుల చిత్రపటాలు అక్కడ తగిలించిఉంటాయి. మొదటినుంచి చివరదాకా వాటిని పరిశీలించిన ఒకధీమంతుడికి ఒక ఆశ్చర్యమైన విషయం స్ఫురించింది. ఆ గోడలను అలంకరించినవారిలో ముప్పాతిక మూడువాళ్ళు అనాకార్లని తోచింది. ఒకవేళ పొరబడ్డానేమోనని ప్రదర్శనమంతా తిరిగి చూసి వచ్చాడు. కాని ఉద్దేశం మార్చుకోవలసిన అగత్యం కనబడలేదు. అతిరూపాలా అందగాళ్ళు కారని స్పష్టమయింది.

ఈ విషయం ఇంగ్లీషువారి సొమ్మే కాదు; సర్వత్రా వర్తిస్తుంది. ఒక్కసారి మన దేశ చరిత్ర పుస్తకాలను తిరగవేసి చూడండి; బొమ్మలను గమనించండి. అలెగ్జాండరుకు ఒక భుజం పైకిపోయి రెండవ గూడ జారి ఉంటుంది. అశోక చక్రవర్తి కురూపి అని ఆయన ప్రేమించిన యువతే అంటుంది. దేశాలను జయించిన తైమూరు కుంటివాడు. రంజిట్ సింగ్ గుడ్డివాడు. శివాజి అయిదడుగుల రెండంగుళాల పొట్టివాడు. ఇలాంటివారు ఇంకా అనేకు లున్నట్లు చరిత్ర పరిశోధకులు చెపుతారు.

ఈ సూక్ష్మం తెలిసికోటానికి పూర్వచరిత్ర దాకా పోనవసరంలేదు. ఏ మునిసిపల్ ఆఫీసుకైనా వెళ్ళి పాత చైర్మనుల చిత్తరువులను చూడండి; మద్రాసు మ్యూజియంలోని బొమ్మలను చూడండి; కాలేజీలలోని పూర్వపు ప్రిన్సిపాలుల పటాలు చూడండి; హైకోర్టుకు వెళ్ళి పెన్షను పుచ్చుకున్న జడ్జీలవి పండిపోయిన లాయర్లవి తైలవర్ణ చిత్రాలు చూడండి; శాసనసభలకు కాంగ్రెసు కమిటీ మీటింగులకు వెళ్లి అక్కడి సభ్యులను చూడండి; లేదా మద్రాసులో తరుచు జరుగుతూఉండే కవుల మేజువాణీలకు హాజరయ్యే సరస్వతీప్రసన్నులను చూడండి; అందగాళ్ళ సంఖ్య ఎంత స్వల్పమో తేటతెల్ల మవుతుంది.

అందగాళ్ళు ఎవరూ, అనాకార్లు ఎవరూ అని ఇదమిత్థంగా తేల్చిచెప్పటం కష్టమైనదే. అనురాగం ఉన్నచోట ఏ వ్యక్తీ కురూపిగా గోచరించకపోవటంకూడ నిజమే. అదీగాక పదిమందికీ అవలక్షణంగా కనబడేది ఒక్కొక్కరి దృష్టిలో సౌందర్యలక్షణంగా కూడ కనిపిస్తుందని ఒప్పుకోనక తప్పదు. కాని ఈ సందర్భంలో సాధారణంగా ఏవి అందమైన లక్షణాలని అందరూ నిర్ణయిస్తూ ఉంటారో వాటిని బట్టి తేల్చవలసిన దీ విషయం.

బొత్తిగా ప్రతిభ లేని వ్యక్తి అంటూ ఉండడం అసాధారణం. ఉన్న ప్రతిభను రాణింపచేసుకున్నవాడు ప్రఖ్యాతు డవుతాడు. అయితే ఈవిధంగా రాణింపచేసుకోటం అనాకార్ల సొమ్మేనా, అందగాళ్ళకు ఆ అవకాశం లేదా అనేది మరో విషయం. అవకాశం లేదనలేము గాని, దానిని పురస్కరించుకోరని మాత్రం చెప్పవచ్చు. ఈ గొడవనంతా ఒక శాస్త్రజ్ఞుడు పరిశోధించాడు. ప్రతివ్యక్తికి తనను ఇతరులు గమనించాలనే అభిలాష సహజంగా ఉంటుందిట. శరీరసంబంధమైన బాహ్యలక్షణాలే ముఖ్యంగా ఇతరుల దృష్టిని ఆకర్షించే ప్రధాన సాధనమట. పుట్టినప్పటినుంచి ఈ వాంఛ అమలులోకి వస్తుందట.

సంతానంలోకల్లా అందమైన బిడ్డను తల్లిదండ్రులు అనుకోకుండానే ఎక్కువగా ప్రేమిస్తారు. చుట్టాలు పక్కాలు గారాబం చేస్తారు. మాతి ముడుచుకోగానే కొండమీది కోతి దిగివస్తుంది. బాల్యం వదలినతరువాత విద్యార్థి దశలోకూడ అలాగే జరుగుతుంది. అందంగా ఉండేవాడిని ఫస్టుమార్కులు వచ్చే పిల్లలకంటె ఎక్కువగా పంతుళ్లు ఆదరిస్తారు. వద్దన్నకొద్దీ స్నేహితులు పోగవుతారు. తరువాత అందమైన అమ్మాయిని చూసి అంటకడతారు. ఇట్టే మానేస్తేటికి ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుంది. ఉద్యోగం దొరకకపోతే సినిమాలోనైనా చేరుతాడు. ఒయ్యారంగా జీవితయాత్ర గడుస్తుంది. అంతటితో అబ్బాయికార్యకలాపం పూర్తి అవుతుంది. తైలచిత్రాలలో ఎక్కే అదృష్టం మాత్రం పట్టదు.

ఇక అందగాడు గానివాడి విషయం గమనించండి. కన్నందుకు ఏదో ఆపేక్ష ఉన్నప్పటికీ తల్లిదండ్రులు పువ్వుల్లో పెట్టి పూజచెయ్యరు. చుట్టాలు పక్కాలు ఇకిలించటంతో సరిపుచ్చుకుంటారు. బడిపంతుళ్లు అసలే గుర్తించరు. స్నేహితులు దొరకటమే కష్టమవుతుంది. ఏఅందమైన అమ్మాయీ వరించదు. శ్రమపడితేనేగాని శిఫార్సులు, దానివల్ల ఉద్యోగమూ లభ్యం కాదు. ఇలాంటి "అగ్లీడక్లింగు"కు ఇదంతా చూస్తే కడుపుమండిపోతుంది. లోకాన్ని పాదాలమీద పడేట్లు చేసి తీరాలని నిశ్చయించుకుంటాడు. శక్తిసామర్థ్యాలకు సాన పెడతాడు. ప్రపంచంమీదికి దండయాత్ర బయలుదేరుతాడు.


ఫస్టుమార్కులు తెచ్చుకుని పరీక్షలన్నిటినీ కబళించివేస్తాడు. పోటీచేసి ఉద్యోగాన్ని సంపాదిస్తాడు; లేదా స్వతంత్రమైన వృత్తిని అవలంబించి అద్వితీయు డనిపించుకోటానికి నిరంతరం కృషిచేస్తాడు. సామాన్య రూపసి అయిన కట్టుకున్న భార్యను ఆభరణాలతో అలంకరించి మురుసుకుంటాడు. వృత్తిలోనే గాక కళాప్రపంచంలోను, సాంఘికరాజకీయాలలోను విజృంభిస్తాడు. ప్రపంచమంతా తన్ను గుర్తించినదాకా నిద్రపోడు. పది పోర్ట్రెయిట్ గ్యాలరీలలోనైనా తన తైలచిత్రం ఎక్కేట్లు జీవయాత్ర సాగిస్తాడు.

అధికంగా అనాకార్లు అందల మెక్కటానికీ, ఏ కొద్దిమందో తప్ప అందగాళ్ళు అడుగంటటానికి ఇదీ కారణమని ఆ మనస్తత్వ శాస్త్రజ్ఞుడు విశదీకరించాడు. ఇంత సహేతుకంగా ఉన్న సమాధానం మనం ఆమోదించటంలో ఏలాంటి ఆక్షేపణా ఉండగూడదు. ఆక్షేపణ లేకపోగా సమంజసం కూడాను.

ఇదేవిధంగా, పైకి రావటానికి అందంగాలేకపోవటం ఎంత ఉపకరిస్తుందో దారిద్ర్యంకూడ అంతగా ఉపకరిస్తుంది. సూదికంట్లోనుంచి దూరటానికి ఒంటెకు ఎంత కష్టమో భాగ్యవంతుడికి స్వర్గలోకపు సింహద్వారం దాటటం అంత కష్టమని బైబిలు చెబుతుంది. అట్లాగే గోడమీది పటాలలోకి ఎక్కే విషయంలో కూడ జరుగుతుంది. గొప్ప వ్యక్తుల స్వీయచరిత్రలు చదివితే ఇది తెలుస్తుంది. రోడ్డుపక్కన ఉండే మునిసిపల్ గుడ్డిలాంతర్ల దగ్గర చదువుకున్న వాళ్ళంతా బ్రహ్మణ్యులైనట్లు ప్రతీతి. టేబుల్ ఫాన్ వేసుకొని, విద్యుద్దీపకాంతిలో చదువుకొని ప్రసిద్ధులయినవారి సంఖ్య చాల స్వల్పం. అయినా అటువంటి స్వీయచరిత్రలు ఇంకా ఆశే రాలేదు. ఈ సూత్రాన్ని అనుసరింతామని మా స్నేహితుడొకడు రోజూ కాసేపు వీధిదీపాల క్రింద పుస్తకం పట్టుకుని కూర్చుని అనవసరంగా కునికిపాట్లు పడేవాడు. ఒకనాడు తేలు అంటబొడవటంతో ఆ మార్గం వర్జించవలసివచ్చింది.

ఇంతకూ శాస్త్రజ్ఞులు తేల్చిన దేమిటంటే—పైకి రావటానికి దారిద్ర్యం, అనాకారితనం ఉపకరించినట్లు అందం, ఐశ్వర్యం ఉపకరించవు. అందంలేకపోవడానికి తోడు డబ్బులేకపోవడం కూడా ఉంటే అగ్నికి వాయువు తోడ్పడినట్లవుతుంది. ఇదంతా నిజమే కావచ్చు; లేక కాకపోవచ్చు. కాని, మీకు ధనసౌందర్యాలుకావాలా, లేక పోర్ట్రెయిట్ గ్యాలరీలలో తైలచిత్రాలు కావాలా అని అడిగితే, మేముమాత్రం మొదటివి రెండూ దయచేయించు, గోడమీది బొమ్మల సంగతి తరువాత చూసు కుందాములే అని నిష్కర్షగా చెప్పివేస్తాము. మీరూ మాతో ఏకీభవిస్తారా?

సాహిత్య మీమాంస :



'గంగాలహరి'లో 'పండితరాయలు'

శ్రీ సూరంపూడి భాస్కరరావు

'చిదానందానుభూతి'ని కలిగించడం కావ్యం యొక్క పరమావధి. ఈ అనుభూతిని కలిగించగలిగిన కవి స్వయంగా అనుభవించికూడా ఉండాలి. అందుకే కావ్యంలో కవిని చూడగలం.

మహాకవి కాళిదాసు మందాక్రాంతాన్ని మందాకినీప్రవాహంలా నడిపించాడు. పండితరాజు శిఖరిణిని భాగీరథీశయ్యగా చేశాడు. ఎవరు ఏ వృత్తాన్ని ఆధారంగా చేసుకున్నా శ్రవణరమణీయమైన పదబంధంతో, అవికలమైన ధారాశుద్ధితో ఆద్యంతమూ పూరించడమే శైలి యొక్క ఏకైకసిద్ధి. ఈ సర్వాంగసుందరమైన శరీరంలో పరిఫుల్లమైన రసాత్మ ప్రస్ఫురించినప్పు డది ఉత్తమోత్తమకావ్యం అనబడుతుంది. కవిలోని ఉత్తమోత్తమత్వమే కావ్యంలో ప్రతిబింబిస్తుంది. కవిలోని ఉత్తమోత్తమత్వం బాహిరమైన జీవితానికి సంబంధించ నక్కరలేదు. కవి రెండు జీవితాలు జీవించగలడు. ఒకటి సాధారణ జీవితం. రెండవది అతీతమైన ఆంతరజీవితం. అంతరజీవితంలోని పరిపాకము, అనుభూతులు, రసమగ్నత్వము కావ్యములోనికి చొరుతాయి. అతడి బాహిరజీవితంలో ఎన్ని కాలుష్యములున్నా అతని కావ్యజీవితం అమలినంగానే నిత్య పరిశుద్ధంగానే ఉంటుంది. కనుక కావ్యంలోని ఉత్తమత్వం పూర్తిగా కవికి చెందుతుంది.

గంగాలహరియొక్క ఇతి వృత్తం గంగాస్తవం. అయితే గంగాస్తవంలో ఉత్తమకవిత ఇమడగలదా? ఈ ఆశంక సమంజసమైనదే— చాలా స్తవములలో ఉత్తమత్వం రసం మృగ్యమైనాయి గనుక. కానిర్మల్లో కొన్ని చూడండి.

"తవాలంబా దంబ
స్ఫురదలఘుగర్వేణ సహసా
మయా సర్వేఽవజ్ఞా
రణి మథ నీతా స్సురగణాః;
ఇదా నీమౌదాస్యం
భజసియది భాగీరథి,తదా
నిరాధారోహా! రో
దిమి కథయ కేషా మిహ పురః ?"

"అమ్మా, నీ అండ చూచుకుని మహాగర్వంతో దేవత లందరినీ ధిక్కరించాను. ఈ వేళ నువ్వే ఈ రీతిగా ఉదాసీనత్వం వహిస్తే దిక్కులేనివాడి నైపోనూ? ఈ బాధ ఎవరితో చెప్పుకుని ఏడ్వగలనమ్మా?" ఏనాడో బాలకృష్ణుడు కపటంగా యశోదదగ్గర ఇదే ఏడ్పు ఏడ్చాడు. నాటినుంచి యుగయుగాల బాలకృష్ణులు తల్లిపొత్తిటిలో తల దూర్చి తమ బాధలని ఏడ్చినైచారు. ఈ తల్లిబిడ్డల స్వచ్ఛబాంధవ్యం రసపరిణతిని పొందలేదూ?

మరొకశ్లోకం —

"అపి ప్రాజ్యం రాజ్యం
తృణమివ పరిత్యజ్య సహసా
విలోలద్వానీరం
తవ జనని, తీరం శ్రితవతాం
సుధాతః స్వాదీయః
సలిలభర మాతృప్తి పిబతాం
జనానామానందః
పరిహసతి నిర్వాణపదవీమ్."

"అమ్మా, 'చతురంభోధిపరీతమైన ధరణీచక్రంబు' శాసించేవారంతా తమ సామ్రాజ్యాన్ని గడ్డిపోచగా యెంచి నీ ఒడ్డునీడని చేరుకున్నారు. అమృతంకంటె మధురాతి మధురమైన నీ నీరములను త్రావిన ఆ జనుల ఆనందం నిర్వాణసిద్ధిని అధఃకరిస్తున్నది." ఇది ప్రౌఢమైన వర్ణన. హ్లాదభూయిష్ఠమైన అతిశయోక్తి. కాని ఇందులో ప్రతిబింబించేది కవియొక్క గంభీరరసానుభవం. ఆ అనుభవాన్ని పొందుతూ అతడే, వేరుగా నిర్వాణపదవిని కోరడం అప్రశస్తం అనుకొన్నాడు. ఈ తల్లైన్యసిద్ధికి శబ్దమయమైన ఆకృతిని కల్గించినప్పుడు వర్ణన, అలంకారము పర్యవసన్నము లయాయి

"స్మృతం సద్యః స్వాంతం
విరచయతి శాంతం సకృదపి
ప్రగీతం య త్పాపం
ఝటితి భవతాపం చ హరతి;
ఇదం తద్గంగేతి
శ్రవణరమణీయం ఖలు పదం
మమ ప్రాణప్రాంతే
వదనకమలాంత ర్విలసతు."

"అమ్మా, నిన్నొక్కసారి తలచుకున్నంత మాత్రాన స్వాంతం శాంతిని పొందుతుంది. నిన్నుగూర్చి గొంతెత్తి పాడుకుంటే పాపాలు సంసారబాధలూ హరించిపోతాయి. ఈ నీ శ్రవణ రమణీయమైన నామం ప్రాణనిష్క్రమణవేళ నా నాలుకకొసను నిలుచునుగాక. ఎంత ఆప్యాయంగా హృదయంలోని భావాన్ని వెళ్లబుచ్చుకొన్నాడు! ఎంత తీవ్రమైన కోరిక! (మీరు మహోత్తమవ్యక్తిగా యెంచదగిన ఒక సజీవ వ్యక్తి, నా మిత్రుడు ఒకలేఖలో వ్రాశాడు. "గోదావరికౌగిటిలో కరిగిపోవడం, నాకు జీవితంలో సాధించవలసిన ఏకైకవాంఛగా గోచరిస్తోంది. అదే నాకు పరమానందాన్నివ్వగలదు.

(18 వ పేజీ చూడుడు)

గంగాలహరిలో పండితరాయలు

(17వ పేజీ తరువాయి)

నేను కోరగలిగిన ఆనందం వేరు లేదు.) ఎంత స్వచ్ఛమైన నిజమైన వాంఛ!

"న యత్సాక్షాద్వేదై
రపి గలితభేదై రవసితం,
నయస్మిఞ్జీవానాం
ప్రసరతి మనోవాగవసరః
నిరాకారం నిత్యం
నిజమహిమనిర్వాసితతమో
విశుద్ధం యత్తత్వం
సురతటిని, తత్త్వం న విషయః."

"అమ్మా, నీవెవరవో నే నెరుగుదును. ఈ సాధారణప్రజ తలుస్తూ ఉన్నట్టు లౌకికమైన నదీప్రవాహముకాదు నీవు. అద్వైతప్రతిపాదకములైన వేదములే దేనిని చెప్పలేకపోయారో, మానవుల మనస్సూ, మాటా దేనిని చేరలేకపోయాయో, ఆ నిత్యమైన, నిరాకారమైన, తమశ్ఛేదకమైనవి శుద్ధబ్రహ్మ స్వరూపానివి నీవే తల్లీ. ఆ తెలియరాని విశ్వరహస్యానివి నవ్వు." చూచారా, కవి వస్తువును వస్తువుగా స్వీకరించలేదు. ఆ వస్తువు తన భావనకి ఆలంబం. ఇక్కడ కవి వస్తువుని ఆరాధించలేదు. వస్తువును విశ్వమయంచేసి విశ్వాన్ని ఆరాధించాడు.

"పురో ధావన్ ధావన్
ద్రవిణమదిరాఘూర్ణితదృశాం
మహీపానాం నానా
తరుణతరఖేదస్య నియతమ్
మమైవాయం మన్తుః
స్వహితశతహన్తుర్జడధియో
వియోగస్తే మాత
ర్యదిహ కరుణాతః క్షణమపి."

"కల్లుత్రాగి రెప్పలుబారిన కండ్లతో, అనేకమంది నృపతులు తానే ముందుకి పరిగెత్తి అలసిపోయాను. వంద మంచి పనులు పాడుచేసుకున్నాను. మూర్ఖుణ్ని. నాదే తప్పు నిన్ను విడిచిపోవడం. మాతల్లివి గదూ, కరుణించవూ?" ఎంత అమాయికంగా తల్లిదగ్గర ప్రాధేయపట్టాడు! రాజుల రాజరికాన్ని ఎంతగా అసహ్యించుకొన్నాడు! ఎంతటి పశ్చాత్తాపం!

"అనాథః స్నేహార్ద్రాం
విగలితగతిః పుణ్యగతిదాం
పతన్ విశ్వోద్ధర్త్రీం
గదవిదలితః సిద్ధభిషజం,
సుధాసిన్ధుం తృష్ణా
కులితహృదయో, మాతర మయం
శిశుః సమ్ప్రాప్తస్త్వా
మహ మిహ విదధ్యాః సముచితం."

"అనాథుడు స్నేహార్ద్రురాలిని చేరుకొన్నట్లు, గతిలేనివాడు పుణ్యగతిని చూపే తల్లిని చేరుకొన్నట్లు, పడిపోయేవాడు ప్రపంచోద్ధారకురాలిని చేరుకున్నట్లు వ్యాధిసంపీడితుడు సిద్ధవైద్యుని చేరుకొన్నట్లు, దాహాతురుడు అమృతవాహినిని చేరుకొన్నట్లు, బిడ్డడిని నేను, తల్లివి నీదగ్గరికి వచ్చానమ్మా. నన్ను చేరదీసి ఆదరించవూ?" ప్రపంచంలో ఎన్నోరకముల బాధలున్నాయి. కాని అన్నిటినుండి రక్షించే ఉదారశీలురుగూడా ఉన్నారు. ఈ బాధలన్నీ కలిసినంత బాధ పండితరాయల హృదయంలో రేకెత్తింది. ఈ బాధలన్నీ తప్పించగల చల్లని తల్లిని చేరుకున్నాడు అందుకే.

"శ్వవృత్తివ్యాసంగో
నియత మథ మిథ్యాప్రలపనం
కుతర్కేష్వభ్యాసః
సతతపరపైశూన్యమననం
అపి శ్రావం శ్రావం
మమతు పున రేవంగుణగణాన్
ఋతే త్వత్కో నామ
క్షణమపి నిరీక్షేత వదనం."

"కుక్కలా ప్రతిరాజు దగ్గరికీ తిరుగుతూ, వారు పారవేసిన ముద్ద తింటూ గడిపాను. వ్యర్థంగా ప్రలపించాను. అనవసరపు తర్కాలు సాగించాను. ఇతరుల కపటవచనాలనే యెల్లప్పుడూ చింతించేవాడిని. ఇట్లాంటి గుణాలు వినివిని, నీవు తప్పితే నా దిక్కెవరు చూస్తారమ్మా?" ఎంత ఆత్మగౌరవం గలవాడో! యౌవనావేశంలో తెలివితక్కువ గొప్పలకోసం రాజసభలో పాండిత్యం ప్రదర్శించి చాటుమాటున ధనాంధులచేతుల్లో ఎన్ని అవమానాలు పొందాడో! అనవసరంగా వారందరినీ ప్రశంసించి ఇప్పుడు కించపడుతున్నాడు. 'అసఫ్ విలాసం' వ్రాసిన పండితరాయలు ఎంత అబద్ధపు పండితరాయలు! గంగదగ్గర కొచ్చి తన నిజం చెప్పుకున్నాడు

కియన్తః సన్త్యేకే
నియత మిహ లోకార్థఘటకాః
పరే పూతాత్మానః
కతిచ పరలోకప్రణయినః
సుఖం శేతే మాత,
స్తవ ఖలు కృపాతః పున రయం
జగన్నాథం శశ్వ
త్త్వయి నిహితలోకద్వయభరః."

"కొందరు ఈలోకంలోనే ఏవో ఘనకార్యాలు నిర్వహించటానికి పాటుబడతారు. మరికొందరు పవిత్రాత్ములు పరలోకం మీద దృష్టి నిలుపుతారు. నీదయవల్ల, రెండులోకాల భారమూ నీయందే ఎల్లప్పుడూ ఉంచి, ఈ జగన్నాథుడు సుఖంగా నిద్రిస్తున్నాడు." "అన్యథా శరణం నాస్తిత్వమేక శరణం మమ" అంటే ఇదేకదూ. తానుగా సాధించేది నిజానికి ఏదీ లేదుగా. పండితరాయల భావనలో గంగ బ్రహ్మస్వరూపమేగా. ఈ వాక్యం ఎప్పుడు ఉత్పన్నమౌతుంది? బ్రహ్మైక్యం పొందినప్పుడేగా. మరొకటి చూచారా, స్వయంగా తన పేరు చెప్పుకున్నాడు. కావ్యాల్లోనూ పరీక్ష వ్రాసే కాగితాల్లోనూ, స్వనామోదాహరణం గర్హణీయంగా చూస్తారు పెద్దలు. కాని ఇది పండితరాయల స్వీయగాథ కావ్యం గాదు. పెద్దలకి సంబంధించదు. తను తన ముందు చెప్పుకుంటున్నాడు. కావ్యంలో అంతగా తన వ్యక్తిత్వాన్ని చొప్పించుకున్నాడు. జగన్నాథుడనే ఏ వ్యక్తి ఉన్నాడో, అతడు గంగకి పరిపూర్ణంగా దత్తుడైపోయాడు అతడింక తానుగా మిగిలిలేదు.

ఇట్లే తన్నుతాను చింతించుకుంటూ తన అణిమని తన ఆరాధ్యంయొక్క మహిమని వర్ణిస్తూ చివరికి అంటాడు—

"జగన్నాథస్యాయం
సురధుని, సముద్ధారసమయః."

ఈ జగన్నాథుణ్ణి సముద్ధరించవలసిన సమయం ఆసన్నమయింది భగవతీ!

జగన్నాథపండితరాయల్ని తలచుకుంటే ఎంత ఆశ్చర్యం కలుగుతుంది. అంత వైభవాన్ని, అన్ని సౌఖ్యాలని, అంత ప్రఖ్యాతిని బడసిన కవి ఇంత దీనంగా విలపించాడేం? భవభూతి ఆంధ్రుడు. కరుణరసానికి విధాత. ఆంధ్రులలో కరుణరసం నైజమేమో. ఈనాటిదాకా మన జీవితాల్లో కరుణ వెల్లవిరుస్తూనే ఉంది.. యీ ఆత్మపరీక్ష, ఆత్మనివేదన, పరిదేవన, ఆనందమయత్వం, ఆనందాన్ని బ్రహ్మైక్యంగా తర్జుమాచేసుకోవడం, ఇటువంటి వ్యక్తినిగూర్చి చెప్పడానికి ఏముంటుంది? అతడు జీవితాన్ని ఆమూలాంతంగా అనుభవించినవాడై ఉండాలంతే! అతనిలో అంత శబ్దసౌష్ఠవం, భావపరిపాకం కళ్ళకి కనుపిస్తూంటే, అతడు 'మహాకవి' కాబోతూ కాబోతూ చిటికెనవ్రేలివాసిలో తప్పిపోయాడా అనిపిస్తుంది.

మద్రాసు మహాజనసభ

(7-వ పేజీ తరువాయి)

ముండిన గృహమును కొనుటకు సహాయము చేసియుండిరి. మద్రాసు మహాజనసభకు మొదటి అధ్యక్షులు పి. రంగయ్యనాయుడుగారే. వీరరాఘవాచార్యలుగారును, అనంతాచార్యలుగారును సంయుక్త కార్యదర్శులు.

తెల్లని కోటు, పూర్వకాలపు తలపాగ ధరించి ముఖమున తెల్లని పెద్ద బొట్టుతో పి. రంగయ్యనాయుడుగారనుదినమును హిందూపత్రికా కార్యాలయమునకు వచ్చుచుండురు. ఈయనయు, వీరరాఘవాచార్యలుగారును సు, బ్రహ్మణ్య అయ్యరుగారును మతాచారములందు, అభిప్రాయములందు వివిధసంప్రదాయములకు చెందినవారయ్యు దేశాభిమానమునందు మాత్రము ఏకీభవించి ప్రజాసేవనిమిత్తమే స్నేహితులైయుండిరి. రంగయ్యనాయుడుగారికి నిజదేశభాషలపై నభిమానము మెండు. ఆంగ్లేయుల జాత్యహంకారమును సహింపడు. ఈయన సనాతనధర్మవీరుడు. ఆస్తికుడు. దేశముకొరకు ఎంతటి స్వార్థత్యాగమునైన చేయుటకు వెనుదీయడు.

పనప్పాకం అనంతాచార్యలుగారు అచ్చమైన ఆంధ్రుడు. ఈయన సుప్రసిద్ధుడైన న్యాయవాది. శాసనసభలో సభ్యుడై పేరుపొందెను. ఈయన తన విమర్శలను నిర్భయముగా వెలిబుచ్చుచుండును. ఈయన సంస్కృతాంధ్రాంగ్ల భాషలయందు నిరుపమానమైన విద్వాంసుడు. ఈయన 1884 మొదలు, హిందూకార్యాలయమునసే ప్రకటింపబడుచుండిన 'పీపుల్సుమాగజీన్' అను మాసపత్రికను అతిసమర్థతతో నడుపసాగెను. ఆయన 1891 లో నాగపురమున జరిగిన జాతీయమహాసభకు అధ్యక్షులై మహోపన్యాసమును జేసి ప్రఖ్యాతుడయ్యెను. ఆయన పేరు పి. ఆనందాచార్యులని ప్రఖ్యాతిజెందినను ఆయన ఎల్లప్పుడును అనంతాచార్లు అనియే వ్రాలుచేయుచు తమ ఆంధ్రత్వమును ప్రకటించుకొనుచుండిరి. మహాజనసభవారి పక్షమున వ్రాయబడిన అనేకవిన్నపముల, వినీతిపత్రముల, మహజరుల వ్రాసిన దాయనయే. ఆయనకు గొప్పగొప్ప దేశములు దొరలు చాలమంది స్నేహితులైయుండిరి. ఇంగ్లాండునుండివచ్చిన పార్లమెంటుసభ్యులు, సంఘసంస్కర్తలు, క్రైస్తవమతబోధకులు నాయన కతిథులై పోవుచుండిరి. పురశైవాకములో, పూనమల్లివీధిలోని లేక్ వ్యూ అనబడు ఆయన గృహము ఎల్లప్పుడును వచ్చిపోయెడువారితో నిండియుండును.

1884 లో మద్రాసు మహాజనసభ స్థాపింపబడునాటి కింకను కాంగ్రెస్ జాతీయ మహాసభ స్థాపింపబడలేదు. పూనా సార్వజనిక సభతో పాటు, కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్ తోపాటును మన మద్రాసు మహాజనసభ కాంగ్రెస్ స్థాపనకు దారిదీసినదని చెప్పవచ్చును. చెన్నపట్టణ మహాజన సభ సభ్యులును, అడయారులో జరిగిన దివ్యజ్ఞానసమాజముయొక్క మహాసభకు దేశములోనుండి వివిధప్రాంతములనుండి వచ్చిన దేశీయప్రముఖులును కలిసి సమావేశమైన ఒక సభలో అఖిలభారత జాతీయప్రజాసభను నిర్మించుటనుగూర్చిన చర్చ జరిగి ఆమోదింపబడినట్లుకూడా తెలియవచ్చుచున్నది.

రాజకీయవ్యవహారములందు భారతీయుల పక్షమున పనిచేసి ప్రభుత్వమువారికి ప్రజల యభిమతమునుగూర్చి తెలిపి ప్రజాభిప్రాయమును మన్నించునట్లు ఒత్తిడిచేయుటకు బలీనమైన రాజకీయప్రజాసంఘమును నిర్మించుట అత్యవసరమని అందరికిని తెలిసివచ్చెను. చెన్నపట్టణములో గవర్నరైన గ్రాంట్ డఫ్ గారివలెనే గవర్నరుజనరలైన లిట్టన్ ప్రభువు కూడ నిరంకుశుడై ప్రవర్తించుచుండినందువలన ఇట్టి కేంద్రప్రజాసంఘమును స్థాపించుట అత్యవసరమయ్యెను.

లిట్టన్ తరువాత వచ్చిన రాజప్రతినిధియైన రిప్పన్ ప్రభువు, మంచివాడు ప్రజానురంజకుడు. అయితే ఆయన ప్రజలపట్ల సానుభూతి కనబరచుట ఆంగ్లేయోద్యోగులకును, ఈ దేశములో నుండిన ఆంగ్లేయ జనసంఘమునకును ఇష్టములేదు. అందువలన వారాయన ప్రయత్నముల కడ్డుతగులసాగిరి.

న్యాయవిచారణలందు తెల్లవారిని నల్లవారినో సమానముగ పరిగణింపదలచిన "ఇల్‌బర్టు బిల్లు" అనబడు శాసనమును చేయదలపగా నాంగ్లేయులందరు నేకమై అతితీవ్రమైన ఆందోళనమును చేసి దానిని ప్రతిఘటించిరి. అంతట ప్రభుత్వమువారు భయపడి ఆ చట్టమును ఉపసంహరించుకొనిరి. ఇందువలన రాజకీయాందోళనముయొక్క ప్రభావము దేశీయులకు తెలిసివచ్చెను.

ఆంగ్లేయ ప్రభుత్వము తెల్లవారి జాత్యహంకారముపైన నాధారపరుపబడియున్నదను సంగతి వెల్లడియయ్యెను. కాని ఆధిక్యతను శాశ్వతముగా నిలువబెట్టుకొనుటకు వారు ప్రయత్నించుచున్నట్లు స్పష్టపడెను. దీనిని ప్రతిఘటించుటకు దేశీయు లేకమై కృషి చేయవలసిన యావశ్యకత బోధపడెను. అందుకొరకు సంఘీభావమును అభివృద్ధిచేయుట అవసరమని గ్రహించిరి. వివిధరాష్ట్రములలో వివిధప్రజాసంఘము లున్నను భారతజాతీయ విషయమున నవి కలసి పనిచేయలేక పోవుట యొక గొప్ప లోపమనియు, అట్లు పాటుపడగల ఒక కేంద్రజాతీయమహాసభ యుండుట అత్యంతావశ్యకమనియు గ్రహించిరి. అయినను అది వెంటనే స్థాపింపలేకపోయిరి. జనానురంజకుడైన రిప్పన్ ప్రభువు తన యుద్యోగమును విరమించి 1884 లో సీమకు పోవుచుండగా, ఆయనను సన్మానించుటకు భారతీయులత్యుత్సాహమును ప్రదర్శించిరి. చాలచోట్ల సభలు చేసిరి. ఆయనకు బొంబాయిలో అనేక వినతి పత్రములొసగబడెను. అందులో మద్రాసు మహాజనసభవారి దొకటి. దానిని సమర్పించుట కొరకు అనంతాచార్యలు గారును, పి. రంగయ్యనాయుడుగారును, పి. త్యాగరాయశెట్టిగారును, పి. సోమసుందరము సెట్టిగారును స్వయముగా బొంబాయికి వెళ్ళిరి. సోమసుందరం సెట్టిగారే ఆ వినతిపత్రమును జదివిరి. అప్పటి కాయన కడు వృద్ధుడు. 40 సంవత్సరముల క్రిందట 1844 లో గాజుల లక్ష్మీనరసు సెట్టిగారితో కలసి ఆయన మద్రాస్ నేటివు అసోసియేషన్ స్థాపించి, దానికి కార్యదర్శిగ నుండినవాడు. తను తలపెట్టిన రాజకీయ కృషి నేటికి కొంతవరకు సఫలమైనదికదా యని ఆయన సంతోషించుచుండెను.

1884 లో దక్షిణ హిందూదేశ ప్రజల యభిప్రాయమును ప్రకటింపగల ఏకైకరాజకీయ ప్రజాసంఘ మామద్రాసుమహాజనసభయొక్కటే. మద్రాసు రాజధానిలోని వివిధప్రాంతములలో నుండు సభ్యులను చెన్నపట్టణమునకు రప్పించి సమావేశపరచి ఐకకంఠ్యమైన ప్రజాభిప్రాయమును కలిగింపదలచి ఈ మహాసభ స్థాపించిన మొదటి సంవత్సరములోనే వివిధ ప్రాంతముల ప్రతినిధుల సమావేశము నొకదానిని ఏర్పాటు చేసిరి. ఈ సమావేశము 1884 వ సం॥ డిశంబరు 29, 30 తేదీలలోను 1885 జనవరి 1, 2 తేదీలలోను మొత్తము నాలుగు దినములు జరిగెను. దేశముయొక్క రాజ్యాంగమును గూర్చియు, కేంద్ర రాష్ట్రీయ శాసనసభల అధికారములను గూర్చియు, న్యాయవిచారణ శాఖను, ప్రభుత్వశాఖను విడదీయుటను గూర్చియు, వ్యవసాయదారుల స్థితిగతులను గూర్చియు, స్థానిక స్వపరిపాలనా సంస్థల అధికారబాధ్యతలను గూర్చియు ఇంక ననేక విషయములను గూర్చియు చర్చింపబడెను. ఇట్లు కాంగ్రెసు మహాసభ జరుగుటకు ముందుగనే మద్రాస్ మహాసభ రాజకీయ సంస్కరణలను గూర్చి వార్షికసభయందు చర్చింప ప్రారంభించెను.

1885 వ సంవత్సరము డిశంబరు నెలలో మద్రాసు మహాసభయొక్క రెండవ వార్షిక సమావేశము జరిగెను. ఇది బొంబాయిలో జరిగిన మొదటి కాంగ్రెస్ మహాసభ సమావేశమునకు కొద్ది రోజులకు ముందుగా జరిగెను. ఈ సభకు వచ్చిన ప్రతినిధులే తరువాత మద్రాస్ రాజధానికి ప్రతినిధులుగా బొంబయిలోని కాంగ్రెస్ సభకు వెళ్ళిరి.

సర్ మౌంట్‌స్టూవార్టు గ్రాంట్ డఫ్ గారి నిరంకుశ పరిపాలన మెట్టకేలకు 1886 వ సం॥ డిశంబరు నెలలో అంతమయ్యెను. అప్పుడు మద్రాసు మహాసభవారు మర్యాద కొరకాయనకొక వినతిపత్రమును సమర్పించిరి. ఆ మహానుభావుడు తన సహజగర్వముతో—"మీరు రాజకీయ హక్కులను అపేక్షించుటకు ముందుగా మీ పెరళ్ళను శుభ్రముగా నుంచుట నేర్చికొనవలె" నని తన ప్రత్యుత్తరమున జెప్పెను.

1887 వ సం॥ ఏప్రిలు 16, 17 వ తేదీలలో మహాసభ యొక్క మూడవ సమావేశము కుంభకోణమున జరిగెను. తరువాత నీ సభ కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధులను పంపు స్థాయి సంఘముగా పనిచేసెను. ఇట్టి స్థితిలో 1907 వ సంవత్సరమున న్యాపతి సుబ్బారావు పంతులుగారి అధ్యక్షత క్రింద జరిగిన సభలో నొక ప్రత్యేక రాష్ట్రీయ కాంగ్రెస్ ఉపసంఘమును స్థాపించుటకు తీర్మానింపబడెను.

యుగసంధి

(6వ పేజీ తరువాయి)

ఒకనాడు వారు తిరిగిరావడం కొంచెం ఆలస్యమయింది. తోటలో వాళ్ళని చూడ్డానికి నికోలై పెట్రోవిచ్ బయలుదేరాడు. పొదరిల్లు సమీపించేసరికి అతనికి గబగబ వస్తున్న అడుగుల చప్పుడు, ఇద్దరు యువకుల గొంతుకలు వినబడ్డాయి. వారు పొదరింటికి రెండో పక్కని వస్తున్నారు. అంచేత అతన్ని వారు చూడలేదు.

"మానాన్నని నువ్వు బాగా ఎరగవు" అన్నాడు ఆర్కాడీ.

"మీనాన్న చాలా మంచిమనిషి" అన్నాడు బజరోవ్, "కాని అతను వెనకటితరం మనిషి; అతనిరోజులు గతించిపోయాయి"

నికోలై పెట్రోవిచ్ జాగ్రత్తగా విన్నాడు ఆర్కాడీ సమాధానం చెప్పలేదు.

ఆ వెనకటితరంమనిషి ఒక రెండు నిమిషాలు కదలకుండా నిలబడి విన్నాడు, మెల్లగా ఇంట్లోకి జారిపోయాడు.

"మొన్న అతను పుష్కిన్ చదువుతుండగా చూశాను," బజరోవ్ అంటున్నాడు ఈలోగా "అతనికి నచ్చచెప్పవోయి, దానివల్ల ఏమీలాభం లేదని చెప్పు. అతనేమీ కుర్రవాడు కాదు, ఈ పాటికి ఆ చచ్చు పుస్తకాలు వదలివెయ్యాలి. ఈ వయసులో ఆ కళాభిరతి, అదీ! ఏదన్నా పనికొచ్చే పుస్తకం చదివించవోయి"

"ఏదిమ్మంటావు?" అన్నాడు ఆర్కాడీ.

"ఏదో ఒకటి, బుక్నర్ 'ద్రవ్యము: శక్తి' బాగానే ఉంటుందనుకుంటాను"

"నాకూ అలాగే అనిపిస్తోంది. అన్నాడు ఆర్కాడీ అంగీకార సూచకంగా "'ద్రవ్యము శక్తి' తేలికభాషలో వ్రాశాడు."

"అలా కనిపిస్తుంది," అన్నాడు నికోలై పెట్రోవిచ్ ఆనాడు మధ్యాహ్నం భోజనం అయిన తరవాత పఠనమందిరంలో కూర్చుని తన అన్నతో. "మన మిద్దరం కాలానికి వెనుకబడి ఉన్నాం. మనరోజు గతించిపోయింది. ఏమో బహుశా బజరోవ్ చెప్పింది నిజమేమో. కాని చెప్పొద్దూ, ఒక విషయం నాకు చాలా బాధగా ఉంది, ఆర్కాడీతో ఎంతో చనువుగా కలిసిమెలిసి పోవాలని ఆశించాను. కాని చివరకి నేను వెనకబడిపోయాను, అతను ముందు వెళ్ళిపోయాడు. మా ఇద్దరిమధ్యా ఆత్మీయత ఇంక కుదరదు."

"అతను ముందుకి వెళ్ళిపోయాడా? ఏవిషయంలో మనని దాటి ముందుకిపోయాడు?" అన్నాడు పావెల్ పెట్రోవిచ్ అసహనంతో. "అతని తలలోకి అదంతా ఎక్కించింది, ఆమహా పెద్దమనిషి, ఆ నిహిలిస్టు. ఆ డాక్టరు కుర్రవాడంటే నాకు అసహ్యం. నా అభిప్రాయం అతను అంతా నటిబూటకమని. ఆ కప్పలూ గిప్పలూ అలాఉంచి, అతనికి వైద్యంకూడా ఏమీ తెలియదని నా నమ్మకం."

"కాదు, అన్నయ్యా, నువ్వలా అంటే వీలులేదు. బజరోవ్ తెలివయినవాడు. అతని శాస్త్రంలో అతను సిద్ధుడే."

"తరవాత అతని అహంభావం చూస్తే వొళ్ళు మండిపోతుంది" పావెల్ పెట్రోవిచ్ అన్నాడు.

"నిజమే" నికోలై పెట్రోవిచ్ అన్నాడు, "అతనికి అహంభావం ఉంది. కాని అది లేకపోతే లాభంలేనట్టు కనపడుతుంది. దాని విషయమయి నేను జాగ్రత్తపడలేదు. కాలంతోపాటు ముందుకి నడవడానికి నేను ప్రయత్నిస్తూనే ఉన్నాను; కొత్త వ్యావసాయిక కేంద్రాన్ని నడపడం ప్రారంభించాను. రైతులతో మంచి చేసుకున్నాను. నన్నొక విప్లవాభిప్రాయాలున్న 'రాడికల్'అనికూడా అంటూంటారు మన రాష్ట్రంలో. చదువుతాను, జాగ్రత్తగా చదివింది జీర్ణం చేసుకుంటూను—ఈనాటికి అవసరమనుకున్న పరిజ్ఞానాన్నంతనీ సేకరించడానికి ప్రయత్నిస్తుంటాను. కాని నా రోజు గడిచిపోయిందట. అన్నయ్యా, నిజంగా గడిచిపోయిందనికూడా నాకు అనిపిస్తోంది."

"ఏమి, ఎంచేత?"

"ఎంచేత నంటావా? పొద్దున్న పుష్కిన్ చదువుతూ కూర్చున్నాను... ...నాజ్ఞాపకం 'జిప్సీస్' గావును చదువుతున్నాను. చటుకుని ఆర్కాడీ వచ్చాడు. నేనొక చంటిపిల్లవాడినయినట్టు, జాలిగా, ఆదరంగా నా వేపు చూస్తూ, ఏమీ మాట్లాడకుండా, నాదగ్గరనించి ఆపుస్తకం తీసుకున్నాడు. దానికి బదులు ఇంకో పుస్తకం చేతి కిచ్చాడు—ఒక జర్మనుపుస్తకం.. చిరునవ్వునవ్వుతూ పుష్కిన్ చేత్తో పట్టుకు వెళ్ళిపోయాడు."

"ఏమిటి! నీ కిచ్చిన పుస్తకం ఏమిటి?"

"ఇదుగో ఇది."

నికోలై పెట్రోవిచ్, బాగా ప్రసిద్ధికెక్కిన ఆ బుక్నర్ పుస్తకం కోటుజేబులోనించి తీసి చూపించాడు. ఆపుస్తకం తొమ్మిదవసారి ముద్రణ జరిగింది.

పావెల్ పెట్రోవిచ్ పుస్తకం పేజీలు ఇటూ అటూ తిప్పాడు.

"ఊం!" అని ఉద్రేకంతో అన్నాడు "ఆర్కాడీ నికోలేవిచ్ నీ జ్ఞానాభివృద్ధినిగురించి శ్రద్ధ తీసుకుంటున్నట్టు కనబడుతుంది. అయితే ఇది చదివి చూశావా?

"ఆ చదివిచూశాను."

"ఏమిటి నీ అభిప్రాయం?"

"నేను వట్టి మూర్ఖుడి నయినా కావాలి— అదంతా వట్టి అర్థంలేని గొడవయినా అయుండాలి. నేనే మూర్ఖుడినని తోస్తుంది"

"నువ్వింకా జర్మన్ భాష మరిచిపోలేదూ?" పావెల్ పెట్రోవిచ్ ప్రశ్నించాడు.

"అబ్బే. జర్మన్ భాష అర్థమవుతుంది"

పావెల్ పెట్రోవిచ్ మళ్ళీ పుస్తకంలో పేజీలు తిప్పాడు. కనురెప్పల క్రిందనించి తమ్ముడివేపు చూశాడు. ఇద్దరూ కొంత సేపు మౌనంగా ఉన్నారు.

"ఒహో! మరచిపోయాను" నికోలై పెట్రోవిచ్, సంభాషణ మార్చడానికి అన్నాడు— "కొల్యాజిన్ దగ్గరనించి నాకో ఉత్తరం వచ్చింది."

"మాట్వే ఇలిచ్ దగ్గరనించా?"

"మరే. అతను, ఈ రాష్ట్రాన్ని తణిఖీ చెయ్యడానికి వస్తున్నాడు. అతను ఇప్పుడు బాగా పెద్దవాడయ్యాడు. బంధువులం గనుక మన నందరినీ చూడాలని ఉందట నిన్నూ, నన్నూ, ఆర్కాడీనీ పట్నానికి రమ్మని వ్రాశాడు"

"వెడుతున్నావా?" పావెల్ పెట్రోవిచ్ అడిగాడు

"లేదు. నువ్వు?"

"నేనూ వెళ్ళను నలభయ్యేళ్ళ నడుము ఈడ్చుకుంటూ, ఈ ఎండమావులకోసం ఎగబడ్డం బాగా ఉంటుంది. మాట్వేకి తన గొప్పని మనకందరికీ ప్రదర్శించడానికి ఈ ఆహ్వానం వాడూ వాడి గొప్పా! ఈ రాష్ట్రమంతా వంగి నమస్కారాలు చేస్తారుగా? మనబోటివాళ్ళు లేకపోతే లోటు లేదు ప్రీవీకౌన్సిల్ సభ్యత్వం, అబ్బ! ఎంత దర్జా! నేను ఉద్యోగంలో నిలకడగాఉండిపోయినట్టయితే, ఈ పాటికి నేను సర్వసైన్యాధిపతి పదవికి దగ్గరగా చేరుకుని ఉందును ఆపయిని నువ్వూ, నేనూ కాలానికి వెనక బడ్డాం కాదూ!"

"అవును అన్నయ్యా! మన మృత్యుపేటిక ఇంక మనం తయారు చేయించుకొని, గుండె మీద చేతులు ముడుచుకుని సిద్ధంగా ఉండవలసిన రోజు వచ్చినట్టు తోస్తుంది—" నికోలై పెట్రోవిచ్ నిట్టూర్పుతూ అన్నాడు.

"నేనంత సులువుగా లొంగిపోదలుచుకోలేదు," అతని అన్న పెదవులమధ్య అనుకున్నాడు. "ఆ డాక్టరుగాడితో నాకో యుద్ధం ఉంది. తప్పదు."

ఆనాడే సాయంకాలం తేనీరు తాగుతుండగా యుద్ధం వచ్చింది. పావెల్ పెట్రోవిచ్ ముందు సావడిలోకి యుద్ధానికి తయారుగా, ఉద్రేకంతో, మనస్సు సిద్ధంచేసుకుని వచ్చాడు. తన శత్రువుమీద పడిపోడానికి ఊరికే ఒక మిష కోసం చూస్తున్నాడు; కాని చాలాసేపటి వరకూ మిష ఏదీ దొరకలేదు. ఆ 'ముసిలి కిర్సనావ్'లముందు(వారిద్దరినీ అల్లా అంటుంటాడతడు.) బజరోవ్ సామాన్యంగా ఏమీ మాట్లాడడు. ఆ సాయంకాలం అతడు పరధ్యానంగా అదే పనిగా తేనీరు తాగుతూ మౌనంగా కూర్చున్నాడు. పావెల్ పెట్రోవిచ్ ఆపుకోలేకపోతున్నాడు; చివరకి అతనికి అవకాశం దొరికింది.

సంభాషణలో యదాలాపంగా ఇరుగుపొరుగుని ఉన్న ఒక భూస్వామిప్రశంస వచ్చింది. "పెద్దపుట్టుక పుట్టిన తెగనీలుగు, కల్లు ఉంది వాడికి," అన్నాడు బజరోవ్ మామూలు గొంతుకలో. అతన్ని పీటర్స్‌బర్గ్‌లో ఎరుగునట.

"తమరు అనుగ్రహిస్తే ఒకటి అడుగుతాను," పావెల్ పెట్రోవిచ్ ప్రారంభించాడు; అతని పెదవులు అప్పుడే అదురుతున్నాయి, "మీ అభిప్రాయంలో 'కల్లు' అన్నా 'పెద్ద పుట్టుక' అన్నా అర్థం ఒకటేనా?"

"నేనన్నది 'పెద్దపుట్టుక పుట్టిన తెగనీలుగు," బజరోవ్ సోమరిగా తేనీరు తాగుతూ నిర్లక్ష్యంగా సమాధాన మిచ్చాడు.

"అదే నేనూ అనుకుంటా; పెద్ద పుట్టుకపుట్టడం, తెగనీలుగు ఉండడం, మీ భావంలో ఒకటేనని నేననుకుంటాను. నేను మీ అభిప్రాయంతో ఏకీభవించడం లేదని మీకు చెప్పాలని నా కోరిక. నేను చాలా విశాలమయిన భావాలు కలవాడిననీ అభ్యుదయంకోసం పాటుపడే వాడిననీ, నన్ను ఎరుగున్నంతవరకూ అందరూ అనుకుంటారని "ప్రతిదాన్నీ కాదనడమే ఎక్కువ అవసరం. అంచేత మేం అన్నిటినీ కాదంటాము."

"అన్నిటినీ?"

"అన్నిటినీ" బజరోవ్ ఏమాత్రమూ తొణకకుండా స్థిమితంగా సమాధానంచెప్పాడు.

పావెల్ పెట్రోవిచ్ అతనివేపు తేరిచూశాడు. ఇల్లా వస్తుందని అతడు అనుకోలేదు. ఆర్కాడీకి సంతోషంతో ముఖం విప్పారింది.

"నాఅభిప్రాయం ఏమంటే," నికోలై పెట్రోవిచ్ మొదలు పెట్టాడు, "మీరు అన్నిటినీ కాదంటారు, సరిగ్గా చెప్పాలంటే మీరు అన్నిటినీ నాశనంచేస్తా మంటారు..... కాని కొంత సృష్టికూడా అవసరం, తెలుసునా?"

"ప్రస్తుతం అది మాపని కాదు...ముందు భూమినంతనీ శుభ్రం చేసెయ్యాలి."

"ప్రజలు ప్రస్తుతం ఉన్న స్థితిలో అది అవసరం," ఆర్కాడీ ఉదాత్తంగా అన్నాడు; "ఈ అవసరాన్ని గుర్తించి, మాపని మేము చేసుకుంటూపోవాలి, ఎవరి మనస్సంతృప్తికీ వారు లొంగిపోవడానికి వీలులేదు.

ఈ ఆఖరువాక్యం బజరోవ్‌కి నచ్చలేదని స్పష్టమే. అందులో కొంత వేదాంతపు వాసన ఉంది—ఒక రకమయిన కాల్పనికత. బజరోవ్ వేదాంతాన్నికూడా కాల్పనికమయినదని అంటుంటాడు. కాని తన శిష్యుడు చెప్పినదాన్ని సరిదిద్దడం అంత అవసరం లేదని అతడు ఊరుకున్నాడు.

"లేదు, లేదు," పావెల్ పెట్రోవిచ్ ఉద్రేకం తెచ్చుకుని అన్నాడు. "మీబోటి యువకులు రష్యన్ ప్రజానీకాన్ని అర్థం చేసుకున్నారని నేను ఒప్పుకోను. వాళ్ల అవసరాలకు, కృషికి ప్రాతినిధ్యం వహించగలరనికూడా ఒప్పుకోను. రష్యన్ ప్రజలు మీ రనుకున్నట్టు లేరు. వారికి సంప్రదాయాలమీద భక్తి ఉంది. ప్రభుభక్తి, పితృభక్తి మూలాధారాలుగా ఉన్న ప్రాచీన సంస్థవారి సమాజం; విశ్వాసాలులేకుండా వారు బ్రతకలేరు......"

"నేనది కాదనను," బజరోవ్ అతన్ని ఆపి అన్నాడు. "అంతేకాదు. ఈ ఒక్కవిషయంలోనూ మీరు చెప్పినది నిజమనికూడా నేను అంగీకరిస్తాను."

"నేను చెప్పినది నిజమైతే..... "

"అయినాసరే,అది దేన్నీ రుజువుచెయ్యదు."

"అది దేన్నీ రుజువుచెయ్యదు." అన్నాడు ఆర్కాడీ—ప్రజ్ఞగల చదరంగపు ఆటగాడు తన ప్రతికక్షి ఒక ప్రమాదమయిన ఎత్తు వేస్తాడని గ్రహించి, ఏమీ చెదరకుండా, స్థిమితంగా దానికి పై ఎత్తు తనకి తెలుసునన్న ధీమాతో ఉన్నట్టు, అన్నాడు.

"దేన్నీ ఎందుకు రుజువు చెయ్యదు?" పావెల్ పెట్రోవిచ్ వింతగా అడిగాడు. "మీరయితే ప్రజలకు వ్యతిరేకంగా నడుస్తున్నారన్న మాట కాదూ?"

"నడిస్తే ఏం?" బజరోవ్ గొంతెత్తి అడిగాడు. "ఉరుములు ఉరిమినప్పుడు ఈ ప్రజలు ఏ మనుకుంటారు? ఇల్యా ప్రవక్త తన రథం మీద ఆకాశమార్గాన పోతున్నా డనుకుంటారు. అయితే, వాళ్ళతో ఏకీభవించవలసినదేనా? ఆపయిని ప్రజలంతా రష్యనులే; నేనుమాత్రం రష్యన్ని కానూ?

"కాదు. మీరు రష్యనులుకాదు, మీ రన్నదంతా విన్నతరవాత! మీరు రష్యను లని నేను అంగీకరించలేను."

"మాతాత భూమి దున్నుకునే వాడు," అన్నాడు బజరోవ్ అతిగర్వంగా, "మీ రైతులలో ఎవరినయినా సరే పిలిచి అడగండి, మనలో—మిమ్మల్నో, నన్నో—ఎవరిని తమ వాణ్ణిగా తక్షణం అంగీకరిస్తారో? వాళ్ళతో ఎల్లా మాట్లాడాలో కూడా మీకు తెలియదు."

"మీరు మాత్రం అతనితో మాట్లాడుతూనే అతన్ని అసహ్యించుకుంటారు"

"వాడికి అంతకంటే అర్హత లేకపోతే. నా ధోరణిలో ఒక దోషముందంటారు మీరు. నా ధోరణి యాదృచ్ఛికంగా వచ్చిందని మీరు ఎందుకనుకోవాలి? ఏ జాతీయతాదృష్టినించి మీరు ఇంతవాదం చేస్తున్నారో ఆ జాతీయతనించే నా దృక్పథంకూడా పుట్ట లేదని మీరు ఎల్లా అనగలరు?"

"ఎంత చిత్రమయిన ఊహ! ఈ నిహిలిస్టుల వల్ల చాలా అవుతుంది!"

"వాళ్ళవల్ల ఏమవుతుందో, ఏమవదో నిర్ణయించేది మనం కాదు. చివరకు మీరు కూడా అంత నిరుపయోగమయిన మనిషి కారని మీకే ఒక అనుమానం ఉందిగదా"

"అయ్యా! దయుంచి వ్యక్తిదూషణలోకి దిగవద్దు." నికోలై పెట్రోవిచ్ లేస్తూ ఆదుర్దాగా అన్నాడు.

పావెల్ పెట్రోవిచ్ చిరునవ్వు నవ్వాడు. తన తమ్ముడి భుజంమీద చెయ్యివేసి కూర్చోపెట్టాడు

"కంగారు పడవద్దు" అన్నాడు—"నన్ను నేను మరచిపోను. మన డాక్టరుమిత్రులు పరిహసిస్తుంటారే, ఆ మర్యాదను నేను ఎన్నడూ అతిక్రమించలేను. ఒకటి అడుగుతాను," బజరోవ్ వేపు తిరిగి మళ్లీ ప్రారంభించాడు. "బహుశా మీఅభిప్రాయం, మీ సిద్ధాంతం కొత్తదని. అయితే అది పొరబాటు. మీరు కావాలంటున్న ఆ ద్రవ్యవాద మ్ముందే, అనేకసార్లు ఇదివరకు ప్రచారంలోకి వచ్చినదే. కాని అది స్వయంసంపూర్ణం కాని కారణంచేత పోతూ వచ్చింది."

"మళ్ళీ ఒక పారదేశికపదం!" బజరోవ్ అన్నాడు. అతని మనస్సులో అసహనం ప్రవేశిస్తోంది. అతని ముఖంమీద ఒక వింత తామ్రవర్ణం ఆవరించింది.

"మెదటి సంగతి, మేము దేన్నీ కావా లనడం లేదు. అది మా పద్ధతి కాదు."

చెప్పడానికి సాహసిస్తున్నాను; కాని నిజంగా ఆకారణం వల్లనే నాకు గొప్పపుట్టుక పుట్టిన వాళ్ళంటే గౌరవం ఉంది—నిజంగా గొప్పపుట్టుక పుట్టినవాళ్లంటే. తమ రీ విషయాన్ని దయుంచి జ్ఞాపకం ఉంచుకోండి," (ఈ మాట అనేసరికి బజరోవ్ ముఖం ఎత్తి పావెల్ పెట్రోవిచ్ వేపు చూశాడు.) "దయుంచి జ్ఞాపకం ఉంచుకోండి" పావెల్ పెట్రోవిచ్ మళ్ళీ అన్నాడు, తీవ్రంగా—"ఇంగ్లండులో ఉన్నతవర్గాలవారిని చూడండి. వాళ్ళ హక్కులలో పూచికపుల్లంతయినా వాళ్ళు జారవిడవరు. కాని ముఖ్యంగా అందుకోసమే, ఇతరుల హక్కుల నన్నింటినీ వారు మన్నిస్తారు. వారికి జరగవలసిన గౌరవమర్యాదలన్నీ జరిపించుకుంటారు. ఇతరుల యెడల తమకు గల బాధ్యతల నన్నింటినీ నిర్వహిస్తారు. ఉన్నతవర్గాలే ఇంగ్లండుకు స్వాతంత్ర్యాన్ని సంపాదించిపెట్టాయి, దాన్ని నిలబెడుతున్నాయి."

"ఆ కథ మేము చాలా చాలా విన్నాం" బజరోవ్ సమాధానంగా అన్నాడు; "అయితే మీరు దానివలన ఏది నిరూపించా లనుకుంటున్నారు?"

"నేను నిరూపించ దలుచుకున్నది ఏమంటే నండీ, అయ్యా,"

(పావెల్ పెట్రోవిచ్ కోపం వచ్చినప్పుడు తన వాక్యాలను అలా కత్తిరిస్తుంటాడు. కాని ఆ రకమైన ప్రయోగాలు వ్యాకరణ సిద్ధమయినవి కావని అతనికి తెలుసును. అలెగ్జాండరు కాలంనాటి అలవాటు, ఈ అతినాగరకమయిన నైలక్షణ్యంలో ఇంకా ఛాయగా కనబడుతుంటుంది. ఆనాటి అతి నాజూకు మనుష్యులు, ఎప్పుడేనా తమ స్వభాష మాట్లాడదలచుకున్న

(22-వ పేజీ చూడుడు)

భూటాన్ రాజ్యము-భారత సమాఖ్య


శ్రీ సీతంరాజు సుబ్రహ్మణ్యశర్మ

హిమాలయపర్వతముల తూర్పు చివరన బెంగాల్, అస్సాం సరిహద్దులలో భూటాన్ ఒక స్వతంత్రరాజ్యము. ఈ స్వతంత్ర రాజ్యము భారతదేశములో ఒకభాగమే కాని బ్రిటిష్‌భారతదేశములోగాని, బ్రిటిష్‌వారికి లోబడిన సంస్థానములలోగాని చేరినది కాదు. ఈ రాజ్యమంతియు భారతదేశములోనే యుండి, ఇతరరాజ్యములతో ఏమాత్రము సంబంధము లేకుంట వలన బ్రిటిష్‌భారత దేశముతో ఈ రాజ్యమునకు ప్రత్యేకసంబంధము లున్నవి. భూటాన్‌కు, బ్రిటిష్‌భారతదేశమునకు జరిగిన ఒడంబడికలద్వారా, భూటాన్ స్వతంత్ర రాజ్యమే యైనను, విదేశాంగవ్యవహారములు మాత్రము భారతదేశమే నిర్వహించునట్లు ఏర్పాటుచేయబడినది. అందువలన, వాస్తవ ప్రయోజనములదృష్ట్యా, భూటాన్, బ్రిటిష్ భారత దేశములో ఒకభాగముగానే, జనసామాన్యముచే పరిగణింపబడుచున్నది. బ్రిటిష్‌వారు భారత దేశమునుండి వైదొలగుటతో, భారతయూనియన్ భూటాన్‌ల సంబంధముల సమస్య తిరిగి తలయెత్తినది. ఈవిషయమై చర్చలు జరుపుటకు భూటాన్ ప్రతినిధివర్గ మొకటి గతవారం న్యూఢిల్లీ విచ్చేసినది.

భూటాన్ ప్రాముఖ్యము

అస్సాం, బెంగాల్‌లనుండి ఉత్తరముగా హిమాలయపర్వతములపై పుకు ప్రయాణము చేయుచున్నప్పుడు, రాష్ట్రముల పరిహద్దులు దాటిన తరువాతను, సరిహద్దులలోను, 4 వేల నుండి 8 వేల అడుగులవరకు ఎత్తుగల చిన్నపర్వత శ్రేణి మొదటగా కానిపించును. ఈ కొండలలో అక్కడక్కడా 'గండ్లు' లేక ద్వారము లున్నవి. ఈ ద్వారములు దాటి పర్వతముల వెనుకకు వెళ్ళినచో 40, 50 మైళ్ళ నిడివిగల సారవంతమైన మైదానము, ఆ తరువాత హిమాలయ పర్వతములు తగులును. అస్సాం, బెంగాల్ రాష్ట్రముల సరిహద్దులలో తూర్పు నుండి పడమరకు 190 మైళ్లవరకు వ్యాపించి వుండి, ముందు కొండలు, వెనుక మైదానము, హిమాలయములు గల ప్రదేశమే భూటాన్ రాజ్యము. ఈ దేశము తూర్పుపడమరల 190 మైళ్ళు పొడుగు వున్నా, ఉత్తరదక్షిణముల 90 మైళ్ళు కూడా వెడల్పు వుండదు. దేశం విస్తీర్ణం మొత్తం 18 వేల చదరపుమైళ్ళు. జనాభా మూడులక్షలకు మించి వుండదు. తూర్పున, ఉత్తరమున టిబెట్ దేశము, పడమర టిబెట్ దేశము, సిక్కింసంస్థానము, దక్షిణమున అస్సాం, బెంగాల్ రాష్ట్రములు ఈ దేశమునకు సరిహద్దులు. బెంగాల్‌లోని డార్జిలింగ్, జాల్పైగూరి జిల్లాలును, అస్సాంలోని గోల్‌పారా, కాంరూప్, దారంగ్ జిల్లాలును ఈ దేశమునకు ఆనుకొని వున్నవి. అస్సాం, బెంగాల్‌లనుండి భూటాన్‌లోనికి పోవుటకు ముందు వున్న కొండలవరుసలో అక్కడక్కడ దాదాపు 20 ద్వారము లున్నవి. భూటాన్‌నుదాటి హిమాలయపర్వతముల నవరోహించినగాని టిబెట్ చేరము. హిమాలయపర్వతములను దాటుట కష్టమగుటవలనను, పర్వతముల కవతలనున్న టిబెట్ బీదదేశ మగుటవలనను భూటాన్ అన్ని విషయములలోను భారత దేశముపైననే ఆధారపడియున్నది. భూటాన్ ప్రజలకు మాత్రము టిబెట్‌ప్రజలతో అతిసన్నిహితత్వ మున్నది. వీరు సామాన్యముగా టిబెట్ ప్రజలనే పోలియుందురు. భూటాన్ రాజమతము, అధికసనఖ్యాకులగు ప్రజలమతము బౌద్ధమతమే. టిబెట్‌పాలకు డగు దలైలామానే వీరు తమ ఆధ్యాత్మికాధికారిగా పరిగణింతురు. టిబెట్ ఆచారవ్యవహారములకు భూటాన్‌లో ఎక్కువ ప్రాబల్య మున్నది.

భూటాన్ మైదానము కొంతవరకు సారవంతమైనదే. శీతోష్ణస్థితి, సమశీతోష్ణమండలములో వలె నుండును. అందువలన మొక్కజొన్న మొదలగు మెట్ట ఆహారధాన్యములు పండును. కొండలపైన అడవులలో అన్నిరకముల జంతువులు కనిపించును. ఉష్ణమండలమునుండి, అతిశీతలమండలమువరకు కనిపించు అన్ని రకముల చెట్లు ఇచ్చట, కొండపై ఎత్తుకుపోయిన కొలదీ కనిపించును. ఈదేశవర్తకము, రాకపోకలు సంపూర్ణముగా భారతదేశమునుండియే జరుగవలసియున్నది. ఎగుమతి చేయదగిన ముఖ్యవస్తువేదియు ఈ దేశమున లేకపోవుటవలన ఈ దేశము భారతదేశముపై మరింత ఆధారపడి వుండవలసి వస్తున్నది. భారత దేశపు నైసర్గికహద్దులలో స్వతంత్రముగు దేశముండుట రక్షణదృష్ట్యా అంత వాంఛనీయము కాదు.



పోర్టుమత్ రేవులో రాయల్ ఇండియన్ నేవీదళ భాగాలు, రాయల్ నేవీతోబాటు శిక్షణ నందుతున్నారు ఇండియా హైకమిషనర్, శ్రీకృష్ణమీనన్‌గారు, "ఎట్రిజ్" అనే నావను ఇండియన్ నేవీ నావికులను సందర్శించినప్పటి దృశ్యం.

సంగ్రహచరిత్ర

భూటాన్ ప్రజలు ఆదిలో అందరూ హిందువులే; రాజు కూడ హిందువే. క్రీస్తుశకం తొమ్మిదవ శతాబ్దంలో టిబెట్ సైన్యములు దండెత్తి వచ్చి భూటాన్‌ను ఆక్రమించుకొనెను. అటు తర్వాత భూటాన్ తిరిగి స్వతంత్రమైనను, భూటాన్ ప్రజలకు టిబెట్‌తో ఏర్పడిన సన్నిహితత్వము మాత్రము స్థిరపడిపోయెను. చైనా సేనలుకూడ భూటాన్‌పై మూడునాలుగు పర్యాయములు దండెత్తివచ్చెనుగాని వారి దండయాత్రలు ఫలప్రదము కాలేదు. భూటాన్‌తో బ్రిటిష్‌వారి సంబంధములు 1772 వ సం. లో ప్రారంభ మైనవి. ఆ సంవత్సరములో భూటాన్ సైన్యములు కూచ్‌బీహార్ సంస్థానముపై బడి దోచుకొనగా, ఆ సంస్థానాధీశ్వరుడు బ్రిటిష్ వారి సహాయమర్థించెను. బ్రిటిష్‌సేనలు భూటాన్ సేనలను తరిమివేసి, వారు ఖైదీగా పట్టుకున్న కూచ్‌బీహార్ రాజును విడిపించి, భూటాన్ పైకి దండెత్తెను. టిబెట్ మతాధికారి తాష్ీ లామా జోక్యము కల్గించుకుని 1764 వ సం.లో బ్రిటిష్‌వారికి భూటాన్‌కు సంధి చేసెను. ఈ సంధిషరతులను భూటాన్ ఎప్పుడూ ఉల్లంఘించుచు, ప్రక్క రాష్ట్రములను దోచుకొనట జరుగుచుండెడిది. బ్రిటిషు వారు భూటాన్‌కు పంపిన రాయబారులను వీరు మొదట నిర్లక్ష్యము చేయుట, తరువాత అవమానించుట కూడ జరిగినది. ఆఖరుకు 1865 వ సం. లో బ్రిటిషు సేనలు భూటాన్‌పై దండెత్తెను. ఆ సంవత్సరం నవంబరు నెలలో భూటాన్ సేనలు పూర్తిగా ఓడిపోయెను. 1866 వ సం జనవరి నెలలో సించులా సంధి జరిగెను. ఈ సంధి ప్రకారం భూటాన్, బెంగాల్, అస్సాం సరిహద్దులలో నున్న కొండలలోని 18 ద్వారములు బ్రిటిషు వారి వశము చేయుటకు భూటాన్ అంగీకరించెను. ఇందుకు ప్రత్యామ్నాయముగా బ్రిటిషువారు సాలీనా 50 వేల రూపాయలను భూటాన్‌కు యిచ్చుటకు అంగీకరించిరి. ఈ ద్వారములు అప్పటినుండియు బ్రిటిషు ఇండియా ప్రభుత్వ ఆధిపత్యమునవనే వున్నవి. అప్పటినుండి కూడ భూటాన్ భారత ప్రభుత్వముతో సఖ్యముతోనే వ్యవహరించుచున్నది. 1910 వ సం. లో భూటాన్ భారత ప్రభుత్వముల మధ్య మరొక సంధి జరిగెను. భూటాన్ ప్రభుత్వము తన వైదేశిక విధానమును బ్రిటిషు ఇండియా ప్రభుత్వ సలహా ప్రకారము నిర్వహించుటకు ఇందుమూలకముగా అంగీకరించినది. భారత ప్రభుత్వము భూటాన్‌కు ఏటేటా చెల్లిస్తున్న సొమ్ము లక్షరూపాయలకు పెంచుటకు కూడా అంగీకరింప బడినది. 1917 వ సం. లో జరిగిన మరొక ఒడంబడిక ప్రకారం అస్సాం సరిహద్దులో నున్న ప్రాంతం, పొడుగునా, 10 మైళ్ళ లోపలివరకు వున్న కలు, సారా దుకాణము లన్నింటిని మూసివేయుటకు భూటాన్ అంగీకరించుట, ఇందుకు ప్రతిఫలముగా సాలీనా ఒక లక్షరూపాయ లిచ్చుటకు భారత ప్రభుత్వ మంగీకరించుట జరిగినది. భూటాన్‌ను కూడా బ్రిటిష్ ఇండియా సంస్థానములలో నొకటిగా పరిగణించవలసినదని ఇండియా మంత్రిని కోరుతూ భూటాన్‌ప్రభుత్వము 1922 వ సం. లో ఒక విజ్ఞప్తి చేసెనుగాని ఆయన అందుకు అంగీకరించలేదు. ద్వితీయ ప్రపంచయుద్ధకాలంలో భూటాన్ చేసిన సహాయమును గుర్తిస్తూ దానికి ప్రత్యామ్నాయముగా సంవత్సరమున కింకొక లక్షరూపాయలను చెల్లించుటకు భారతప్రభుత్వ మంగీకరించినది అందువలన భూటాన్‌కు భారతప్రభుత్వమిప్పుడు ప్రతిఏటా మూడులక్షరూపాయలు చెల్లించుచున్నది. భూటాన్ జనసంఖ్య మూడు లక్షలు. భూటాన్‌ప్రభుత్వ ఆదాయము, భారతప్రభుత్వమిచ్చు మూడులక్షలతో కలసి, మొత్తం నాలుగు లక్షలు మాత్రమే. భూటాన్‌ప్రభుత్వము వర్తకమునకేగాక, ప్రభుత్వయంత్రమును నడుపుటకు గూడ భారతప్రభుత్వముపై ఎంత ఆధారపడియున్నదీ ఇందువలన స్పష్టపడుచున్నది.

ఆగస్టు 15 వ తేదీ తర్వాత

1947 వ సం. ఆగస్టు 15 వ తేదీన భారత దేశం స్వతంత్రమైనతరువాత కూడ భూటాన్ భారతప్రభుత్వముల సంబంధములు ఇదివరకటివలెనే వుండవలెనని తెలియజేసినది. ఇందుకు భూటాన్‌కు భారత ప్రభుత్వము అవసరమగు యథాతథపు ఒడంబడిక కూడ చేసికొనబడినది. ఇండియా భూటాన్‌ల శాశ్వతసంబంధములను గురించి భారతప్రభుత్వముతో చర్చలు జరుపుటకు భూటాన్ ప్రతినిధివర్గ మొకటి గతవారం న్యూఢిల్లీ వచ్చెను. ఈ ప్రతినిధివర్గమునకు రాజా దోర్జె నాయకుడు. ఈయన ఇదివరకు సిక్కింలో భూటాన్ ప్రతినిధిగా పనిచేసియున్నాడు. శ్రీ జిగ్మిదోర్జె, ఉగ్యెన్ లెన్‌ధూప్, ఖండావ్, ఖండీగారలు ఈ ప్రతినిధివర్గములోని ఇతర సభ్యులు వీరందరు సంస్థానశాఖ కార్యదర్శి శ్రీ వి. పి మీనన్‌ను దర్శించినారు 1866 వ సం. ఇండో-భూటాన్ ఒడంబడికను సవరించవలెనని సూచిస్తూ వీరు ఒక పెద్ద మెమొరాండాను ఆయనకు ఇచ్చినట్లు తెలుస్తున్నది. వీరి రాకలోని ఆంతర్యము, వీరు కోరనున్న కోరికలను గురించి అధికారపూర్వకముగా ఇంతవరకు ఏమీ తెలియుటలేదు కాని, అనధికారముగా కొన్ని సూచనలు మాత్రము వస్తున్నవి. 1866 వ సం. ఒడంబడిక ప్రకారం భారతదేశమునకు కలపబడిన భూభాగములో 800 చదరపుమైళ్ళ ప్రాంతమును భూటాన్‌కు తిరిగి యిచ్చివేయవలసినదనీ, అందుకు బదులుగా భూటాన్‌కు చెల్లిస్తున్న ధనము తగ్గించవలసినదనీ వీరు సూచించగలరట. ఇందుకు భారతప్రభుత్వ మంగీకరించకపోయినచో, ప్రతిఏటా చెల్లిస్తున్న ధనపు మొత్తమును ఎనిమిది లక్షల రూపాయలకు పెంచి, 300 చదరపు మైళ్ల అడవి ప్రాంతమును తమకు తిరిగి యిచ్చివేయవలసినదని వారు కోరెదరట. వీరి కోర్కెలను గురించి ఆలోచించుటకు కొంత వ్యవధి కావలెనని భారత ప్రభుత్వము కోరినదని తెలుస్తున్నది. సంస్థాన శాఖామాత్యుడు సర్దార్ పటేల్ అస్వస్థతగా నున్నందున ఈ విషయమిప్పుడు సాకల్యముగా ఆలోచించుటకు అవకాశం లేకపోవచ్చును. ఎట్లయినను భూటాన్ కోర్కెలకు భారత ప్రభుత్వము సమ్మతించు ననుటకు అవకాశము లేదు. భూటాన్‌కు కావలసిన సమస్త వస్తువులు భారతదేశమునుండియే రవాణా కావలెను. వీనిపై ఇప్పుడెట్టి సుంకములు లేక, నిరాఘాటముగా వ్యాపారము జరుగుటకు భారత ప్రభుత్వ మంగీకరించినది. భూటాన్‌నుండి మానవులుగాని, వస్తువులుగాని బయటకు రావలెనన్న భారతదేశమునకు రాకతప్పదు. అట్టి పరిస్థితులలో భూటాన్ నుండి రాకపోకలపై భారతదేశము ఎట్టి నిర్బంధములు విధించినను భూటాన్ అమితముగా నష్టపడిపోవును. భూటాన్ ప్రభుత్వమునకు భారతప్రభుత్వ మిస్తున్న ధనము చాలదని చెప్పి, ఇంకెక్కువ సహాయము చేయవలసినదని కోరినచో భారతప్రభుత్వము భూటాన్‌కు ఎట్టి సహాయమైనను చేయుటకు సిద్ధముగానేయున్నది. కాని భూటాన్ తన విదేశాంగ వ్యవహారములను తానే స్వతంత్రముగా నిర్వహించుకొందునని, ఇదివరకు తన వద్దనుండి వశపరచుకున్న ప్రాంతమును తిరిగి యిచ్చివేయవలసినదని బెదిరించి భారతప్రభుత్వమును భయపెట్టవలెనని భూటాన్ ఆశించినచో, వారి ఆశలు అడియాసలై పోగలవు. 1922 వ సం. లో బ్రిటిష్‌వారు భారతదేశమును పరిపాలిస్తున్నప్పుడే తనను భారతసంస్థానముగా పరిగణించవలసినదని కోరిన భూటాన్, భారతదేశము స్వతంత్రమైన ఈనాడు అట్టి కోరికనే కోరియుండవలసినది. ఒకవేళ భూటాన్ సర్వస్వతంత్రమై, భారతదేశవ్యతిరేకవిధానము ననుసరించినను భారతదేశము ఎంతోకాలముగాని, ఎక్కువగాని నష్టపడు నవకాశము లేదు. భూటాన్ పరిస్థితిని అతిత్వరలో, తేలికగానే చక్కబరచవచ్చును. కాబట్టి, భూటాన్‌ప్రభుత్వము తాము భారతదేశముతో కలిసిపోవుటగాని, సఖ్యముగా నుండుటగాని తమ మేలుకొరకేనని గుర్తించి వ్యవహరించుట ఉభయులకు శ్రేయోదాయకము.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

ప్రత్తి ధరలు

కంట్రోలు తొలగింపు విధానమును ప్రకటించునపుడు, అందువలన ధరలు విపరీతముగా పెరిగిపోయి ప్రజాసామాన్యము నష్టపడిపోకుండునట్లు ధరల నదుపులో పెట్టుబాధ్యత వర్తకులపై, పారిశ్రామికవేత్తలపై నున్నదనియు, వారు తమ విధ్యుక్త ధర్మమును సక్రమముగా నెరవేర్చుటలేదని రుజువైనప్పుడు కంట్రోల్ ఇదివరకటికన్న తీవ్రతరముగా ప్రవేశపెట్టబడుననియు భారతప్రభుత్వము స్పష్టపరిచియే యుండును. ధరలు పెరిగిపోకుండ కాపాడు బాధ్యత తమదే నని పారిశ్రామికవేత్తలు మహాత్మా గాంధికి వాగ్దానముచేసిరని కూడ అప్పుడే తెలియవచ్చును. వస్త్రములపై కంట్రోల్ తొలగించిన తరువాత వర్తకులు తమ పూర్వవాగ్దానములను భంగము గావించి, ధరలను విపరీతముగా పెంచుట, వారి చర్యపట్ల ప్రభుత్వము అసంతృప్తి జెందియుండుట ఈ పుటలలో గతవారమే గమనింపబడినది. ముడి ప్రత్తి ధరల విషయములో కూడ వ్యాపారస్థులు ప్రజాశ్రేయస్సుకు విరుద్ధముగానే ప్రవర్తించుచున్నారని ఇటీవలి సంఘటనలవలన రుజువగుచున్నది. కంట్రోల్ తొలగించునప్పుడు 784 పౌనుల పుట్టి ముడిప్రత్తి గరిష్ఠధర రూ. 510 మాత్రమే వుండెడిది. ఇప్పుడు పుట్టి ధర రూ. 710 కూడ దాటిపోయినది. కంట్రోల్ తొలగించిన మూడునెలలలోనే ధర పుట్టి ఒకటికి రెండువందల రూపాయలు పెరుగుట ఎట్టివారికైనను ఆశ్చర్యమును కలిగించక మానదు. ముడిప్రత్తిధర ఇంత విపరీతముగా పెరుగుట వలన గుడ్డధరకూడ అనవుసరముగా పెరిగిపోవుచున్నది. ముడిప్రత్తిధర పెరుగుదల వలన లాభము పొందుచున్నది. పంటదారులు గాక ప్రత్తిలో స్పెక్యులేషన్ వ్యాపారము జరుపు కొందరు వ్యాపారస్థులు మాత్రమేననీ, ప్రత్తిధర పెరుగుటకు కారణము దేశములో తగినంత ముడిప్రత్తి లేకపోవుటగాక వున్న సరుకునంతను ఈ కొద్దిమంది వ్యాపారస్థులు ముందుగా కొనివేసివుంచి ఇప్పుడీ విధముగా లాభము పొందజూచుచున్నారనీ తెలిసినవారందరూ వారి చర్యను ఖండింపకపోరు. కొద్దిమంది వ్యాపారస్థులు ఈవిధముగా పరిశ్రమపైను, భారత ప్రభుత్వవిధానముపైనను దెబ్బ కొట్టుచున్న సంగతి భారతప్రభుత్వమునకు తెలియును. కాని వారిపై తొందరపడి ఎట్టి చర్యతీసుకొనుటకు ప్రభుత్వము ఇష్టపడుటలేదు కంట్రోల్ తొలగింపుసమయమున ముడిప్రత్తిధర కొంచెము పెరుగునని అందరు అనుకొన్నదే. పాకిస్థాన్ నుండి వచ్చునని భావించబడిన ప్రత్తిరవాణాకు ఆటంకములు కలిగించబడెను. హైదరాబాద్ సంస్థానమునుండి ప్రత్తిరవాణాకుకూడ ఆటంకములు కల్గెను. అందువలన ప్రత్తిధర కొంత వరకు పెరుగుటకు అవకాశముండెను. ఆ అవకాశమును స్వలాభముకొరకు కొందరు వ్యాపారస్థులు వినియోగించుకొని ధరలను విపరీతముగ పెంచివేసినారు. ఇతరప్రాంతములనుండి ప్రత్తి దిగుమతులు విరివిగా జరిగినచో ధర తగ్గునేమో యనుభావముతో భారతప్రభుత్వము, పాకిస్థాన్ నుండి దిగుమతియగుచున్న ప్రత్తిపై దిగుమతి సుంకమును తొలగించి స్వేచ్ఛా వ్యాపారమును నెలకొల్పెను. అయినను ప్రత్తి ధరలు పెరిగిపోవుచునే యున్నవి. పుట్టి 1కి రు. 750 వరకు ధర పెంచెదమని ఆ వ్యాపారస్థులు బహిరంగముగానే చెప్పుచున్నారు. సూడాన్ ప్రత్తిని బ్రిటన్‌కే ఎగుమతి చేయునట్లు ప్రత్యేక ఒడంబడిక చేసుకొనబడినది కాబట్టి సుడాన్ నుండి ఇండియాకు ప్రత్తి దిగుమతి కాదు. ఈజిప్టుప్రత్తిపై ఎగుమతి సుంకమును పెంచినారు. దానివలన ఈజిప్టు ఎగుమతులు తగ్గిపోయి, ఇతర ప్రాంతముల సరుకుపై వత్తిడి హెచ్చినది. మార్షల్ పథకం ప్రకారం అమెరికానుండి ఫ్రాన్సుకు ప్రత్తి క్రొత్తగా ఎగుమతిచేయబడుచున్నది. అమెరికానుండి చైనాకు కూడ 3 లక్షల బేళ్ళ ప్రత్తి ఎగుమతి చేయనున్నారు. పైగా అమెరికాలో ఈ సంవత్సరం పంట ఆలస్యముగా మార్కెట్ లోనికి వచ్చును. కాబట్టి ప్రపంచములో కావలసినంత ముడి ప్రత్తి లేదని తేలుచున్నది. గత సంవత్సరం కన్న ఈ సంవత్సరం మనదేశంలో 4,62,000 బేళ్ళ ప్రత్తి తక్కువగానున్నది. అందుచేత ప్రత్తి ధర రూ. /50 వరకు పెరగవలసినదేనని వీరివాదము. మనదేశపు అవసరములకు తగినంతప్రత్తి మనదేశములో వున్నది కాబట్టి ధరను విపరీతముగా పెంచుట అసమంజసమని ఇతరుల వాదము. తూర్పు ఇండియా ప్రత్తి సంఘము వారు సమావేశమై ధర పెరుగుదల అసమంజసమేనని తీర్మానించినారు. కాని ఆ మరునాడే ధర మరింత పెరిగిపోయినది. ప్రత్తి ధరను అదుపులో పెట్టి, కొద్దిమంది వ్యాపారస్థులు తమ స్వలాభము కొరకై ప్రజాసామాన్యమును దోచుకొనకుండ తగు నిబంధనలను భారతప్రభుత్వము వెంటనే చేయవలసియున్నది.

భారత రాజకీయాలు

(10 వ పేజీ తరువాయి)

జేసి, సురేంద్రమోహన ఘోష్ నాయకత్వమును' క్రొత్త మంత్రివర్గ మేర్పడవలెనని తాము కోరుచున్నట్లు తెలియజేసిరి. ఈ 25 గురిలో ఇద్దరు మంత్రులు, ఒక పార్లమెంటరీ కార్యదర్శికూడా వున్నారు. భూపతి మజుందార్ అను మరియొక మంత్రి తన పదవికి రాజీనామాకూడ యిచ్చెను. ఈ ప్రతిష్టంభన సందర్భములో డా. ప్రఫుల్లచంద్రఘోష్, డా. బి. సి. రాయ్‌గారలు కాంగ్రెస్ అధ్యక్షుడు డా. రాజేంద్రప్రసాద్, ప్రధాన మంత్రి పండిట్ నెహ్రూగారలతో సమాలోచనలు జరిపినారు. కాంగ్రెస్ కార్యవర్గముకూడ ఈ విషయమై ఆలోచించునని భావింపబడినదిగాని ఈ విషయము ప్రజాస్వామ్య సూత్రముల ప్రకారం శాసనసభ్యులే నిర్ణయించుకొనవలెగాని తాము జోక్యము కల్గించుకొనమని డా. రాజేంద్రప్రసాద్ స్పష్టపరచెను. మే 5 వ తేదీన సమావేశం కానున్న శాసనసభ్యులే నిర్ణయము చేయనున్నారో చూడవలసియున్నది.

తూర్పుబెంగాల్‌నుండి కాందిశీకులుగా హిందువులందరు వచ్చివేస్తున్నారు. అచ్చటి కాంగ్రెస్ నాయకులు వచ్చివేసినారు. వారచ్చటికి తిరిగివెళ్ళి, క్రొత్తప్రజాపక్షమును స్థాపించి అల్పసంఖ్యాకుల హక్కులను రక్షించు విషయమై శ్రద్ధ వహింపవలసియున్నది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రములో కమ్యూనిస్టుపార్టీ ఈ మధ్యనే బహిష్కరింపబడినది. కమ్యూనిస్టులు చాలమంది అజ్ఞాతవాసములో నున్నారు. వీరు విద్రోహచర్యలు జరిపి, కాంగ్రెసును న్యూనత పరచుటకు ప్రయత్నించుట సహజము. అట్టితరి రాష్ట్ర మంత్రివర్గము ప్రజాశ్రేయోభివృద్ధికై ఎక్కువ కృషిచేసి, కమ్యూనిస్టుపార్టీని బహిష్కరించినది ప్రజాశ్రేయస్సుకొరకేనని రుజువుచేసికొనవలసియున్నది. ఈ రెండు అత్యవసరకార్యములకు వెంటనే పూనుకొనక, తమలోతాము కలహించుకొనుచు కాంగ్రెస్ పలుకుబడికే ముప్పుముదెచ్చుట పశ్చిమబెంగాల్ కాంగ్రెస్ నాయకులకు తగని పని.

ఆంధ్రరాష్ట్ర నిర్మాణము

ఎ. ఐ. సి. సి. సమావేశమునకు హాజరైన ఆంధ్ర ప్రతినిధులు ప్రధాని నెహ్రూను దర్శించి, ఆంధ్రరాష్ట్ర సత్వర నిర్మాణమును గూర్చి నొక్కి చెప్పినట్లు తెలుస్తున్నది. రాజ్యాంగ పరిషత్తు సమావేశము జూలై నెలవరకు వాయిదా వేయబడుటవలన, ఆంధ్రరాష్ట్ర నిర్మాణమును గురించి ఆలోచించు కమీషన్ నియామకము కూడ అప్పటివరకు వాయిదా పడునని మన ప్రతినిధు లనుమానపడుట సహజము. డా. పట్టాభి, ఆచార్య రంగాగారలు డా. రాజేంద్రప్రసాద్, పండిట్ నెహ్రూలను అంతకుముందే దర్శించి 'కమీషన్ నియామకము వాయిదా వేయరాదని నొక్కి చెప్పియుండిరి. బొంబాయిలో ప్రధాని నెహ్రూను కలుసుకొన్న ప్రతినిధులుకూడ ఈ విషయమే పునరుద్ఘాటించిరి. రాజ్యాంగ పరిషత్తు సమావేశము వాయిదా పడుటవలన ఆంధ్ర రాష్ట్ర నిర్మాణము వాయిదా పడదనియు, విచారణ కమీషన్‌ను ఏప్రిల్ 30 వ తేదీననే రాజ్యాంగ పరిషత్తు అధ్యక్షుడు నియమించుననియు మన ప్రతినిధులకు చెప్పబడెనట. కాని ఏప్రిల్ 30 వ తేదీన అట్టి కమీషన్ ఏదియు నియమింపబడక పోవుట విచారకరము. కాశ్మీర్ హైదరాబాద్ సమస్యలను, ఇతర అత్యవుసర సమస్యలను ఆలోచించుచుండుటచే కేంద్రప్రభుత్వము ఈ విషయమున కొంత అశ్రద్ధ వహించియుండవచ్చును. ఆ ఆలస్యము ఆంధ్రులలో ప్రబలమైన అసంతృప్తికి కారణ మగుచున్నదని వారు గ్రహింపవలెను.

రాష్ట్రనిర్మాణవిషయమున ముఖ్యముగ గమనించవలసినది సరిహద్దుల సమస్య. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణ సందర్భమున ఆంధ్ర-తమిళ; ఆంధ్ర-కర్నాటక; ఆంధ్ర-ఓఢ్ర సరిహద్దులు నిర్ణయింపవలెను. భారతప్రభుత్వము నియమింపనున్న కమిషన్ సరిహద్దులనుగూర్చి సమగ్రముగ విచారింపవచ్చును. అంతవరకు వేచియుండక, ఈలోపున మన పొరుగువారితో కలసి మనమే సరిహద్దులను ఉభయులకు అంగీకారయోగ్యముగా నుండునట్లు ఏర్పరచుకున్న రాష్ట్రనిర్మాణము సులభసాధ్య మగును. ఆంధ్ర, తమిళ కాంగ్రెస్ కార్యవర్గములు సంయుక్త సమావేశము జరిపి ఆంధ్ర-తమిళ సరిహద్దులు నిర్ణయించవలెనని రివెన్యూమంత్రి శ్రీ కళా వెంకటరావుగారు చేసిన సూచన ఎంతేని హర్షింపదగినది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రంగాగారు, ఇతర పెద్దలు ఈ విషయమై వెంటనే శ్రద్ధ వహించి, సత్వరాంధ్రరాష్ట్ర నిర్మాణమునకు పాటుపడవలెను.

నిమ్నజాతుల భవిష్యత్తు

గతవారమున విజయవాడలో అఖిల భారత నిమ్నజాతుల లీగ్ సమావేశమును, లక్నోలో యు. పి. నిమ్నజాతి ఫెడరేషన్ సమావేశమును జరిగినవి. భారతదేశములో మత రాజకీయ సంస్థలన్నియు రద్దయిపోయినవి. ముస్లిం లీగ్‌మాత్రము రాజకీయములలో వుండీ, లేకుండ పనిచేయవలెననుకొనుచున్నది. ఇట్టి సమయమున నిమ్నజాతుల భవిష్యత్తును గురించి ఈ సమావేశములలో ఆలోచింపబడుట సంస్తవనీయము.

విజయవాడసభలో శ్రీ కూర్మయ్యగారు మాట్లాడుచూ, నిమ్నజాతులకు ప్రభుత్వోద్యోగములలో ప్రత్యేకత చూపించవలసిందేననీ, అయితే ఇతరత్రా సర్వవిషయములలోను నిమ్నజాతులు, ఇతరులు అనుభేదము వుండరాదనీ అన్నారు. ఈ కోర్కె అసమంజసముగా కల్పించినా, హరిజనులకు కొన్ని స్థానములను ప్రత్యేకించుటను ఎవ్వరూ కాదనరు. నిమ్నజాతులు తాము నిమ్నజాతులమన్న సంగతిని మరచిపోయి, ఇతరులతో సమానఫాయాలో వ్యవహరించుటయే ఇప్పుడు కావలసినది. నిమ్నజాతులలో విద్యావ్యాప్తి ఎక్కువైనకొలదీ ఉద్యోగములలో వారికి కొన్ని స్థానములు ప్రత్యేకించవలసిన అవుసర ముండదు. నిమ్నజాతుల లీగ్ వారు ఈ లీగును రద్దుపరచి, కాంగ్రెసునే ఏకైక సంస్థగా బలపరచినయెడలబాగుండెడిది.

విజయవాడ సమావేశములో నిమ్నజాతులు కనపరచిన విశాలభావములు లక్నోసభలో మృగ్యమైనవి. భారతస్వాతంత్ర్యప్రాప్తి తరువాత కాంగ్రెసుతో సహకరించి పని చేయుచున్న డా. అంబేద్కర్ తన నిజస్వరూపమును వెల్లడించెను. నిమ్నజాతులు కాంగ్రెస్‌లో చేరకుండా, వేరొక రాజకీయపక్షముగా ఏర్పడవలెననీ, అందుకుతగిన అవకాశము కొరకే తాను ఎదురుచూచుచుంటిననీ ఈయన స్పష్టపరచెను. కాంగ్రెస్‌సంస్థ నాశనమైనగాని నిమ్నజాతులు అభివృద్ధి జెందలేనట! కాంగ్రెస్ వారు, సోషలిస్టులు పోరాడుకొని నిమ్నజాతుల కాళ్ళవద్దకు వత్తురట! ఇట్టి సంకుచితభావములు నిమ్నజాతులకే అనర్థకమని నిమ్నజాతుల నాయకులందరు గుర్తించిరి; అంబేద్కర్ ఉపన్యాసమును వారందరు ఖండించుచున్నారు. కేంద్రమంత్రివర్గమునుండి ఆయనను తొలగింపవలెనని కూడ చాలమంది కోరుచున్నారు. ఇతర మతసంస్థలన్నియు రద్దయిపోయిన తరువాతకూడ నిమ్నజాతుల ఫెడరేషన్ రద్దవకపోవుట, పైగా సంకుచితప్రచారము ప్రారంభించుట ఏమాత్రము సమర్థింపదగినది కాదు.

బాలానందం

(15-వ పేజీ తరువాయి)

ఇందాకకూడా ఇంత చిన్నదాన్ని అవలేదు. మరీ యిల్లా చిక్కులు వచ్చిపడుతున్నాయేం!"

ఇల్లా అనుకొంటూండగా పాపకాలు జారి, ఎల్లా పడిందో, దబేలున నీళ్ళల్లో పడి మునిగి లేచింది. నీళ్లు మెడపైదాకా నస్తూ నోటికి ఉప్పఉప్పగా తగులుతూన్నాయి.

"ఉప్పగా ఉండేది సముద్రమేగా? సముద్రంలో పడిపోయా నన్నమాట. అయితే, ఇక్కడనుంచి ఒక రేవుకు చేరి, అక్కడినుంచి రైలుమీద మా ఊరు వెళ్ళొచ్చు. (పాప వాళ్ల ఊరునుంచి ఒకసారి రైలుమీద, ఓ సముద్రం రేవున్న ఊరుకు వెళ్లి, అక్కడ సముద్రస్నానం చేసి వచ్చింది. అందుచేత ఏ రేవైనా అల్లాగే ఉండి, తన ఊరుదాకా రైలుంటుంది కదా అనుకొంది).

కాని ఇంకాసేపు చూసేటప్పటికి తను ఉన్నది సముద్రం కాదనీ, కన్నీళ్ళమడుగు అనీ పాపకు తెలిసివచ్చింది. ఇందాక తను తొమ్మిది అడుగులఎత్తున ఉన్నపుడు కార్చిన కన్నీళ్ళన్నీ ఇల్లా మడుగుకట్టి, అందులో తను మునిగి తేల్తున్నానని తెలుసుకొంది.

"ఇందాక అంత ఏడవకుండా ఉంటే ఎంత బాగుండేది! అన్నీ ఇల్లాగే చేసుకోటం! వద్దంటూన్నా, కడవల కొద్దీ కన్నీళ్లు గార్చి ఒకటే ఏడుపాయెను! ఇప్పుడు నీ కన్నీళ్లలో నువ్వే మునిగిపోవాలి. చేసుకొన్నంతా అనుభవింపక, తప్పుతుందా?...అరెరె; ఇదెక్కడి వింత! ఎవళ్ళ కన్నీళ్లల్లో వాళ్లు మునిగిపోవటమేమిటి? అయినా ఇవాళ అన్నీ వింతలుగానే ఉన్నాయి!"

ఇల్లా అనుకొంటూనే, దోవా, తెన్నూ ఏమన్నా కనబడుతుందేమోనని పాప ఆ కన్నీళ్ళమడుగులో, ఈదుతున్నట్టు కాళ్లూ, చేతులూ బడబడా కొట్టుకొంటూ, తల ఎల్లాగో నీళ్లమీద తేల్చుకొంటూ, అటూయిటూ ఈదటం మొదలుపెట్టింది.

ఇంతలో ఆ మడుగులోనే కాస్త దూరంగా మరేదో జంతువో, మనిషో, ఏదో, నీళ్లు తపతపా కొట్టుతున్నట్టు శబ్దం వినిపించి, పాప అటు ఈదుకొంటూ శబ్దంవచ్చే దగ్గిరకు పోయింది.

యుగసంధి

(19-వ పేజీ తరువాయి)

ప్పుడు అల్లాంటి విశృంఖలమయిన ప్రయోగాలు విసురుతుండేవారు; వారి ధోరణిలో వ్యక్తమయ్యే భావం ఏమంటే, 'మేము జన్మవల్ల రష్యనులమే. కాని మేం చాలా గొప్పవాళ్ళం. మాకు పండితులు నిర్ణయించిన నియమాలను అతిక్రమించడానికి హక్కు ఉంది.')

"నేను దానివల్ల రుజువు చెయ్యదలచుకున్నదేమంటేనండి, అయ్యా, ఎవరిఉన్నతిని, ఎవరి ఆత్మగౌరవాన్ని వారు గుర్తించకపోతే-ఈ రెండు తత్వాలూ ఉన్నత వర్గాలలో పూర్తిగా వికసిస్తాయి--సమాజానికి . ప్రజానీకానికి.. సమాజ స్వరూపానికి పునాదులే ఉండవు. వ్యక్తిశీలం-అయ్యా!—అది అసలు ముఖ్యమయినది; ప్రతి మనిషియొక్క శీలమూ ఒక పర్వతంలాగ దృఢంగా నిలవాలి ఎంచేతంటే తక్కినదంతా దానిమీదే ఆధారపడిఉంటుంది. నా దుస్తులు, నా నాజూకు, నా అలవాట్లు, ఇవన్నీ తమకి హాస్యాస్పదంగా తోస్తాయన్న సంగతి నాకు బాగా తెలుసునని మనవిచేస్తున్నాను. కాని అవన్నీ, నా ఆత్మగౌరవం, నా వ్యక్తిబాధ్యత—అవును నా స్వంతబాధ్యత—నించే తప్పనిసరిగా ఉత్పన్నమవుతాయనికూడా మనవి చేస్తున్నాను. నేను పల్లెటూళ్ళల్లో ఉండవచ్చు, అరణ్యాల్లో ఉండవచ్చు. కాని నేనుమాత్రం కిందికి దిగిపోను. నాలో ఉన్న వ్యక్తిని నేను గౌరవిస్తాను."

"పావెల్ పెట్రోవిచ్, మిమ్మల్ని ఒకప్రశ్న అడుగుతాను," అన్నాడు బజరోవ్. "మిమ్మల్ని మీరు గౌరవించుకుంటూ చేతులు ముడుచుకుని కూర్చుంటారు. దానివల్ల, ఆ సమాజానికి ఏం లాభం? మీమీదమీకు గౌరవం లేకపోయినా అల్లా చేతులు కట్టుకునే కూర్చుంటారు"

పావెల్ పెట్రోవిచ్ కొంచెం తెల్లబోయాడు. "ఆ ప్రశ్న వేరు. తమరు శెలవిచ్చిన ప్రకారం నేనిల్లా చేతులుకట్టుకుని ఎందుకు కూర్చున్నానో అది తమకి విప్పిచెప్పవలసిన బాధ్యత నాకెంత మాత్రం లేదు. నేను చెప్పదలచుకున్నది ఒకటే. ఉత్తమజన్మ అనేది ప్రకృతిసిద్ధమయిన ఒక ధర్మం. ధర్మాలు లేకుండా మారోజుల్లో ఎవరూ బ్రతకలేకపోయేవారు—ఒక్క అవినీతిపరులు, మూర్ఖులూతప్ప. ఆర్కాడీ ఇంటికి వచ్చిననాడే నేనతనితో ఈ ముక్క అన్నాను, మళ్ళీ అంటున్నాను. అనలేదుటోయ్ నికోలై?"

నికోలై పెట్రోవిచ్ తల ఊపాడు.

"ఉత్తమ జన్మ, హృదయవైశాల్యం, అభ్యుదయం, ధర్మసూత్రాలు," బజరోవ్ అన్నాడు. "ఒక్కసారి తాపీగా ఆలోచించుకుంటే..అబ్బ! ...ఎన్ని అర్థంలేని, ఉపయోగంలేని పారదేశిక పదాలు! రష్యనులకు వాటివల్ల ఏమీ ఉపయోగంలేదు."

"తమ ఉద్దేశంలో ఉపయోగం ఉన్నదేముంది? తమ వాదాన్ని అంగీకరిస్తే, మానవత్వానికి బాహ్యులమయిపోతాం—ప్రకృతి ధర్మాలకు బాహ్యులమయిపోతాం. ఆలోచించండి నాచరిత్రను పరీక్షిస్తే ఒక తార్కిక సూత్రం......"

"మాకెందుకా తార్కికసూత్రం? అదీ అక్కరలేకుండానే బ్రతకగలం మేము."

"మీ అభిప్రాయం?"

"ఇది మా అభిప్రాయం. మీకు ఆకలివేసినప్పుడు రొట్టిముక్క నోట్లోపెట్టుకోడానికి ఏం తర్కంకావాలి? ఈ తర్కవితర్కాలవల్ల మాకేమిటి ప్రయోజనం?"

పావెల్ పెట్రోవిచ్ ఏదో ప్రమాదం జరిగినట్టు చేతులు పైకెత్తాడు.

"అయితే మీతత్వమేమిటో నాకసలే బోధపడడంలేదు. రష్యాప్రజల్ని మీరు దూషిస్తారు. ధర్మాలను, నీతి నియమాలను మన్నించకుండా ఎట్లా ఉంటారో నాకు తెలియడంలేదు. అయితే మీరు దేన్నిబట్టి నడుచుకుంటారు?"

"బాబయ్యా, నీకిదివరకే చెప్పానుగా, మేము ఏ.అధికారాన్నీ ఒప్పుకోము." ఆర్కాడీ మధ్యని అన్నాడు.

"మాకు ప్రయోజనకారిగా ఏది తోస్తుందో దాన్నిబట్టి మా నడత నిర్ణయమవుతుంది" బజరోవ్ అన్నాడు, "ప్రస్తుత పరిస్థితుల్లో

"అయితే మీరు ఏంచేస్తారో?"

"మేం ఏం చేస్తామో చెపుతాను. కొద్దికాలం క్రితంవరకూ, మేము అంటుండేవాళ్ళం—ఉద్యోగస్థులు లంచాలు పుచ్చుకుంటున్నారనీ, రోడ్లు బాగాలేవనీ, వర్తకం లేదనీ, వ్యాపారం లేదనీ, న్యాయం లేదనీ.... "

"అదా. మీరు సంస్కర్తలన్నమాట—మీరన్నదానికి పేరు అదే అనుకుంటాను. మీ సంస్కరణలలో చాలావరకు నాకు సమ్మతమే. కాని......"

"తరవాత, తరవాత, ఈ మాటలు, అస్తమానం ఉచ్చరించే ఈ మాటలు, మాటలుతప్ప ఇంకేమీ చెయ్యలేకపోవడం, దీనివల్లా లాభం లేదని అనుమానం కలిగింది. దీనివల్ల వట్టి పాండిత్యప్రకర్ష బూటకపు కబుర్లుతప్ప వేరే ప్రయోజనం ఏమీ లేదని గ్రహించాం. మామూలుగా నాయకులనుకునేవాళ్ళు, మన సంస్కర్తలు, నాగరకులు, వీరివల్ల పని ఏమీ జరగదని గుర్తించాం. మేము నిత్యమూ ఎందుకూ కొరగాని విషయాల్ని గురించి కాలం వృథపుచ్చుతున్నామని గ్రహించాం—కళని గురించి కొంత చెత్త మాట్లాడుతున్నాం, అజ్ఞాతసృష్టి వగైరా; పార్లమెంటరీ విధానం,న్యాయనిర్ణయవిధానం—ఇంకా దేవుడికి తెలియాలి ఏవేవో. ఇంతసేపూ అసలు ప్రశ్న మరిచిపోతున్నాం. తినడానికి తిండి కావాలి. అదీ అసలు సమస్య. అగాధాలవంటి మూఢ నమ్మకాలలో పడి మనం కొట్టుకుంటున్నాం. మన యత్నాలన్నీ విఫలమయిపోతున్నాయి. ఎంచేత? వాటిని నడపడానికి నిజాయితీగల మనుష్యులు లేక. మనప్రభుత్వం తలపెట్టిన భావిప్రణాళికలవల్ల చిన్నం ఎత్తు ఉపయోగం జరగదు. ఎంచేత? రైతు లందరూ కల్లుదుకాణంలో కర్చుపెట్టడానికి ఒకళ్ళనొకళ్లు సంతోషంగా దోచుకుంటారు."

"బాగుంది," పావెల్ పెట్రోవిచ్ సగంలో అన్నాడు, "బాగుంది; ఇదంతా జరుగుతున్న సంగతి మీకు రుజువయింది. అయినాకూడా మీకు రజువయింతే—అయినాకూడా మీరు ఏదీ చెయ్యడానికి పూనుకోకూడదని నిశ్చయించుకున్నారు."

"ఏదీ చెయ్యడానికి పూనుకోకూడదని నిశ్చయించుకున్నాం" బజరోవ్ తిరిగి అన్నాడు గంభీరంగా. అకారణంగా, ఈపెద్దమనిషిముందు ఇంత విపులంగా మాట్లాడినందుకు అతనిమీద అతనికే చిరాకు కలిగింది.

"ఊరికే దూషణమాత్రం చేస్తుంటారు."

"ఊరికే దూషణమాత్రమే చేస్తుంటాం."

"దానిపేరు నిహిలిజమ్."

"దానిపేరే నిహిలిజమ్," బజరోవ్ చాలా మొరటుగా ఆ పదాలు తిరిగి ఉచ్చరించాడు.

పావెల్ పెట్రోవిచ్ ముఖం కొంచెం పైకెత్తాడు. "అదన్నమాట!" చిత్రంగా గొంతుకను స్థిమితపరుచుకుని అన్నాడు. "మా కష్టాలన్నీ నిహిలిజమ్ తీర్చుతుంది. ఇంక మీరు, మీరు మా వీరపురుషులు, మా రక్షకులు. కాని మీరు తక్కినవాళ్లనందరినీ ఎందుకు దూషిస్తారు, ఆ సంస్కర్తలను కూడా? మీరుమాత్రం, తక్కిన వాళ్ళలా మాటలు వ్యయపరచరూ?"

"మా కున్న లోటుపాట్లు ఎల్లాంటివయినా, ఆ విషయమయి మాత్రం మేము నిర్దోషులం."

అయితే ఏమిటి? మీరుపోనీ ఏవన్నా పని చేస్తారా? ఉద్యమానికి తయారవుతున్నారా?"

బజరోవ్ సమాధానం చెప్పలేదు. పావెల్ పెట్రోవిచ్ శరీరంలో ఒక క్షణంపాటు ఉద్రేకపు కెరటం పోటు పొడిచింది. కాని అతడు ఆపుకున్నాడు.

"ఊఁ.. కృషి, నాశనం..."అతడు మళ్లీ అన్నాడు. "అయితే ఎందుకో తెలియనప్పుడు ఈ నాశనంమాత్రం ఎందుకు చెయ్యడం?"

"మే మొక శక్తిగనక, మేము నాశనం చేస్తాం"అన్నాడు ఆర్కాడీ. పావెల్ పెట్రోవిచ్ అతనివేపు చూసి నవ్వాడు.

"ఏ శక్తి నయినాసరే ఎందుకని ప్రశ్నించడానికి వీల్లేదు" ఆర్కాడీ కుర్చీలో తిన్నగా కూర్చుంటూ అన్నాడు.

"ఎంత దురదృష్టవంతుడవురా, అబ్బాయి!" అని విచారించాడు పావెల్ పెట్రోవిచ్. తన బింకాన్ని ఆట్టేసేపు నిలబెట్టుకోలేకపోయాడు. "మీ దేశానికి మీ రెంత అపాయం తెస్తున్నారో మీరు ఊహించుకుంటే! అబ్బే, మీ ధోరణి చూస్తే ఎంత శాంతమున్న దేవతకయినా సరే పిచ్చెక్కిపోతుంది. అరణ్యవాసిఅయిన కాల్మక్ లో లేదూ శక్తి? మంగోలియన్ లో లేదూ? అయితే ఎందుకది? మనకి విలువయినది నాగరకత; అవునండి, దాని ఫలితంగా వచ్చినవన్నీ మనకి అపురూపమయినవి. ఆ ఫలితాలన్నీ ఎందుకూ కొరగానివని నాతో చెప్పకండి. నిరుపేదవాడవనీయండి, ఒక రంగులువేసేవాడున్నాడనుకోండి,చదువురానివాడవనియ్యండి; అయిదు కానులిస్తే ఆనందంగా నృత్యసంగీతాన్ని వాయించి వినిపించే వీధి గాయకుడున్నాడనుకోండి; వాళ్ళంతా మీకంటే ప్రయోజకులు. వాళ్ళు నాగరకతకు ప్రతినిధులు; వట్టి పశుశక్తికి కాదు. మీ రంతా ముందుకి వెళ్ళిపోయారని మీ నమ్మకం; మీరు నిజంగా కాల్మక్ గుడిసెలలో ఉండదగినవాళ్లు. శక్తిట! శక్తిమంతులయిన యువకుల్లారా! ఇది గుర్తించుకోండి. మీరు అందరూ కలిసి మూడున్నరమంది ఉన్నారు, తక్కిన జనం కోటానుకోట్లున్నారు. వారు తమ పవిత్రధర్మాలను, సంప్రదాయాలను కాలి క్రింద పెట్టి మిమ్మల్ని తొక్కనివ్వరు. మిమ్మల్ని తొక్కివేసి మీమీదనుంచి నడిచిపోతారు."

"మమ్మల్ని తొక్కివేస్తే, పోతే పోతాం," బజరోవ్ అన్నాడు. "కాని అది అల్లాచులాగ్గా తేలే విషయం కాదు. మీరు అనుకునేటంత తక్కువ మందిమి కాము."

"ఏమిటీ? ఇంత ప్రజానీకాన్నీ వశపరుచుకో గలమని నిజంగా మీరు అనుకుంటున్నారా?"

"మీకు తెలియదేమో, ఒక కానీకొవ్వువత్తి మాస్కో నంతనీ కాల్చివేసింది" బజరోవ్ సమాధానం చెప్పాడు.

"అవునవును. మొదట గర్వం, అంతులేని గర్వం, తరవాత దూషణ—ఇవి, కుర్రవాళ్లని ఆకర్షించేవి, అనుభవం లేని కుర్రవాళ్ల హృదయాలను వశపరుచుకొనేవి? మీ ప్రక్కనే కూర్చున్నాడు. అల్లాంటి కుర్రవాడొకడు; మీ పాదధూళిని శిరసా వహించడానికి సిద్ధంగా కూర్చున్నాడు. అతన్ని చూడండి. (ఆర్కాడీ కోపముగా ముఖం పక్కకి తిప్పుకున్నాడు.) ఈ జాడ్యం అప్పుడే చాలావరకూ పాకింది. రోము వెళ్లిన మన చిత్రకారులు వాటికన్ లో అడుగన్నా పెట్టరని నేను విన్నాను. రాఫేల్ వట్టి చచ్చు దద్దమ్మని వాళ్ళ అభిప్రాయం. ఎంచేత! రాఫేల్ సిద్ధహస్తుడుగనక. వాళ్ల బొమ్మలన్నీ చచ్చుగా పేలవంగా ఉంటాయి. 'పౌంటన్ దగ్గర ఆడపిల్లలు' మొదలయిన దృశ్యాలకంటే పైఎత్తుకి వాళ్ళభావన వెళ్లదు. ఆ ఆడపిల్లలయినా అసందర్భంగా ఉంటారు. వాళ్ళంతా నచ్చుతారనుకుంటాను మీ మనస్సుకి?"

"నా మనస్సుకి" బజరోవ్ ఎదురుఅన్నాడు-"రాఫేల్ రాగిడబ్బు విలువ చెయ్యడు; వాళ్లందరూ అమాత్రమున్నా చెయ్యరు."

"బాగుంది! బాగుంది! ... ...వినవోయి ఆర్కాడీ. ఈ రోజులలో యువకులు మాట్లాడవలసిన విధానం అది. నిజమే. ఆలోచించిచూస్తే, మీ అడుగుజాడల్లో నడిస్తే వాళ్ళ కింక అపజయమే లేదు. పూర్వకాలంలో, యువకులు చదవవలసిన అవసరంఉండేది; మూఢులని అనిపించుకోడానికి వీలులేదు; అంచేత కష్టపడి చదవవలసివచ్చేది, వాళ్ళకి ఇష్టమున్నాసరే లేకపోయినాసరే. ఇప్పుడేమీ అక్కరలేదు. "ప్రపంచంలోవన్నీ వట్టి బూటకాలు!' అనేస్తే సరి, సరిపోతుంది. యువకులికి ఎంతో సంతోషం. నిజమే, ఇదివరకు వాళ్ళు వట్టి బాతులు; ఇప్పుడు అకస్మాత్తుగా నిహిలిస్టులయిపోయారు."

"పాపం మీలో ప్రశంసించవలసిన ఆ వ్యక్తిగౌరవాన్ని మీరే మరిచిపోతూన్నారు," బజరోవ్ పట్టిపట్టి అన్నాడు. ఆర్కాడీ దేహమంతా వేడెక్కిపోయింది, అతనికళ్ళు మెరుస్తున్నాయి. "మన వాదం చాలా దూరం పోయింది. దాన్నింక తుంచి పారెయ్యడం మంచిది. మీతో నేను ఏకీభవించడానికి సిద్ధంగా ఉన్నాను," అతను లేస్తూ అన్నాడు, "నాకు మన ప్రస్తుతజీవనవిధానంలోగాని, కుటుంబపద్ధతిలోగాని, సమాజంలోగాని, ఒక్క సంస్థను చూపించండి,—పూర్తిగా సమూలంగా నాశనం చెయ్యవలసిన అవసరంలేనిది—ఒక్కటి చూపించండి."

"కోట్లు చూపిస్తాను మీకు, అటువంటి సంస్థలు" పావెల్ పెట్రోవిచ్ గట్టిగా అన్నాడు "కోట్లు! ఎందుకు ఉదాహరణకి—మన * మిర్ లేదూ." మంచులాంటి చిరునవ్వు బజరోవ్ పెదవులమీద నిలిచింది.

"మిర్ విషయమయి" అతను వ్యాఖ్యానించాడు; "మీ తమ్ముడుగారితో మీరు సంప్రతిస్తే మంచిది. బహుశా ఈపాటికి ఆయనకి అర్థమయే ఉంటుందనుకుంటాను—దాని తాలూకు ధర్మాలు, నియమాలు, దాని గొప్పతనం, తదితర విషయాలు."

"పోనీ, కుటుంబం, మన రైతుల కుటుంబ పద్ధతి!" పావెల్ పెట్రోవిచ్ ఉద్రేకంగా అన్నాడు.

"ఆవిషయమయికూడా ఆట్టే మీరు వివరాలలోకి వెళ్ళకుండా ఉంటేనే నయం. కోడళ్ళను ఎంచుకోడం విషయంలో కుటుంబయజమానికి గల సావకాశాలన్నీ మీరు ఎరగరూ? నా సలహా ఇది. మీరు రెండురోజులు పాటు బాగా ఈవిషయమయి ఆలోచించండి పావెల్ పెట్రోవిచ్; తక్షణం మీ కేమీ జ్ఞాపకం రాకపోవచ్చును. మన సమాజంలో అన్ని తరగతులనుగురించీ జాగ్రత్తగా తర్కిస్తూ ఉండండి, ఈలోగా ఆర్కాడీ నేనూ కలిసి......"

"కలిసి అన్నివిషయాలనూ అపహసిస్తూ ఉంటారు," పావెల్ పెట్రోవిచ్ వాక్యాన్ని పూర్తిచేశాడు.

"కాదు, కప్పలను కోసి పరీక్షిస్తుంటాం. రావోయి ఆర్కాడీ. శెలవు"

ఇద్దరుస్నేహితులూ నడిచి వెళ్ళిపోయారు. అన్నదమ్ము లిద్దరూ మిగిలారు. ఒకరివేపు ఒకరు చూసుకున్నారు.

"అదన్నమాట," పావెల్ పెట్రోవిచ్ అన్నాడు. "ఈ తరంయువకులదంతా ఈ ధోరణి అన్నమాట! ఇలా తయారయారు—మన తరవాత తరంవాళ్ళు!"

"మన తరవాతతరం" నికోలై పెట్రోవిచ్ వెంగగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు. అతనికి అంతసేపూ ముళ్ళమీద కూర్చున్నట్టుంది. ఆర్కాడీ వేపుకష్టంగా రహస్యంగా అంతసేపూ చూస్తూ కూర్చున్నాడు. "నాకేమి జ్ఞాపకం వచ్చిందో తెలుసా, అన్నయ్యా? పాపం అమ్మతో నాకు ఒకసారి పేచీ వచ్చింది. ఊరికే రెచ్చిపోయింది, నా మాట వినదు. చివరకి నేనన్నాను, 'నిజమే నీ కర్థంకాదు. నీ తరం వేరు, నాతరం వేరు' అన్నాను. ఆమెకు ఎంతో కోపం వచ్చింది. నేననుకున్నాను. 'దీని విషయమయిచేసేది ఏమీ లేదు. ఇది చేదుమందే, కాని ఆమె మింగితీరాలి.' చూశావా,ఇప్పుడు మనవంతు వచ్చింది మన బిడ్డలు అంటారు 'నీతరంవేరు, నాతరం వేరు; ఈ చేదుమందు నువ్వు మింగితీరాలి!'";

"నీ అణకువ, నీ దాక్షిణ్యం పొద్దుపద్దులు లేకుండా ఉన్నాయి," పావెల్ పెట్రోవిచ్ అన్నాడు. "నా గట్టినమ్మకం ఏమంటే, ఈ కుర్రవాళ్ళకంటే మన మార్గమే సరియయినదని. మన భాష కొంచెం పాతబడి ఉండవచ్చు. మన కామాత్రం పొగరుబోతుతనం లేకపోవచ్చు.. ...ఈ కాలపు కుర్రవాళ్ల కున్న తల తిరుగుడు లేకపోవచ్చు. ఎవరినయినా అడుగు, 'నీకు ద్రాక్షరసం, ఎర్రనిది కావాలా, తెల్లనిదా?'అని. 'ఎర్రనిది ఎంచుకోడం నా అలవాటు' అంటాడు, గంభీరమయిన మగ గొంతుకలో. ఆ సమయంలో. లోకంఅంతా తన మీదే దృష్టి ఉంచి చూస్తోందన్నట్టు గంభీరంగా ముఖం పెడతాడు..."


"ఇంకా మీకు కాస్త తేనీరు కావాలా?" ఫెనీచ్కా అడిగింది, తలుపులోనించి ముఖాన్ని కనపరుస్తూ; వాదప్రతివాదాలు గట్టిగా వినబడుతున్నంతసేపూ ఆమెకు సావడిలోకి రావాలో కూడదో నిర్ధారణ కాలేదు.

"వద్దు, ఈ గిన్నె కుంపటి తీసుకుపొమ్మని చెప్పు," నికోలై పెట్రోవిచ్ జవాబుచెప్పాడు ఆమెను చూడగానే లేస్తూ. పావెల్ పెట్రోవిచ్ చటుక్కుని తమ్ముడికి శెలవు చెప్పి, తన పఠన మందిరానికి వెళ్లిపోయాడు.

---

* 'మిర్' అనేది ఒకరష్యన్ గ్రామపంచాయితీ విధానం. గ్రామంలోని భూమినంతనీ రైతులకు పంచి పంటను మొత్తంమీద వసూలు చేసే ఒక వ్యవస్థ.

బొంబాయికాంగ్రెసు చిత్రాలు




కార్యక్రమాన్ని ముగించివేస్తున్నారు రాజేన్ బాబు




సభ్యులతో ఛలోక్తులాడుతున్న డాక్టరు పట్టాభిగారు.



బొంబయి గవర్నరు విందులో సిగరెట్ కాల్చుతుంటున్న నెహ్రూ.



అఖిలభారత కాంగ్రెస్ సభాసన్నాహాలలో దేశసేవికలు.



అఖిలభారత కాంగ్రెసుకమిటీ సమావేశమునకు వెళ్లుచున్న కాంగ్రెసు అధ్యక్షుడు డా॥ రాజేంద్రప్రసాద్.




ప్రేక్షకుల మోటార్లతో గాంధీనగరం బయలు: తా క్రిక్కిరిసిపోయింది.



గ్వాలియాటాంకు మైదానంలో డాక్టరు కొత్వె తోంబదియవ జన్మదినోత్సవసభకు అధ్యక్షత వహించవస్తున్న బాబూ రాజేంద్రప్రసాదు.




బొంబాయిగవర్నరు సర్ మహారాజాసింగ్ ప్రధాని నెహ్రూను సందర్శించినప్పటి దృశ్యం. బి. జి. ఖేర్, మహారాజా, రాజేంద్రప్రసాదు, పండిట్ నెహ్రూ.



ఆర్ ఐ. ఎన్ కేడెట్ వర్గంవారు పండిట్జీ సైనికస్వాగత మిస్తున్న దృశ్యం.

Red No. M 4479



గాంధీ మహాత్ముని

ఆత్మకథ

ప్రథమ సంపుటము

[చతుర్థ ముద్రణము]

శతావధాని వేలూరి శివరామశాస్త్రిగారి అనువాదము

ఖద్దరు బైండు

వెల రూ 5-0-0 లు

తపాలచార్జి రూ. 0-9-0 లు.

(ద్వితీయ సంపుటము అచ్చగుచున్నది.)

ఆంధ్రగ్రంథమాల,

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

ఆంధ్రవిజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమ సంపుటమునందు డెమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౪, ఇతరపటములు ౧౩౫, వివిధ విషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డెమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అ:" మొదలుకొని "అశ్విని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౩ అమరావతీ స్తూపమునకును ౩ అనాహతమునకును చెందినవియు, ౬ దేశ చిత్రపటములును గలవు ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీ స్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయమను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱువేఱు హస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందు షట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆయా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౩౫౦కి పైగా నున్నవి. వివిధ విషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారు రేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౬౦౦ పుట లుండును.

ప్రతిసంపుటము వెల రూ. ౧౦.

పోస్టుద్వారా: రూ. ౧-౪-౨.

రైలుద్వారా దగ్గర రోట్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీథి, మదరాసు.

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T Madras.